



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 27 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ ఆదివారం 19 అక్టోబర్ 2025 పేజీలు : 12 వెల : 2/-


# ఉద్యోగులకు తీపి కబురు



- నవంబరు 1 నుంచి అమలు
- రెండు దఫాలుగా పోలీసులకు సరెండర్ లీవ్స్ సొమ్ము చెల్లింపు
- ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు పచ్చజెండా
- 60 రోజుల్లోగా ఈహెచ్‌ఎస్ పూర్తిగా ప్రక్షాళన
- తీపి కబుర్లు ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు బంపర్ బొనాంజా ప్రకటించింది. నవంబరు 1 నుంచి అమలయ్యేలా ఒక డీఏ ఇస్తున్నట్లు వెల్లడించింది. ఫలితంగా ప్రభుత్వంపై నెలకు రూ.165 కోట్ల (ఏడాదికి రూ.1,980 కోట్ల) మేర అదనపు భారం పడుతుంది. పోలీసులకు ఒక విడత సరెండర్ లీవ్స్ సొమ్ము ఇవ్వనుంది. ఈ ఏడాది నవంబరు, 2026 జనవరిలో రెండు దఫాలుగా రూ.105 కోట్ల చొప్పున చెల్లించనుంది. ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు సోమవారానికల్లా ఇవ్వనుంది. 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్‌ను ఉద్యోగినులు పదవీవిరమణ చేసేవరకు ఎప్పుడైనా వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించింది. ఉద్యోగ సంఘాల కార్యాలయాల భవనాలకు ఆస్తి పన్ను నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చింది. ఇప్పటికే ఉన్న బకాయిలన్నీ రద్దు చేసింది. ఉద్యోగుల వైద్య సేవల పథకాన్ని (ఈహెచ్‌ఎస్) 60 రోజుల్లోగా పూర్తిగా ప్రక్షాళించి మెరుగైన సేవలందించేలా చర్యలు చేపడతామని చెప్పింది. ఫ్యూన్, వాచ్‌మెన్, అటెండర్, - మిగతా 2లో



## పాక్‌లో ప్రతి అంగుళం 'బ్రహ్మోస్' పరిధిలోనే..

- 'సిందూర్' ఒక ట్రైలర్ మాత్రమే: రాజ్‌నాథ్ వ్యాఖ్య
- భారత్ వైపు కన్నెత్తి చూడొద్దని పాకిస్తాన్‌కు పరోక్షంగా హెచ్చరిక
- లక్నోలో తయారైన మొదటి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులు సైన్యానికి అప్పగింత

5



## ఎక్కడిదక్కడే ఆపేయండి

- యుద్ధం ఆపాలని రష్యా, ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడి పిలుపు
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో రెండుగంటలపాటు చర్చలు
- జరిగిన రక్తపాతం చాలు.. ఇక ఆపండని ట్రూత్‌లో పోస్ట్

# ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు!

- పక్కా ప్రణాళికలతో జల్ జీవన్ మిషన్ పనులు.. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి మొట్టమొదటిసారిగా శిక్షణ
- డిప్యూటీ సీఎం పవన్ చొరవతో గడువు పొడిగించిన కేంద్రం
- సిబ్బంది సామర్థ్యాల పెంపు, నీటి నాణ్యత, శుద్ధి, సరఫరాలకు ప్రాధాన్యం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రవ్యాప్తంగా జల్‌జీవన్ మిషన్ పనులు వేగం పుంజుకున్నాయి. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి గ్రామానికి రక్షిత నీటి భద్రత లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముం దుకెళ్తోంది. ఈ పనుల వేగవంతానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే విధంగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. సిబ్బంది సామర్థ్యాల పెంపు, నీటి నాణ్యత, శుద్ధి, సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామీణ రక్షిత తాగునీటి సరఫరా విభాగం సిబ్బందిలో అంతర్గత సామర్థ్యాలు పెంచేలా క్షేత్రస్థాయిలో చిన్న - మిగతా 2లో

# నేటి నుంచి లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన

**అక్కడి విశ్వవిద్యాలయాల్లో బోధనా పద్ధతులపై అధ్యయనం**

**సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కోసం రోడ్‌షోలకు హాజరు**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**



రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ నెల 19 నుంచి 24 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. 'స్పెషల్ విజిట్స్ ప్రోగ్రాం'లో పాల్గొనాల్సిందిగా ఆస్ట్రేలియా ప్రభుత్వం తరఫున ఆ దేశ హై కమిషనర్ ఆహ్వానం మేరకు ఆయన అక్కడ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాల్ని సందర్శించి అధునాతన బోధనా పద్ధతుల్ని అధ్యయనం చేస్తారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కోసం రోడ్ షోలలో పాల్గొననున్నారు. పలువురు పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులతో చర్చలు జరిపి రాష్ట్రానికి ఆహ్వానించనున్నారు. ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం 19వ తేదీ ఉదయం 11:30 గంటలకు ఆయన సిడ్నీ చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్స్ ఆవరణలో తెలుగు డయాస్పోరాలో పాల్గొంటారు.

# జీఎస్టీ ధమాకాతో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు

- సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగింది
- జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టాం
- దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోంది
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

5



## ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను కానుకగా ఇవ్వొచ్చు

**వార్షిక పాస్‌కు ఒకేసారి రూ.3000 చెల్లించడం ద్వారా తరచూ రీచార్జ్ చేయాల్సిన పని ఉండదు**




5

## ఒక్క రక్తపరీక్షతో 50 రకాల క్యాన్సర్లను గుర్తించొచ్చు




- కొత్త తరహా రక్త పరీక్ష విధానాన్ని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు
- క్యాన్సర్‌ను తొలిదశల్లో వేగంగా గుర్తించేందుకు మార్గం సుగమం
- ఈ బ్లడ్‌టెస్ట్‌తో వాటి ఆనవాళ్లను సైతం ముందే కనిపెట్టవచ్చు

5

# గట్టిగా తిప్పికొట్టండి!

- జగన్ కుట్రలు శ్రుతి మించుతున్నాయ్
- దళితులను రెచ్చగొట్టేందుకు అంబేద్కర్ విగ్రహాన్ని తగలబెట్టించారు
- లిక్కర్ స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకు నకిలీ మద్యాన్ని తెరపైకి తెచ్చారు
- పీపీపీల విషయంలోనూ వైసీపీ కుట్రలు
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ నేతలకు చంద్రబాబు దిశా నిర్దేశం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో అంబేద్కర్ విగ్రహాన్ని తమ పార్టీ సర్పంచితో తగులబెట్టించి, ఆ నెపాన్ని మనపై వేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. రూ.వేల కోట్ల మద్యంస్కామ్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు నకిలీ మద్యాన్ని తమ పార్టీ నేతలతో తయారుచేయించి, దానిని మనపై నెట్టేందుకు సిద్ధమయ్యారు. మెడికల్ కాలేజీల పీపీపీ విధానం విషయంలోనూ వైసీపీ నేతలు దుష్ప్రచారం సాగిస్తున్నారు. వీరి కుట్రలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించడంలో వెనుకబడుతున్నాం. జగన్‌ను, వైసీపీని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో తడబడుతున్నాం. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడమే లక్ష్యంగా వైసీపీ, ఆ పార్టీ అధినేత జగన్ చేస్తున్న కుట్రలు - మిగతా 2లో

# ఉద్యోగులకు తీపి కబురు

-మొదటిపేజీ తరువాయి

ప్లంబర్, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టుల పేర్లు గౌరవప్రదంగా ఉండేలా రీడిజిగ్నేట్ చేయాలని నిర్ణయించింది. ఉండవల్లిలోని నివాసంలో ఉద్యోగ సంఘాల నాయకుల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విలేకర్ల సమావేశంలో ఈ తీపికబుర్లు ప్రకటించారు. తొలుత మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ అయి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారంతా ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఉద్యోగ సంఘాల నాయకులందరితో మాట్లాడిన సీఎం.. ఆర్థిక ఇబ్బందులున్నా సరే ఉద్యోగులకు చేయాల్సినవన్నీ చేస్తున్నామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

**పీఆర్సీ బాధ్యత నాది..**

పీఆర్సీ గురించి నాకు వదిలిపెట్టండి. ఆర్థికంగా వెసులుబాటు వస్తే పీఆర్సీ ప్రకటించటం రోజుల పని. మీకు సుముఖంగా ఉండేలా చేస్తా.

2004 కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్లలో ఎంపికైన వారికే ఓపీఎస్ వర్తిస్తుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ సమస్యను ఎలా అధిగమించాలో చర్చిస్తున్నాం. దీంతోపాటు ఇతరత్రా సమస్యలన్నింటిపైనా మంత్రివర్గ ఉపసంఘం, నేను ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

మన దగ్గర మూలధన వ్యయం తగ్గిపోయింది రాష్ట్రాలన్నీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చు తగ్గిస్తూ, అభివృద్ధిపై ఎక్కువ ఖర్చు చేస్తున్నాయి. ఆ మూలధన వ్యయంతో ఆదాయం పెంచుకుంటున్నాయి. మన దగ్గర మాత్రం మూలధన వ్యయం బాగా తగ్గిపోయింది. ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలనో, మరో పేరుతోనో పెద్ద ఎత్తున అప్పులు తెచ్చారు. గత ప్రభుత్వం భవిష్యత్తులో తాగబోయే మద్యాన్ని సైతం తాకట్టు పెట్టి రూ.26 వేల కోట్ల మేర అప్పులు తెచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్లను తేవటం, ఆర్టీసీ విలీనం వల్ల ప్రభుత్వంపై అదనంగా రూ.10 వేల కోట్ల వేతనాల భారం పడింది.

మన రాష్ట్ర సొంత ఆదాయ వనరుల్లో 2023–24లో 93 శాతం మేర ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులకే వెచ్చించాం.



2024–25లో 93.50%, 2025–26లో 99.53% ఖర్చు చేస్తున్నాం. రాష్ట్ర సొంత వనరుల నుంచి రూ.51,442 కోట్లు ఆదాయమొస్తుంటే అందులో రూ.51,202 కోట్లు ఎస్టాబ్లిష్‌మెంట్‌కే ఖర్చయిపోతోంది. దక్షిణాదిలో ఎస్టాబ్లిష్‌మెంట్‌కు ఎక్కువ వెచ్చిస్తున్న రాష్ట్రం మనదే. తెలంగాణ 58 నుంచి 38 శాతానికి, తమిళనాడు 63 నుంచి 42 శాతానికి, కర్ణాటక 49 నుంచి 38 శాతానికి తగ్గించుకున్నాయి. ఏపీ మాత్రం దాదాపు 100 శాతం వద్దే ఉంది. గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల ఫలితమిది.

దీని వల్ల గత ప్రభుత్వంలో 94 కేంద్ర ప్రాయోజిత పథకాలకు డబ్బులివ్వలేదు. భవిష్యత్తు ఆదాయం తాకట్టుపెట్టి అప్పులు తెచ్చారు. అనుత్పాదక ఖర్చులకే ఆ మొత్తం వెచ్చించారు. జలజీవన్ మిషన్ కింద దేశవ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే ఏపీలో రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారు. ఈ రాష్ట్రంలో ఏం జరుగుతోందో ప్రజలకు, ఉద్యోగులకు అర్థం కావాలి. ప్రభుత్వం ప్రజల పక్షాన ట్రస్టీగా పనిచేస్తోంది. అందుకే ఈ వివరాలన్నీ వెల్లడిస్తున్నాం.

**గత ప్రభుత్వంలో ఉద్యోగులూ బాధితులే**

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులూ బాధితులే. కనీసం సమస్యలు చెప్పుకునేందుకు సమావేశాలు కూడా పెట్టుకోనీయకుండా ఇబ్బందులు పెట్టారు. వారు చేసిన విధ్వంసాన్ని పూడ్చేందుకు 20 ఏళ్లు పడుతుందని అప్పుడే చెప్పాను. కూటమి అధికారంలోకి రాగానే రూ.15,920 కోట్ల మేర బకాయిలు క్లియర్ చేశాం. గత బకాయిలు రూ.23,550 కోట్లకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు, పింఛన్లు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలన్నింటినీ గాడిలో పెట్టాం. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. ఉద్యోగులకూ మేలు చేస్తున్నాం. దీపావళి రోజున మీకు శుభవార్త చెప్పాలనే ఇవన్నీ ప్రకటించాం.

**ఉద్యోగులు రాష్ట్రాభివృద్ధికి రథచక్రాలు**

ఉద్యోగులు రాష్ట్రాభివృద్ధికి రథచక్రాలు. మీరంతా సంపద సృష్టిలో భాగస్వాములవ్వాలి. సంపద సృష్టిస్తే అది మీకే పంచుతా. మా ప్రభుత్వ విధానాల వల్ల రెండో ఏడాదిలోనే రెండో స్థానానికి చేరాం. వచ్చే ఏడాదికి మొదటి స్థానానికి ఎగబాకుతాం. కొన్ని ప్రభుత్వ శాఖల్లో 90 శాతం మేర సంతృప్తి ఉంటే మరికొన్ని 60–65 శాతమే ఉంది. ఆర్టీసీలో డ్రైవర్లు సరైన సమయానికి బస్సులు నడుపుతున్నారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు మాత్రం సరిగ్గా పనిచేయట్లేదు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గుంతలమయం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో గుంతలు లేకుండా చేశాం. ఉద్యోగులు స్మార్ట్ వర్క్ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి.

మీరు తప్పు చేస్తే ప్రభుత్వానికే చెడ్డపేరు ప్రభుత్వం మనందరిదీ అని గుర్తుంచుకుని ఉద్యోగులు పనిచేయాలి. ఉద్యోగులు, ఎన్డీయే కార్యకర్తలు ఎవరు తప్పు చేసినా ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తుంది. కూటమి మళ్లీ అధికారంలోకి రావాలి. అందుకే ఎక్కడా సమస్యలు లేకుండా సేవలందించాలి. గత ఎన్నికల్లో అత్యుత్తమ స్ట్రైక్ రేట్ సాధించాం. కొన్నిచోట్ల మా అభ్యర్థులుగా సరైన వారిని పెట్టుకోలేక ఓడిపోయాం. రాష్ట్రాన్ని పునర్నిర్మించే శక్తి మాకు ఉందని ప్రజలు ఓట్లేసి గెలిపించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.

**డీఏ బకాయిల భారమే రూ.7 వేల కోట్లు**

గత ప్రభుత్వ విధ్వంసాన్ని సరిదిద్దేందుకు 15 నెలలుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాం. కొన్ని బిల్లులు చెల్లించినప్పటికీ ఇంకా రూ.34,184 కోట్ల మేర పెండింగ్ ఉన్నాయి.

ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లు ఉన్నాయి. ఇవన్నీ కలిపి మొత్తంగా రూ.7 వేల కోట్ల బకాయి చెల్లించాలి. ఉద్యోగులందరికీ నాలుగు విడతల సరెండర్ లీవ్స్ బకాయిలున్నాయి. ఒక్క పోలీసులకే ఒక్కో విడతకు రూ.210 కోట్ల చొప్పున మొత్తం రూ.835 కోట్లు చెల్లించాలి.

# గట్టిగా తిప్పికొట్టండి!

-మొదటిపేజీ తరువాయి

రోజురోజుకూ శ్రుతి మించుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వాటిని సమర్థంగా అడ్డుకోవడంలో టీడీపీ నేతలు విఫలమవుతున్నారని అభిప్రాయపడ్డారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు, పార్టీకి చెందిన వివిధ విభాగాల ఇన్‌చార్జిలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకలాపాలతోపాటు వైసీ పీ చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలపైనా పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. “కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఒకప్పుడు వైసీపీ వైపు ఉన్న దళితులు క్రమేణా ఆ పార్టీకి దూరమవుతున్నారు. దీంతో వారిని రెచ్చగొట్టేందుకు జగన్ పలు కుట్రలకు తెరదీశారు. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో దళితుల ఆరాధ్యదైవం అంబేద్కర్ విగ్రహాన్ని తన పార్టీ సర్పంచితో తగులబెట్టించి, ఆ నెపాన్ని మనపై వేసేందుకు ప్రయత్నం చేశారు. ఇలాంటి నేర మనస్తత్వం ఉన్న వైసీపీని.. జగన్‌ను.. సమర్థవంతంగా ఎదుర్కోవడంలో మనం తడబడుతున్నాం” అని సీఎం పేర్కొన్నారు. నకిలీ మద్యం కేసులో ఆరోపణలు వచ్చిన వెంటనే టీడీపీ నియోజకవర్గ స్థాయి నేతను సస్పెండ్ చేశామని, కానీ వైసీపీ అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేసిన తమ పార్టీ సర్పంచిపై కనీస చర్యలు తీసుకోకుండా ఆయనను వెనకేసుకొస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని దళితుల్లోకి బలంగా తీసుకెళ్లాల్సి ఉండగా, ఆ పనిచేయడంలో పూర్తిగా విఫలమయ్యామని సీఎం వ్యాఖ్యానించారు. “అధికారంలో ఉండగా వైసీపీ నేతలు దళితులను హత్యలు చేయడమే కాకుండా, చంపేసిన దళితులను డోర్ డెలివరీ కూడా చేశారు. ఐదేళ్ల పాలనలో దళితులపై వైసీపీ చేసినన్ని అరాచకాలు గతంలో ఎప్పుడూ చూడలేదు. మళ్లీ అధికారం కోసం దళితులను పావులుగా వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి కుట్రలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలి. పార్టీ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు ఇలాంటి అంశాలపై నేతలకు సమాచారం.. సూచనలు అందిస్తుండాలి” అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**లిక్కర్ స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకే..**

“ఐదేళ్ల పాలనలో లిక్కర్ స్కామ్‌తో రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టడమే కాకుండా ప్రజల ఆరోగ్యంతో వైసీపీ నేతలు చెలగాటమాడారు. మనం అధికారంలోకి రాగానే ఈ స్కామ్ గుట్టురట్టు చేశా ం. వైసీపీ నేతలు ఈ కేసులో వరుసగా జైలుకు పో తున్నారు. దీని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు నకిలీమద్యాన్ని వైసీపీ నేతలతో తయారుచేయించి, నెపాన్ని మనపై నెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇలాం టి విషయాల్లో మనం అప్రమత్తంగా ఉండాలి. ఏం జరుగుతుందో ప్రజలకు సవివరంగా వివరించాలి.”

**పీపీపీ విషయంలోనూ కుట్రలే..**

“మెడికల్ కాలేజీల పీపీపీ విధానం విషయంలో వైసీపీ నేతల దుష్ప్రచారాన్ని మనం సమర్థవంతం గా అడ్డుకోలేకపోతున్నాం. ప్రభుత్వం వాటిని నిర్మించాలంటే కనీసం పది, పదిహేనేళ్లు పడుతుంది. పీపీపీ విధానంలో రెండున్నరేళ్లలోనే పూర్తి చేయవచ్చు. అదే సమయంలో ప్రభుత్వం నిర్వహించిన దానికంటే ఈ విధానంలో 150 సీట్లు ఎక్కువగా పేద విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. అలాగే 70 శాతం వైద్యసేవలు పూర్తి ఉచితంగా అందివ్వగలుగుతాం. 33 ఏళ్ల తర్వాత కాలేజీ, ఆస్పత్రి భవనాలన్నీ ప్రభుత్వపరమవుతాయి. ఈ విషయాలన్నింటినీ సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నాం. చిన్నపాటి కోడికత్తి గాయానికే జగన్ ఎక్కడికి వెళ్లారో ప్రజలందరికీ తెలుసు. వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి తల్లి అస్వస్థతకు గురైతే ఆమెను ఎక్కడ చేర్చారు? జగన్ కానీ, అవినాశ్ రెడ్డి తల్లి కానీ ప్రభుత్వ ఆస్పత్రులకు ఎందుకు వెళ్లలేదు? కార్పొరేట్ ఆస్పత్రులకే ఎందుకు వెళ్లారు? వీరికి చిన్నపాటి గాయాలకు సైతం కార్పొరేట్ వైద్యం కావాలి. పేదలకు మాత్రం కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉండకూడదా? ఈ విషయాలను బలమైన ఉదాహరణలతో ప్రజల్లోకి తీసుకెళ్లండి” అని చంద్రబాబు నిర్దేశించారు.

**టీడీపీ కార్యాలయ భవనాల పరిశీలన**

టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రెండు భవనాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. కొత్తతరం నాయకులను తయారుచేయడానికి ఈ భవనాల్లో చేస్తున్న ఏర్పాట్లను చంద్రబాబు సవివరంగా అడిగి తెలుసుకున్నారు. పార్టీ శ్రేణుల శిక్షణ తరగతులను త్వరగా పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, కార్యాలయానికి వచ్చినవారికి చక్కని వసతి, వారి ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు తగిన ఏర్పాట్లు ఉండాలని సూచించారు. కార్యాలయం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేస్తే, రాత్రిపూట బస చేసేవారు ఉదయాన్నే వాకింగ్ చేసేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. లైబ్రరీ, సమావేశ మందిరాల్లో ఏర్పాట్లనూ సీఎం పరిశీలించి కొన్ని సూచనలు చేశారు.

## విజయసాయిరెడ్డి యాక్టివ్ పాలిటిక్స్!

నెల్లూరు

మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. రాజకీయాలకు సన్యాసం చెప్పి తాను వ్యవసాయం చూసుకుంటానని చెప్పిన విజయసాయిరెడ్డికి తిరిగి పాలిటిక్స్ పై మోజు పెరిగిందంటున్నారు. ఆయన తన అత్యంత సన్నిహితుడితో కలసి మాట్లాడినప్పుడు ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. అయితే వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి బీజేపీలో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరిగింది. కానీ సాయిరెడ్డి ఇప్పటి వరకూ ఆ పార్టీలో చేరలేదు. బీజేపీ అయినా ఆయనను కాదనుకుని ఉండాలి. లేకుంటే అది ప్రచారానికే పరిమితమయి ఉండాలి. కానీ విజయసాయిరెడ్డి ఇప్పుడు ఏ పార్టీలో చేరతారన్నది ఆసక్తికరంగా మారింది. వైసీపీలో చేరే అవకాశాలు ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకులు కావచ్చు. తర్వాత వైఎస్ షర్మిలతో భేటీ అవ్వడంతో జగన్ పార్టీలోకి రీఎంట్రీ అనేది జరగని పని అని అందరూ అభిప్రాయపడుతున్నారు. అందులో వైఎస్ జగన్ విషయంలో సాయిరెడ్డిని తిరిగి చేర్చుకునేది ఉండకపోవచ్చు. విజయసాయిరెడ్డి చెప్పిన తర్వాత ఏపీ మద్యం కేసులో రాజ్ కేసిరెడ్డి పేరు బయటకు రావడంతో పాటు



పలు రకాల ఆరోపణలు చేయడం, జగన్ పై కోటరీ అంటూ విమర్శలు చేయడంతో విజయసాయిరెడ్డిని జగన్ పార్టీలోకి తిరిగి చేర్చుకునే అవకాశాలుండకపోవచ్చు. ఇక విజయసాయిరెడ్డి టీడీపీలో చేరాలనుకున్నప్పటికీ బహుశా చంద్రబాబు నాయుడు అంగీకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్ తో పాటు పార్టీపైన చేసిన విమర్శలను క్యాడర్ ఎవరూ మర్చిపోలేదు. సాయిరెడ్డిని పార్టీలో చేర్చుకుంటే క్యాడర్ నుంచే అసహనం వ్యక్తమయ్యే అవకాశముంది. ఇక ఆయనకు ఏపీలో మిగిలిన పార్టీలు ఒక రెండే రెండు. ఒకటి జనసేన రెండు కాంగ్రెస్. జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అది కూడా సాయిరెడ్డికి సాధ్యం కాకపోవచ్చు. చేరినా నామమాత్రపు నేతగానే మిగిలిపోవచ్చు. ఇకపోతే మిగిలింది కాంగ్రెస్ ఒక్కటే. ఏపీలో ఏమీ లేని కాంగ్రెస్ కు వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా ఉండటంతో కీలకంగా మారే అవకాశముంటుంది. షర్మిలకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉంటారన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

## ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు!

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగి నుంచి రాష్ట్రస్థాయిలోని ఉన్నత ఇంజనీర్ వరకు శిక్షణ ఇస్తున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలను దెబ్బతీస్తే...పవన్‌కల్యాణ్ కృషి, ప్రణాళిక జల్‌జీవన్ మిషన్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. గత ప్రభుత్వ ధోరణి కారణంగా నిధులు మురిగిపోయే పరిస్థితి తలెత్తగా...సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభ్యర్థనలతో కేంద్రం జల్‌జీవన్ మిషన్ పథకం నిర్దేశిత గడువును నాలుగేళ్లపాటు పొడిగించింది. ఈ ఏడాది ఐదు జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లతో పనులు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కోటి మంది దాహార్తి తీరుతుంది. దీంతో రానున్న 30 ఏళ్ల కాలానికి, 1.21 కోట్ల మందికి రక్షిత తాగునీరు ఇవ్వాలన్న సంకల్పం నెరవేర నుంది.

**ప్రకాశం జిల్లాలో అతి పెద్ద ప్రాజెక్టు..**

ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతానికి తాగునీటి కష్టాలు తీర్చడమే లక్ష్యంగా జల్‌జీవన్ మిషన్ పథకం కింద జూలై 4వ తేదీ రూ. 1,290 కోట్లతో మెగా ప్రాజెక్టుకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందిపడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు ఈ ప్రాజెక్టుతో తీరుతాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రకాశం జిల్లాలో ఇంత పెద్ద తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించలేదు. అలాగే, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లోనూ తాగునీటి సరఫరా మెగా ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రతి ప్రాజెక్టును పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మొట్టమొదటసారిగా సిబ్బందికి నీటి భద్రత, నాణ్యత పెంపు, సుస్థిర నిర్వహణ, వ్యర్థ జలాల పునర్వినియోగం, క్షేత్రస్థాయి పరిశీలన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఎస్ఈ, ఈఈ స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయిలో డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఈ స్థాయి వరకు సుమారు 1400 మందికి శిక్షణ పూర్తి చేశా రు. గ్రామస్థాయి సిబ్బందికి నవంబరు, డిసెంబరుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన తాగునీటి సరఫరాకు సాంకేతిక వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు. రోజుకు ప్రతివ్యక్తికి 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందించాలన్న ప్రధాని సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ జల్‌జీవన్ మిషన్ పనులను ముందుకు తీసుకెళ్తున్నారు.

## ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్ల బురిడీ!




హైదరాబాద్

సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. తాజాగా వారి ఉచ్చులో టీడీపీ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పడ్డారు. ఫేక్ ఐడీలతో బెదిరించి భారీ స్థాయిలో దోచుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు వెబ్ మీడియా ద్వారా తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. ముంబై సైబర్‌క్రైమ్ అధికారులుగా నటించిన మోసగాళ్లు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌ను మనుషుల అక్రమ రవాణా, మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామంటూ బెదిరించి ఆయన నుంచి డబ్బులు గుంజారు. ప్రొవిజనల్ బెయిల్ పేరుతో రూ.1.07 కోట్లను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటున్న ఎమ్మెల్యే పుట్టాకు అక్టోబరు 10 ఉదయం 7.30 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి తను ముంబై సైబర్ క్రైమ్ విభాగం అధికారిగా పరిచయం చేసుకున్నారు. ఆపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, 17 ఫిర్యాదులు కూడా అందాయని చెప్పాడు. ఆధార్, సిమ్‌కార్డు వాడి నకిలీ బ్యాంకు ఖాతా కూడా తెరిచారని, ముంబైలో కొనుగోలు చేసిన సిమ్ కార్డు ద్వారా అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు చెప్పాడు. కొద్ది నిమిషాలకు మరో వ్యక్తి వాట్సాప్ వీడియా కాల్‌లోకి వచ్చాడు. తాను సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అధికారి అని చెప్పి నకిలీ అరెస్టు వారెంట్, సీబీఐ అకౌంట్ ఫ్రీజ్ ఆర్డర్ చూపించి నమ్మించినట్లు సమాచారం. ఏం చేయాలో తెలియక ఎమ్మెల్యే తన ఖాతాకు ఎక్కడి నుంచి డబ్బులు వచ్చిందని అవతలి వ్యక్తిని ప్రశ్నించారు. కెనరా బ్యాంకు ఖాతాలో రూ.3 కోట్లు డిపాజిట్ అయ్యాయని, వాటిని తిరిగి ఇచ్చేలా సహకరించకపోతే అరెస్టు చేస్తామని మోసగాళ్లు బెదిరించినట్లు తెలుస్తోంది. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ అక్టోబర్ 15లోపు రూ.1.07 కోట్లు సైబర్ మోసగాళ్ల అకౌంట్‌కు పంపించినట్లు సమాచారం. కాగా, మరో రూ.60లక్షలు పంపిస్తే కోర్టు క్లియరెన్స్ సర్టిఫికెట్ పంపిస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే, గురువారం రాత్రి హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

## కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉంది: వైఎస్సార్‌సీపీ

తాడేపల్లి



కూటమి ప్రభుత్వం 16 నెలలు తర్వాత ఉద్యోగులతో హడావుడిగా చర్చలు జరిపి ఒకే ఒక్క డీఏ మాత్రమే ప్రకటించడంపై వైఎస్సార్‌సీపీ మండిపడింది. ఇది కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందంటూ విమర్శించింది. ఈరోజు( శనివారం, అక్టోబర్ 18వతేదీ) పెన్షనర్ల సంఘ నాయకులతో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, ముఖ్యమంత్రి సమావేశాలు జరిపి ఒక్క విడత డి ఏ మాత్రమే అనౌన్స్ చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. ముఖ్యంగా మధ్యంతర భృతిని ఇవ్వకపోవడం, 4 విడతలు డిఏ పెండింగ్ ఉంటే ఒకటి విడత మాత్రమే మంజూరు చేయడం, ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు మాట ఎత్తక పోవడాన్ని ఉద్యోగవర్గం జీర్ణించుకోలేక పోతోంది దీపావళి పండుగకు ఇవి తప్పక ఇస్తారని ఎదురు చూశారు కానీ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మరియు పెన్షనర్స్ కి దీపావళి కానుక ఒక్క డీ ఏతో తుష్ మనిపించారు’ అని విమర్శించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు మళ్లీ మొండిచేయి చూపెట్టారు. ఉద్యోగులకు ఐఆర్‌పై ఎటువంటి ప్రకటన చేయని చంద్రబాబు.. పీఆర్సీపైనా కూడా నోరు మెదపలేదు. వీటిని పక్కన పెట్టిన చంద్రబాబు.. కేవలం సింగిల్ డీఏతో సరిపెట్టేశారు. నాలుగు డీఏల్లో ఒక డీఏను మాత్రమే ప్రకటించారు. ఇక, ఐఆర్, పీఆర్సీపై ప్రకటన వస్తుందని ఉద్యోగులుకు కేవలం ఒక డీఏనే ప్రకటించడంతో మరోసారి చంద్రబాబు చిత్తశుద్ధి బయటపడింది. చంద్రబాబు ప్రకటనతో ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. గత రెండు రోజులుగా ఉద్యోగ సంఘాలతో చర్చల పేరుతో మంత్రులు హైడ్రామా నడిపినప్పటికీ, చివరికి ఒక డీఏనే ప్రకటించారు చంద్రబాబు. మరొకవైపు పెండింగ్ బకాయిల అంశానికి సంబంధించి కూడా ఉద్యోగులకు నిరాశే ఎదురైంది.

విశ్వ వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...







ఆదివారం, 19 అక్టోబర్ 2025



www.viswamvoice.com

### రామ్ గోపాల్ వర్మను

# ఫిలిం ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

★ వ్యవస్థలు కలుషితం కావడానికి ఆయనే కారణం ★ యువతను చెడగొట్టే రీతిలో కొనసాగుతున్న ఆయన ప్రవర్తన
★ సినిమా కళామతల్లి ముసుగులో సామాజిక ఉగ్రవాది ★ అందుకే తాము పెట్టిన ఫిర్యాదుపై కేసు కట్టారు
★ హిందూ మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారు ★ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు
★ తెలుగు రాష్ట్రాలనుంచి ఆయన్ను బహిష్కరించాలి ★ ఆయన చేష్టల వెనుక ఏ శక్తులున్నాయా నిగ్గుతేల్చాలి
వర్మ, యాంకర్ స్వప్న తదితురులపై ఎన్ఐఏ దృష్టిపెట్టాలి : రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపకులు మేడా శ్రీనివాస్ డిమాండ్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు సినీ కళామతల్లి ముసుగులో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ చేస్తున్న చేష్టలపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి)వ్యవస్థాపకులు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేసారు. యువతను చెడగొట్టే రీతిలో వ్యవహరిస్తున్నారని, వ్యవస్థలు కలుషితం కావడానికి ఆయన ఒక కారణమని మేడా శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యాంకర్ స్వప్న చేస్తున్న ఇంటర్వ్యూ చూస్తుంటే, రామ్ గోపాల్ వర్మ ఎంత దారుణంగా మాట్లాడుతున్నారో అర్థం అవుతుందన్నారు. 'ఆడవాళ్లంటే వర్మకు చాలా చులకన. యువతులతో శృంగార చేష్టలతో కూడిన బొమ్మలు చూపిస్తూ చేసిన ఇంటర్వ్యూ దారుణం. ఇతని వలన డ్రగ్స్ కల్చర్ కూడా వికృత రూపం ధరిస్తోంది. పహాల్గమ్ దాడి వెనుక ఒక యూట్యూబర్ హస్తం కూడా ఉన్నట్లు ఎన్ ఐ ఏ దర్యాప్తు తేలిన విషయాన్ని ప్రస్తావిస్తే, వర్మ చేష్టల వెనుక కూడా ఉగ్ర నేపథ్యం ఉందా అనే అనుమానం కలుగుతోంది. అందుకే వర్మతో పాటు యాంకర్ స్వప్న తదితర ముఠాపై ఎన్ ఐ ఏ దృష్టిపెట్టాలి' అని మేడా శ్రీనివాస్ కోరారు. వర్మను తెలుగు సినిమా పరిశ్రమ నుంచి అలాగే రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేసారు. ఇప్పటికే అతని చేష్టలపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదుచేయగా, కేసు కూడా కట్టారని ఆయన పేర్కొంటూ, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా, ప్రాంతీయ విద్వేషలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న వర్మపై ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## జ్యోతులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బొడ్డు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** జగ్గంపేట శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూకు కోరుకొండ మండలంలోని పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలను పలువురు ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజానగరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, పలువురు తెదేపా నాయకులు జ్యోతుల నెహ్రూకు పూలమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి సాలువాలు వేసి ఘనంగా సత్కరిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు వెంకటరమణ చౌదరి, గంగిశెట్టి చంటిబాబు, అడపా వీరబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, కందుల బాబు రాయుడు, మాత ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా అమ్మకాలకు ఎట్టకేలకు దొరికిన అనుమతులు

**మండల వ్యాప్తంగా పది షాపులకు అనుమతులు మంజూరు**
**వ్యాపారులు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి**
**రాయవరం మండల తహశీల్దార్ భాస్కర్ రావు, ఎస్సై సురేష్ బాబుల హెచ్చరిక**




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దీపావళి సమీపిస్తుండడంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా విక్రయాలు మొదలయ్యాయి. హెూల్సేల్, రిటైల్ షాపులకు అధికారులు అనుమతులు మంజూరు చేయగా, రాయవరం మండలంలో జరిగిన ప్రమాదం దృష్ట్యా, మండల వ్యాప్తంగా ఆలస్యంగా అనుమతులు లభించడంతో వ్యాపారులు ఏర్పాట్లను ప్రారంభించారు. కాగా ఈ షాపుల ఏర్పాట్లకు ఏర్పాటు చేసిన స్థలాలను పరిశీలించిన అధికారులు, పలు భద్రతా నిబంధనలతో కూడిన అనుమతులను మంజూరు చేశారు. నిర్ణయించిన ప్రాంతాలలో మాత్రమే అమ్మకాలు జరపాలని, ప్రతి దుకాణానికి మధ్య మూడు నుండి ఐదు మీటర్ల దూరం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్టాక్ ఎక్స్ప్లోసివ్స్ రూల్స్, 2008 ప్రకారం అనుమతించ బడిన పరిమితిని మించకూడదని హెచ్చరించారు. వాహనాల పార్కింగ్ షాపుల నుండి 15 మీటర్ల దూరంలో ఉండాలని పలు షరతులు,నిబంధనల తో కూడిన అనుమతులను బాణాసంచా విక్రయాలకు మంజూరు చేసినట్లు రాయవరం ఎస్సై సురేష్ బాబు, తహశీల్దార్ భాస్కర్ రావులు తెలిపారు. ఎట్టకేలకు అనుమతులు రావడంతో వ్యాపారుల ఒకవైపు సంతోష పడుతున్నప్పటికీ తుఫాను హెచ్చరికల దృష్ట్యా , వాతావరణం లో మార్పులు చోటుచేసుకోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా మండల వ్యాప్తంగా బాణాసంచా అమ్మకాలకు రాయవరం 4, మాచవరం 2, సోమేశ్వరం 2, పసలపూడి,చెల్లూరు గ్రామాలలో ఒక్కొక్క షాపులు అనుమతి పొందినట్లు అధికారులు తెలిపారు.

# రాజమండ్రిలో జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు..

**దారా యేసురత్నం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు రాజమండ్రిలో ఘనంగా నిర్వహించారు. రాజమండ్రి దేవిచౌక్ లోని రత్నం ఆర్గనైజేషన్ కార్యాలయం వద్ద కాకినాడ జిల్లా టిడిపి ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, జగ్గంపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు దారా యేసురత్నం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యేసురత్నం మాట్లాడుతూ తమ ప్రియతమ నేత, జంగంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు, నా ఆరాధ్య దైవం జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లతో కలిసి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మెట్ట ప్రాంతానికి సాగు, త్రాగునీరు అందించిన అపర భగీరథుడు అని కొనియాడారు. ఆయన శిష్యుడిగా తాను కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. తమ గురువు జ్యోతుల నెహ్రూ కు మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు.ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎస్సీ ఎస్టీ వాడలలో సమస్యలు పరిష్కారానికి, వారి అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ టిడిపి కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ ఆర్గనైజర్ సెక్రెటరీ దారా ఏసురత్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టిన రోజు వేడుకలు జరపడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు ఎంపీడీ కృపావరం, సిద్ధ గిరి, ముప్పిడి రాజు, చిడిపి వీర్రాజు, ఇసుక పట్ల రాజేష్, మహమ్మద్ గౌస్ భాష , కుంచే దానవాయిబాబు, అర్దాల కుమార్ బాబు, పులిదిండి ఆనంద్ కుమార్, జంగం సుబ్బారావు, మార్కు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐతో చేసిన వాయిస్‌తో రాద్ధాంతం..

**నిలదీసిన అన్నపూర్ణమ్మ పేట తూర్పు కాపు సంఘు అధ్యక్షుడు పోలాకి పరమేష్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కష్టార్జితంతో ఎదిగిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబుని మాజీ ఎంపీ భరత్ పనిగట్టుకుని బద్నాం చేయడం దారుణమని అన్నపూర్ణమ్మ పేట తూర్పు కాపు సంఘ అధ్యక్షుడు పోలాకి పరమేష్ అన్నారు. ఏఐతో చేసిన వాయిస్‌తో రాద్ధాంతం చేస్తున్నారని ఆయన విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పరమేష్ మాట్లాడుతూ రాజమండ్రి సిటీ, రూరల్‌లో మొత్తం 60వేలమంది తూర్పు కాపు సంఘీయాలున్నారని, ఆర్థికంగా తాము బలంగా లేకపోయినా సంఖ్యాపరంగా బలంగా ఉన్నామని అన్నారు. అందరితో తమ సంఘీయులు సఖ్యతగానే ఉంటున్నారని అయితే తమ సంఘీయులను భరత్ టార్గెట్ చేయడం దారుణమన్నారు. తూర్పు కాపు సంఘ నగర కార్యదర్శిగా పనిచేస్తున్న మజ్జి రాంబాబు ఇటీవల రుంకాని వెంకటేశ్వరరావు అనారోగ్యం కారణంగా అధ్యక్ష బాధ్యతలు కూడా రాంబాబు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన రౌతు సూర్యప్రకాశరావుని కూడా భరత్ అధికారంలో ఉండగా ఎలా నలిపేశారో తాము ఇంకా మర్చిపోలేదన్నారు. మళ్ళీ ఇప్పుడు రాంబాబు విషయంలో అలాగే వ్యవహరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిజానికి అప్పుడే ప్రెస్ మీట్ పెడదామని అనుకున్నామన్నారు. తూర్పు సంఘీయులంటే భరత్ కి ఎందుకంత కక్షఅని పరమేష్ ప్రశ్నించారు. కూరగాయల మార్కెట్ తరలింపు కోసం మజ్జి రాంబాబు ఎన్నోసార్లు వైసిపి అధికారంలో ఉండగా కల్పిన విషయం మరిచారా అని భరత్ ని పరమేష్ ప్రశ్నించారు. ఇప్పుడు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హయాంలో కూరగాయల మార్కెట్ తరలింపునకు నోచుకుందన్నారు. పాతికేళ్ల క్రితం తమ సంఘీయుడైన ఇయ్యపు కూర్మరావుని నగర టీడీపీ అధ్యక్షునిగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి నియమించారని పరమేష్ గుర్తుచేసారు. మళ్ళీ ఇన్నాళ్లకు నగర టిడిపి అధ్యక్షునిగా తమ సంఘీయుడు మజ్జి రాంబాబు నియమితులయ్యారని పేర్కొన్నారు. రాజకీయంగా బద్నామ్ చేయాలని భరత్ ప్రయత్నాలు చేయడం తగదన్నారు.నగర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆయన అన్నారు. చింతా జోగినాయుడు మాట్లాడుతూ ఫోన్ కాల్ వాయిస్ కి మజ్జి రాంబాబు వాయిస్‌కి ఏమాత్రం సంబంధం లేదని కావాలనే బద్నామ్ చేస్తున్నారని అన్నారు. కుట్రలు చేసేముందు తాము సంఖ్యాపరంగా బలంగా ఉన్నామన్న విషయం గుర్తించాలన్నారు. మీడియా సమావేశంలో తూర్పు కాపు సంఘీయులు అగురుధన్ రాజు,చింతా జోగి నాయుడు,మీసాల నాగమణి,శనపతి సత్తిబాబు,కె వెంకటేష్, మారి శ్రీనివాస్,బాలకృష్ణ, చిన్న,కృష్ణ,సందక లక్ష్మణ రావు,త్రినాథ్, మురళీకృష్ణ, అప్పారావు, భాస్కరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజా వైద్యులు..

**పీఎంపీలు, ఆర్ఎంపీలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు వీరి కృషి మరువలేము : మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్**




**తాడేపల్లిగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్యవసర సమయాలలో బేసిక్ లైఫ్ సపోర్ట్‌తో ప్రజల ప్రాణాలను కాపాడే గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజా వైద్యులని అందుకు బేసిక్ లైఫ్ సపోర్ట్ లపై పీఎంపీలు, ఆర్ఎంపీలు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఆంధ్రప్రదేశ్ పీఎంపీ, ఆర్ఎంపి జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు టీడీ జనార్దన్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ పీఎంపీ, ఆర్ఎంపీ ల జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఇంకూలు కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ పీఎంపీలు అంటే సమాజంలో గౌరవం,ప్రతిష్ఠ ఉండేలా ప్రజలతో మమేకమై మేలైన వైద్య సేవలందించాలంటే ప్రతి గ్రామీణ వైద్యుడు అధునాతన వైద్య విధానాలపై అవగాహన పొంది ఉండాలని సూచించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తూ సమాజంలో మీ వైద్య సేవలంటే మంచి పేరు వచ్చేలా ఉండాలన్నారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు కేజీ గోవింద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి పురస్కరించుకుని ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ పీఎంపీ,ఆర్ఎంపీల సేవలు లేని గ్రామాలను ఊహించలేమని,ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేసేది గ్రామీణ వైద్యులేనని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బండేటి రాధాకృష్ణ మాట్లాడుతూ పీఎంపీ,ఆర్ఎంపీలు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో పాల్గొని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలను జాగృతం చేయాలని కోరారు.పల్లెల్లో పీఎంపీ ల సేవలను కొనియాడారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పేదలపాలిట దైవాలని అతి తక్కువ ఖర్చుతో,ఎల్లప్పుడూ వైద్య సేవలందించే పీఎంపీ, ఆర్ఎంపీల సేవలు అభినందనీయమన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశానికి విచ్చేసినందుకు, ఇంతమంది గ్రామీణ వైద్యులను ఒకే వేదికపై చూడడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పీఎంపీ, ఆర్ఎంపీల సమస్యలను ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసి గౌరవ సలహాదారు లంకదాసరి ప్రసాదరావు,ఏలూరు పార్లమెంట్ టీడీపీ యువనాయకులు పుప్పాల హరీష్, జేఏసీ నాయకులు వీబీటి రాజు,రాజా సిద్దార్థ,జి ప్రసాద్, ఎమ్ఎన్ రాజు,కె గణపతి రావు,తోరాటి ప్రభాకరరావు, సీఎస్ కుమార్, ఎన్ జయసూర్య, బళ్ళా శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా కన్వీనర్, కోకన్వీనర్లు ఏఆర్కే పరమేశ్వరులు, ఎమ్ జయరామ్, ఆనందం సుబ్బారావు,ఎస్కే సుభాన్, ఎల్ఎస్వీ నాగేశ్వరరావు,కే ముక్తేశ్వరరావు,ఆర్ సురేష్ బాబు ఎమ్ జితేంద్ర, లతో పాటు అధిక సంఖ్యలో గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఈసి

బీహార్‌లో భారత ఎన్నికల సంఘం(ఈ.సి.ఐ) ప్రారంభించిన ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్)ను సందర్భాన్ని బట్టి చూస్తే విపత్కర ప్రభావాలు చూపబోతుందని చెప్పడం దిగ్భ్రాంతి కలిగించవచ్చు.అయితే ఇప్పుడు ఆ ప్రభావాలేమిటో బహిర్గతమవుతున్న పరిస్థితి. జూన్25న ఈ ప్రక్రియను ప్రారంభించి కొద్దిరోజుల్లోనే దాని అసలు లక్ష్యం ఓటర్ల జాబితాల ప్రక్షాళనను మించి ఇంకా చాలా వుండబోతోందని స్పష్టమైంది. ఆ కసరత్తులో మూడు ప్రత్యేక లక్షణాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. మొదటిది ఈ ప్రక్రియలో అతను లేక ఆమె ఓటర్ల జాబితాలో తన పేరు వుంచాలంటే పౌరులు నిరూపణకు తమ ఆధారాలను తామే సమకూర్చుకునే బాధ్యత తీసుకోవాలి. గతంలోనైతే ఓటర్ల జాబితాల పున:పరిశీలన బాధ్యత ఇ.సి.ఐ నియమించిన ఎన్యూ మరేటర్లు నిర్వహించేవారు. కానీ ప్రస్తుత సందర్భంలోనైతే ఇప్పుడున్న లేక కాబోతున్న ఓటర్లు ఒక ఫారం సమర్పించడమే గాక ఇ.సి.ఐ నిర్దేశించిన పదకొండు పత్రాల్లో ఏదో ఒకటి చూపిం చాల్సి వుంటుంది. అధికార పత్రాల అందుబాటు స్థాయి చాలా తక్కువలోనే వుండే నేపథ్యంలో ఈ ప్రక్రియ పున:పరిశీలనకు గాక తొలగింపునకూ, తీసివేతకూ ఉద్దేశించబడిందని తేలిపోయింది. రాజ్యాంగం, తర్వాత వరుసగా అనేక సుప్రీంకోర్టు తీర్పులు గుర్తించిన సార్వత్రిక ఓటు హక్కు అనే సూత్రానికి తిలోదకాలు ఇస్తున్నట్టు అర్థమైంది. రండవ ప్రశ్న ఈ.సి.ఐ ఓటరు పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు బలవంతాన లాక్కుంటున్నదా? రాజ్యాంగం 326వ అధికరణం ప్రకారం ఓటరు హక్కుకు సంబంధించి పౌరసత్వంపై యథాలాపంగా చేసిన ప్రస్తావన ఆధారంగా ఈ వాదన తీసుకురాబడింది. పౌరసత్వం వుండాలనే ముందస్తు షరతుకు మినహాయింపు లేదు గానీ దాన్ని నిర్ధారించే బాధ్యత మాత్రం ఈ.సి.ఐది కాదు. ఈ విషయంలో హెూం మంత్రిత్వ శాఖకు బాధ్యత అప్పగించబడింది. ఏమైనా 'సర్' తతంగం ఈ అవసరాన్ని తేలిగ్గా ఏకపక్షంగా తోసిపారేసింది. ఇక చివరగా కాలవ్యవధి. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు జీవనోపాధి కోసం రాష్ట్రం వదలివెళ్లే బీహార్ వంటి రాష్ట్రంలో ఇచ్చిన ఈ కాలవ్యవధి చాలా స్వల్పం. అనేక ప్రాంతాల్లో వరద పరిస్థితుల వంటివి వుండగా వర్షా కాలంలో ఈ కసరత్తుకు అతి స్వల్ప వ్యవధి మాత్రమే లభించింది. బూత్‌స్థాయి అధి కారులు (బి.ఎల్.ఓ)లకు శిక్షణ లేని పరిస్థి తులలో ఇంత నిశితమైన ప్రక్రియ పూర్తి కావడం నిజంగానే అసంభవం. కనుకనే ఈ విషయంలో వచ్చిన తుది ఫలితం ఏమాత్రం ఆశ్చర్యం కలిగిం చేదిగా లేదు. 81 లక్షల మందికి పైగా ఓటర్లు తుది జాబితాలో పేరు పొందలేకపోయారు. 1.38 కోట్ల మంది ఓటర్ల చిరు నామాలు అనుమానాస్పదంగా వున్నాయన్నారు. తొమ్మిది లక్షల మందికి పైగా మహిళా ఓటర్లు తమ ఓటుహక్కు కోల్పోయారు. 14 లక్షల మందికి పైగా ఓటర్లకు ఒకటికి మించిన ఎపిక్ కార్డులున్నట్టు తేలింది. 100 మందికి పైగా ఓటర్లు వున్న ఆవాసాలు 2258 వున్నాయి. కనుక ఇది పారదర్శకంగా జరిగిందనడానికి ఎలాంటి ఆధారం లేదు. ఫిర్యాదులు లేని స్వచ్ఛమైన జాబితా ఎంతమాత్రం కాదు ఇది, తుది ఓటర్ల జాబితాలు తీవ్ర సందేహాలకు నిలయంగా మారాయి. బీహార్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి మేలు చేసేందుకే ఈ తతంగం ఉద్దేశించబడిందని మొదటి నుంచి స్పష్టమవుతూనే వుంది. ఎందు కంటే గతంలో ఈ ఎన్నికలు హెూరాహెూరీ పోటా పోటీగా జరిగాయి. ఈసిఐ తలపెట్టిన 'సర్'ను బలపర్చేందుకు రంగంలోకి దిగింది బీజేపీ మాత్రమే. సహజం గానే ప్రతిపక్షాలు, ఆందోళన చెందిన పౌరులు గట్టిగా ఎదిరించేందుకు ముందు కొచ్చారు. దీన్ని చక్క దిద్దేందుకు రాజ్యాంగం ఇచ్చిన ప్రతి వేదికనూ వాడుకోవడానికి ప్రయత్నించారు. రాజకీయ పార్టీలూ పౌర సంఘాలు దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్లు ఇప్పటికీ సుప్రీంకోర్టు విచారణ లోనే వున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఈ.సి.ఐ ఆధార్ కార్డు అనే 12వ పత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పరిమిత మధ్యంతర ఉత్తర్వు ఇచ్చినప్పటికీ విస్తారమైన సమస్యలు మిగిలే వున్నాయి. ఓటర్ల సంఖ్య భారీ ఎత్తున తగ్గిపోయింది. ఈ.సి.ఐ ప్రయత్నమంతా మోసపూరితంగా వుందనేది ఇప్పుడు కండ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. 2025 బీహార్ ఎన్నికలలో 'సర్' ప్రక్రియ చేపట్టడం అంటే.. 2003లో జరిగిందే మరోసారి జరుగుతున్నది తప్ప ఎంతమాత్రం అసాధారణం కాదని, ఈ.సి.ఐ ముందు నుంచీ వాదిస్తూ వచ్చింది. అయితే అప్పటి మార్గదర్శకాలను వెల్లడించాలని కోరగా ఎన్నికల సంఘం అందించలేదు. ఇందుకు సంబంధించి నాటి అధికార పత్రాలు అందుబాటులో లేవన్నది అపరిపక్వతను బయట పెట్టుకోవడమే గాక వ్యవస్థా గతమైన అసమర్థతను కూడా వెల్లడించుకుంది. అయితే వారు పచ్చి అబద్ధాలకు పాల్పడ్డారనేది ఇప్పుడు తేటతెల్లమైపోయింది. ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎ.డి.ఆర్) సుప్రీం కోర్టుకు నాటి ఈ పత్రాలను సమర్పించడాన్ని బట్టి ఇది అబద్ధమని తేలింది. 2003 ఆదే శాలు వేల పేజీలున్నాయి. ఈ కసరత్తు చేపట్టే తరుణంలో మూడు కోణాలలోనూ ఈ.సి.ఐ ఎలాంటి మోసానికి పాల్పడిందో ఇప్పుడు సంపూర్ణంగా తెలిసిపోయింది. ఇంకా ఏమైనా గజిబిజి అంటూ వుండి వుంటే నరేంద్ర మోడీ దళపతి అయిన హెూంమంత్రి అమిత్ షా దాన్నీ లేకుండా చేశారు. పౌరులు కాని వారిని గుర్తించి తొలగించి పంపించేయ డానికే 'సర్' ద్వారా ప్రయత్నం జరిగిం దని ఆయన చెప్పేశారు. ఈ వాదనను సమర్థిం చుకోవడం కోసం ఆయన దేశ ముస్లిం జనాభాలో సాపేక్షంగా వచ్చిన స్వల్ప పెరుగుదలను నొక్కి చెప్పారు. ఈ పెరుగుదలకు కారణం సంతానోత్పత్తి రేటు పెరగడం గాక పెద్ద ఎత్తున జరిగిన చొరబాట్లేనని ఆయన మరీమరీ చెప్పారు. దేశంలో ముస్లిం జనాభా 24.6 శాతం చొప్పున పెరిగితే హిందూ జనాభా 4.5 శాతం చొప్పున తగ్గిపోతూ వస్తోందని ఆయన లెక్కలు చెప్పారు. ఈ వాదన ఆధారం గానే ఆయన పార్టీ ప్రభుత్వం చొర బాటుదార్లను గుర్తిస్తానంటున్నది. ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగించడానికి చేయవలసింది మొత్తం చేస్తుంది. ఉత్తరోత్తరా వారిని స్వదేశాలకు పంపించేస్తుంది అన్నారు. 'సర్' నేపథ్యమేమిటో ఆయన స్పష్టంగానే ఏకరువు పెట్టారు. అయితే పహల్గాంలో ఉగ్రవాదులను పట్టుకోవడంలో విఫలమైనట్టే ఆయన మంత్రివర్గం చొరబాటుదారులను స్పష్టంగా ఎత్తిచూపడంలోనూ ఘోరంగా విఫలమైంది. ఆ విధంగా విఫలమైన కారణంగా ఆయన ఇప్పుడు ఇసిఐ భుజాల మీద తుపాకి పెట్టి కాల్చాలని ప్రయత్నిస్తున్నారు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# టపాసుల పట్ల అవగాహన ఏదీ?

టపాసులకు ఆద్యులు చైనీయులు. క్రీ.పూ. 200 సం. లోనే వెదురు (బాంబూ) టపాకాయలు వాడినట్లు ఆధారాలు ఉన్నాయి. దాన్ని చైనా బాషలో బాజు అంటారు. పేలుతున్న వెదురు అని అర్థం. తుపాకి మందు కని పెట్టేంత వరకు వెదురు టపాసులనే చైనా వారు వాడేవారు. క్రీ.శ. 600ల ప్రాంతంలో చైనా వారు తుపాకి మందుని కనిపెట్టారు. గన్ పౌడర్ లేక బ్లాక్ పౌడర్ రసాయన ప్రేలుడు పదార్థం. ఇది గంధకం, చార్కోల్, పోటాషియం నైట్రేట్ ల మిశ్రమం. దీన్ని సాల్ట్ పౌడర్ అంటారు. ఇది మండినప్పుడు 427 నుంచి 464డిగ్రీల ఉష్ణం వెలువడుతుంది. దీని తరువాత చేసేవారు అందుకే టపాసులకు బాజు పేరు స్థిరపడి పాయింది. క్రీ.శ. 900వ సం.లో చైనా నుండి టపాసులు ఇంగ్లాండు అరబ్బు దేశాలు, భారత దేశానికి చేరుకున్నాయి. మనదేశంలో టపాకా యల పరిశ్రమ తమిళనాడులోని శివకాశిలో విస్తరించివుంది. దేశంలోని టపాకాయల ఉత్పత్తిలో 70% శివకాశిలోని 1000కి పైగా పరిశ్రమలలో తయారవు తున్నది. పరిశ్రమలలో పనిచేసే వారు ముఖ్యంగా పసిపిల్లలు. వారిలో 4 నుంచి 16 సం.లోపు వారు 30% మంది వున్నారు. అందులో 90% మంది ఆడ పిల్లలు, పేద పిల్లలు, వెనుకబడిన తరగతివారు. చేతులకు ఎలాంటి రక్షణ కవచాలు (గ్లౌజులు) లేకుండా ప్రమాదకర రసాయన పదార్థాలలో టపాసులు తయారు చేస్తున్నారు పిల్లలు. రసాయనాల వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మ వ్యాధులతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఎన్ని వున్నా పిల్లలు చేసే ఈ చాకిరీని అరికట్టలేక పోతున్నారు. 1991లో శివకాశిలో ఓ ఫ్యాకల్టీలో జరిగిన ప్రేలుడు వల్ల 39 మంది చనిపోయారు. 65 మంది గాయపడ్డారు. 2009, జూలైలో జరిగిన ప్రమాదంలో 40 మంది చనిపోయారు. ఆగస్టు 2011లో ఫ్యాక్టరీ ప్రమాదంలో 7 మంది చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 2012 ప్రమాదంలో 40 మంది చనిపోగా 38 మంది గాయ పడ్డారు. ఇవి అధికారిక లెక్కలు కాగా, నిజానికి ఎక్కువగానే ప్రమాదాలు జరిగి వుంటాయి. టపాకాయలు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రసాయన కాలుష్యం చాలా ఎక్కువగా వుంది. టపాసులు కాల్చినప్పుడు శబ్దం 140 డెసీబెల్స్ దాటుతోంది. ఆరోగ్య పరంగా శబ్దాలు 125 డెసిబెల్స్ దాట కూడదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టపాకాయల శబ్ద తీవ్రత 125 డెసిబెల్స్ దాట కూడదు. కానీ టపాకాయల తయారీ కంపెనీలు నియమాన్ని పాటించడం లేదు. ఈ శబ్దాల వల్ల తాత్కాలిక చెవుడు, శాశ్వత చెవుడు ఏర్పడు తున్నది. అధిక శబ్దం వల్ల వినికిడి సమస్యలు, రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి లాంటి సమస్యలు వస్తున్నాయి. ఎన్నో రకాల ప్రమాదాలు పొంచి వున్నాయి. టపాకాయలు కాల్చడంలో అగ్ని ప్రమాదాలు కోకొల్లలు. చేతిలో చిచ్చుబుడ్డి పేలడం, ఒళ్ళుకాలడం, బట్టలు కాలి పోవడం జరుగుతూనే వుంటాయి. చాలా మంది ఆ వెలుగు చూడలేక కళ్ళు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం. దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా



నివారించవచ్చు. టపాకాయలు కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయి. బాణ సంచాలను ఇంటిలో కాల్చ కూడదు. ఇంటికి దూరంగా బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వల్ల ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. టపాకాయలు కొన్నిసార్లు అవి పేలకుండా ఆగిపోతాయి. వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం లాంటివి చేయకూడదు. ముందుగా వాటిపై నీటిని పోయడం వల్ల వాటి నుంచి ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. టపాకాయలు కాల్చేటప్పుడు ముఖ్యంగా ఆల్కహాల్ శానిటైజర్ లను వాడి టపాకాయలను వెలిగించ కూడదు. శానిటైజర్ లకు తొందరగా మండే స్వభావం ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దీపావళి రోజు శానిటైజర్ లను వాడక పోవడం మంచిది. టపాకాయలపై ఇచ్చిన సలహాలు సూచనలను ఖచ్చితంగా చదివి పాటించాలి. మంటలు అంటుకునే ప్రదేశాలు... కరెంటు తీగలు, ఎండు గడ్డి, పూరి గుడిసెలు ఉన్న ప్రదేశాలలో బాణా సంచాలు కాల్చ కూడదు. టపాకాయలను కాల్చి వాటిని అలాగే రోడ్డు మీద పడేయడం వల్ల ఆ దారి వెంట వెళ్లే వారికి వాటి నుంచి ప్రమాదం కలగవచ్చు. ఒక బకెట్లో ఇసుక పెట్టుకొని అందులో కాల్చిన కాకర పువ్వులను, టపాకాయలను వేయడం మంచిది. బాణా సంచాలను కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తగా ఒక బకెట్ నిండా నీటిని పక్కన ఉంచుకోవాలి. చిన్నపిల్లలకు పెద్దవారే దగ్గరే ఉండి జాగ్రత్తగా టపాకాయలను కాల్పిం చాలి. వీలైనంత వరకు అందరూ కూడా కాటన్ దుస్తులను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత పిల్లలు టపాకాయలను కాల్చిన చేతులతోనే ముక్కు, చెవులు, కళ్లను రుద్దుకుంటారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నీళ్లు పోసుకుని గార్గిలింగ్ చేయాలి. గాయం అయితే దాని మీద పదిహేను నిమిషాల పాటు చన్నీరు, వేడి నీరు పోయరాదు. తర్వాత ధారగా పోయాలి లేదా నీటి కుళాయి కింద పెట్టాలి. గాయమైన అరగంట లోపల ఈ చికిత్స జరగాలి. ఇలా చేయడం వల్ల వేడి తగ్గిపోతుంది. కంటికి చువ్వలాంటిది తగిలి గాయం అయినప్పుడు వెంటనే చేత్తో కానీ కంటిని రుద్దుతారు. చాలా ప్రమాదం. గాయం తీవ్రత పెరగడానికి, గాయం విస్తరించ డానికి కారణం అవుతుంది. కంటికి వస్త్రంతో గట్టిగా కట్టు కట్టకూడదు. ఇలా చేస్తే కంట్లో గుచ్చుకున్న నలుసు మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాబట్టి గాయమైన కంటిని కప్పు లేదా షీల్డుతో కప్పి డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాలి. రసాయనాలు కంట్లో పడితే కంటిని పరిశుభ్రమైన నీటితో కడగాలి. కంటిని రుద్దకుండా దోసిలితో నీటిని తీసుకుని కంటికి తగిలేటట్లు చేస్తూ శుభ్రం చేయాలి. టపాసుల వినియోగాన్ని తగ్గించాలి. అధిక శబ్దాలు వెలువరించే టపాసులు కాల్చకూడదు. టపాసులు పర్యావర ణానికి ప్రమాద కారకాలు. టపాసుల కోసం డబ్బు వృథా చేయవద్దు. వెలుగులు నింపే దీపాలతో దీపావళి చేసుకుందాం. పర్యావరణ పరిరక్షణ దీపావళిని జరుపుకుందాం.

# పాలస్తీనా నెల్సన్ మండేలా బర్ఘూటీ

గత రెండేళ్లుగా ఇజ్రాయెల్ వరుస దాడులతో రక్తసిక్తమౌతున్న పాలస్తీనాలో ఇక మిగిలేది మరుభూమే అనుకుంటున్న తరుణంలో కాల్పుల విరమణ ప్రపంచానికి కొంత ఊరట నిచ్చింది. ఇదేమి ద్వైపాక్షిక ఒప్పందం కాదు, పాలస్తీనా పెడ రెక్కలు విరిచి పట్టుకొని ఒప్పుకోక తప్పదని వేలిముద్రలు తీసుకున్నదే. ట్రంప్ శాంతి సూత్రాల్లో ఉన్నదంతా ఇజ్రాయెల్ పక్షపాతమే. ఈ మాత్రానికే పాలస్తీనాలోని అరబ్బులు హర్షాతిరేకాలు ప్రదర్శిస్తున్నారంటే వారు అనుభవించిన దుర్భర పీడనను ఊహించవచ్చు.ఇరువైపులా బందీల, ఖైదీల అప్పగింతలో భాగంగా ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా పౌరుల్లో సుమారు 2 వేల మంది ఖైదీలు ఇళ్లకు చేరుకుంటున్నారు. వారిలో మార్వాన్ బర్ఘూటీ ఉంటారని పాలస్తీనీయులు ఆశగా ఎదురు చూశారు. అయితే వారి ఆశ అడియాసే అయింది. తమ వారి విడుదల కోరుతూ హమాస్ ఇచ్చిన రాజకీయ, యుద్ధ ఖైదీల జాబితాలో బర్ఘూటీ పేరు మొద టిది. అయితే ఆయన్ని జైలు నుంచి బయటకు పంపడానికి నెతన్యాహూ ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఆయన మా కోర్టులో అయిదు మరణశిక్షలు పడిన నేరస్తుడు, వదిలే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ చెప్పింది. పాలస్తీనా పౌరులు మాత్రం ఆయన్ని తమ దేశపు నెల్సన్ మండేలా అని చెప్పుకుంటారు. పాలస్తీనా ప్రజలు మార్వాన్ బర్ఘూటీని కాబోయే దేశాధ్యక్షుడిగా గుర్తిస్తున్నారు. 1996లో జరిగిన ఎన్నికల్లో పాలస్తీనా నేషనల్ అథారిటీ నుండి రమల్లా జిల్లాకు లెజి స్లేచర్ కౌన్సిల్‌గా ఆయన ఎన్నుకోబడ్డారు. యుద్ధాల కారణంగా అక్కడ ఎన్నికలు వరుసగా వాయిదా పడుతున్నాయి. పాలస్తీనా అధ్యక్షుడిగా కొనసాగుతున్న మహ్మద్ అబ్బాస్ వయోధికుడు. ఆయన వారసుడు ఎవరు అని వివిధ సంస్థలు జరిపిన ఒపీనియన్ పోల్స్‌లో బర్ఘూటీ పేరు అగ్రస్థానంలో ఉంటోంది. అలాంటి వ్యక్తిని 2002లో ఇజ్రాయెల్ అరెస్టు చేసి జైల్లో వేసింది. అయిదుగురు ఇజ్రాయిలీలు చనిపోయిన దాడికి బర్ఘూటీ బాధ్యుడని ఆయనపై 26 నేరారోపణలు చేసింది. ఆ నేరాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వాదించినా ఇజ్రాయెల్ కోర్టు వినకుండా 2004లో ఆయనకు అయిదు జీవిత ఖైదీలతో పాటు 40 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఆయనపై సరియైన విచారణ జరగలేదని, సాక్ష్యాలు కూడా సరిపోవని అంతర్జా తీయ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థ అయిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ తమ నివేదికలో తెలిపింది. ఇజ్రాయెల్ కోర్టులు దానిని పట్టించుకోలేదు. ఆనాటి నుండి బర్ఘూటీ జైల్లో ఉంటూ కఠిన కారాగార శిక్ష అనుభవిస్తున్నారు.

తమ దేశ సమస్యల పరిష్కారానికి బర్ఘూటీ పాత్ర అవసరమని హమాస్ కూడా భావిస్తుంది. ఆయన రూపొందించిన రెండు రాజ్యాల మధ్య రాజకీయ ఒప్పంద పత్రాన్ని హమాస్ మద్దతు



పలికింది. అందుకే ఆయన విడుదల కావాలని ప్రతిసారి ప్రయత్నిస్తోంది. 2011లో ఇజ్రాయెల్ సైనిక అధికారి గిలాద్ షాలిత్ విడుదల సందర్భంగా బర్ఘూటీని అప్పగించమని హమాస్ కోరింది. అప్పుడు కూడా ఇజ్రాయెల్ ప్రభుత్వం ఒప్పుకోలేదు. బర్ఘూటీ బయటికి వస్తే పాలస్తీనాలో ప్రజల ఐక్యత పెరిగి తమ ఆధిక్యత కోల్పోతామని ఇజ్రాయెల్ భయపడుతోంది. ఆయనను విడుదల చేసి పాలస్తీనాకు పంపకుండా ప్రవాసానికి వెళ్లేలా అనుమతి ఇచ్చినా చాలని వివిధ సంస్థలు కోరుతున్నాయి. హమాస్ కూడా అందుకు సిద్ధమే. ఆయన స్వదేశంలో కాకుండా ఏదో దేశంలో శరణార్థిగా జీవితం గడిపేందుకు కూడా ఇజ్రాయెల్ ఒప్పుకోవడం లేదు. ఆయన ఎక్కడున్నా ప్రజలను ప్రభావితం చేయగలడని అది నమ్ముతోంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆయన్ని జైలులోనే చంపేయాలని మానసికంగా, శారీరకంగా ఎన్నో హింసలకు గురిచేస్తున్నారు. తీవ్రంగా కొట్టి నగ్నంగా ఇతర ఖైదీల ముందు ఈడ్చుకుపోతున్న దృశ్యాలు చూసిన వారు ఉన్నారు. మొలలు దించిన కుర్చీపై గంటల తరబడి కూర్చోబెట్టారు. గవర్నర్ ముందు మోకాళ్లపై కూర్చోనందుకు భుజంపై ఒత్తిడి చేయడంతో ఎముక పక్కకు జరిగింది. చీకటి గదిలో ఉంచి భారీ శబ్దాల చప్పుడును వినిపిస్తున్నారు. 2017లో జైల్లో సౌకర్యాల పెంపు కోసం, ఖైదీల బాగోగుల కోసం 40 రోజుల పాటు నిరాహార దీక్షలు నిర్వహించారు. అక్టోబర్ 2023 నుండి కుటుంబ సభ్యులు ఆయన్ని కలిసేందుకు అనుమతిని ఇవ్వడం లేదు. 1960లో పుట్టిన మార్వాన్ బర్ఘూటీ 15వ ఏటనే పాలస్తీనా జాతి విముక్తి ఉద్యమంలో చేరారు. 18 ఏళ్ల వయసులోనే అరెస్టు అయి జైలు పాలయ్యారు. ఆ రోజుల్లో ఇంటరాగేషన్‌లో మర్మాంగాలపై దెబ్బలకు స్పృహ కోల్పోయే వాడినని రాసుకున్నారు. విద్యార్థిగా 1983లో యూనివర్సిటీలో చేరారు. అరెస్ట్, జైలు, ప్రవాస జీవితం వల్ల 1994లో డిగ్రీ పూర్తయింది. 1998లో పీజీ చదివారు. జైల్లో ఉంటూ ఆయన '1000 డేస్ ఇన్ సాలిటరీ జైల్' అనే పుస్తకం రాశారు. 2017 నుండి ఆయన ఐదేళ్ల జైలు జీవి తంపై 2022లో 'టుమారోస్ ఫ్రీడమ్' అనే డాక్యుమెంటరీ వచ్చింది. అదే సంవత్సరం బర్ఘూటీ పేరు నోబెల్ శాంతి బహుమతికి సూచించబడింది. జాతి యావత్తు తలుచుకుం టున్న మనిషిని జైల్లోనే తుదముట్టించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కోరుకుంటున్నాడు. పాలస్తీనా శిథిల గోడలపై బేడీలతో ఉన్న మార్వాన్ బర్ఘూటీ చిత్రంతో పాటు ఆయన విడుదలను కోరుతూ జనం రాసిన నినాదాలు ఇంకా ఉన్నట్లే వారి గుండెల్లోనూ అదే కాంక్ష చెక్కు చెదర లేదు. ప్రజల శాంతిదూతను జైల్లో ఉంచి ట్రంప్, నెతన్యాహూ తెచ్చిన ఒప్పందాలు కొంగ జపాన్ని తలపిస్తున్నాయి.





రామచంద్రపురం డివిజన్ పరిధిలో

# 88 దివాలి మందుగుండు షాప్‌లకు అనుమతి

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దీపావళి పండుగను పురస్కరించుకుని రామచంద్రపురం డివిజన్ నందు మండలం వారిగా తాత్కాలికంగా 19,20వ తేదిలలో దీపావళి మందుగుండు సామానులు అమ్మకం నిమిత్తం లైసెన్సు లు మంజూరు చేయడమైనది.అందులో భాగంగా రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఇప్పటివరకు మొత్తం - 88 తాత్కాలిక మందుగుండు అమ్మకం దుకాణములకు లైసెన్సు లు మంజూరు చేశారు. లైసెన్సు పొందిన వాటి వివరాలు ఇలా వున్నాయి. మండపేట టౌన్ 25,రూరల్ 7, రామచంద్రపురం టౌన్19, రూరల్ 14, కపిలేశ్వరపురం 7, కె.గంగవరం 6, రాయవరం 10 షాప్‌లకు అనుమతులు ఇచ్చినట్లు రెవిన్యూ డివిజన్ అధికారి తెలియజేసారు. అయితే డివిజన్ పరిధిలో అనుమతి పొందిన షాప్ యజమానులు సదరు ప్రదేశముల యందు లైసెన్స్ నిబందనల ప్రకారం ఉండవలసిన ఫైర్ ఎక్స్టింగ్యూషర్,వాటర్ టాంక్,ఇసుక బక్కెట్లు మొదలగు పరికరాలు ఏర్పాటు చేసుకొనవలెనని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిభంధనల ప్రకారం ముంధస్తు చర్యలు తీసుకొనవలెను అని,18 సం.లు వయసు లోపువారిని పని నిమిత్తం నియమించకూడదని అలానే 19 ఉదయం 9 గంటలు నుండి సాయంత్రం గం.ల వరకు మరియు 20 వ తేదీన ఉదయం 6 గంటల నుండి రాత్రి 6 గంటల వరకు మాత్రమే అమ్మకములు జరపవలేనని రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ అధికారి అఖిల తెలిపారు.

# నేటి బాధ్యతే, రేపటి భావితరాల భవిష్యత్తు

సోమేశ్వరంలో స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివస్ కార్యక్రమం

పారిశుద్ధ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది

ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ రహిత గ్రామంగా నిలిచేందుకు ప్రయత్నం

జనసేన పార్టీ గ్రామ కార్యదర్శి మణి ప్రసాద్



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించి, గ్రామ ప్రజలకు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు సోమేశ్వరం గ్రామ కూటమి నాయకులు పేర్కొన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని సోమేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ గ్రామ కార్యదర్శి కాళ్ళ మణి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, సోమేశ్వరం గ్రామంలో ఉపయోగంలో లేక మూలన పడిన వర్మీ కంపోస్ట్, స్వచ్ఛ రథం వాడుకలోకి రావడంతో పాటు సుమారుగా 10 మందికి ఉపాధి దొరికిందని అన్నారు,నేటి బాధ్యతే, రేపటి భవిష్యత్తుగా పేర్కొంటూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గ శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు, ఎ.పి.ఎస్.ఐ.డి.సి చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జి వేగుళ్ల లీలా కృష్ణ సహకారంతో, భవిష్యత్తులో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామ ప్రజలకు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు దీపావళి పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకునేందుకు

# రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవాలి : ఆర్డీవో మాధవి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దీపావళి పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపు కోవడానికి చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆర్డీవో కే.మాధవి ఆదేశించారు. శనివారం ఆమె డివిజన్ ప్రజానీకానికి దీపావళి పండుగ శుభా కాంక్షలు తెలిపారు. ప్రజలందరూ దీపావళి వండుగను సురక్షితంగా జరుపుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు, తదితర అంశాలపై అన్ని మండలాల తాసిల్దార్లు, పోలీసు, అగ్నిమాపక శాఖ విద్యుత్ శాఖలు అవగాహన పెంచాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రభుత్వం ఇచ్చిన సూచనలు అన్నింటిని టపాసులు అమ్మే షావుల యాజమాన్యం వారు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ సంప్రదాయ పండుగను నంతోషంగా నిర్వహించుకు నేలా రెవెన్యూ, పోలీసు అగ్నిమాపక శాఖ విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు . టపాను లు అమ్మే దగ్గరలో అవసర మయ్యే అగ్నిమాపక సేవలు అనువత్రి సేవలు ఉండేలా చూసుకోవాలన్నారు నిబంధనల మేరకు ఫైర్ క్రాకర్స్ షాపులను నిర్వ హించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు షావులు ఏర్పాటు చేస్తు న్నారా లేదా అని రెవిన్యూ అధికారులు తనిఖీ చేయా లన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. షావులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయా లన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీను, మున్సివల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాణనంచా విక్రయకేంద్రాల నిర్వాహకులు నిబంధన లను తప్పక పాటించాలని సూచించారు. షాపుల ముందు ఇనుక, నీటి ఐక్కెట్లు వంటి ఫైర్ అండ్ సేఫ్టీ నిబంధనలను పాటిం చేల చర్యలు తీసుకోవాల న్నారు. ప్రజలు బాణానంచా కొనుక్కుని తీసుకువెళ్లి ఇంట్లో కాల్చుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను షాపుల వద్ద బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. బాణ నంచా విక్రయశాలల మధ్య నిబంధనలకు లోబడి దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాళ్ల ముందు అన్నిరకాల బాణ సంచాకు సంబంధించి ధరల పట్టికలను బహి రంగంగా ప్రదర్శించాలన్నా రు. స్టాళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. దీపావళి పండగ ఉత్సవాలు సురక్షితంగా జరుపుకోవాలని మరొక మారు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంపిఎస్‌లో దీపావళి వేడుకలు





**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పబ్లిక్ స్కూల్ జూనియర్ కాలేజ్ లో శనివారం దీపావళి వేడుకలు నిర్వహించారు. సమాజంలో మంచిని అందరికీ పంచాలని దుర్గుణాలను విడ నాడాలని సందేశం ఇచ్చేదే నరకచతుర్ధశి ఉద్దేశమని మండపేట పబ్లిక్ స్కూల్ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ వల్లూరి చిన్నారావు పేర్కొన్నారు. ప్రతీ పండుగను ఒక సంబరంగా ఎంపిఎస్ లో నిర్వహించడం ఆనవాయితి. ఈ క్రమంలో తొలుత 20 అడుగుల నరకాసుర విగ్రహాన్ని ద్వంసం చేసేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్ధినులు రంగవల్లులు వేసి దీపాలను అలంకరించారు. అనంతరం విద్యార్ధినీ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఎంపిఎస్ దీపావళి సంబరాలలో విద్యార్ధినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ దేవళ్ళ సాయిగంగాధర్, స్కూల్ ప్రిన్సిపల్ గణేష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన వాడపల్లి బ్రహ్మోత్సవాలు





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తులకు ఆధ్యాత్మికానందం అందించిన ఉత్సవాలు వాడపల్లి అభివృద్ధిలో భాగస్వామ్యం నా అదృష్టం, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దర్శనానికి రావాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం పూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. యువనాయకులు బండారు సంజీవ్, సచిన్‌లు సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలు గత సంవత్సరాల కంటే మరింత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తిరుమల తరహాలో నిర్వహించిన వాహనసేవలు భక్తులకు అద్భుతమైన ఆధ్యాత్మికానందాన్ని అందించాయి అన్నారు. అలాగే, “వాడపల్లి అభివృద్ధి స్వామివారి సంకల్పంతోనే సాధ్యమైంది. ఈ అభివృద్ధిలో భాగస్వామి కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. తిరుమల తరహాలో వాడపల్లి అభివృద్ధి చెందే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. మరి కొన్ని సంవత్సరాల్లో వాడపల్లి మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తాము, అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను వాడపల్లికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకోవాలని కోరడం జరుగుతుందని బండారు సత్యానందరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో అహర్నిశలు శ్రమించిన దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు, ఆలయ అర్చకులు, సిబ్బంది సేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వాడపల్లి ఆలయం తిరుమల తరువాత భక్తుల ప్రాధాన్యత పొందుతున్నదని, భవిష్యత్తులో మరింత సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

దీపావళి పండగను పిల్లలు పెద్దలు జాగ్రత్తగా

# భద్రతతో నిర్వహించుకోవాలి : కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దీపావళి పండుగను అత్యంత జాగ్రత్త, భద్రతతో సంతో షంగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా ప్రజానీకానికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళినీ పటాసులతో, నివాసాలలో, సామాజికంగా కుటుంబ పరంగా రక్షణ చర్యలు చేపడుతూ నిర్వహించాలన్నారు. పటాసులను లైసెన్సు ఉన్న దుకాణం నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. పటాసులను తడిచి పోకుండా దూరంగా భద్రపరచాలన్నారు. పిల్లలు ఒక్కదానితో ఒకటి పటాసులు తాకించకుండ పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. మొహానికి దగ్గరగా పటాసులు వెలిగించకూడదన్నారు నేలపై పెట్టి, దూరం నుంచి వెలిగించాలన్నారు. పటాసులు వెలిగించేటప్పుడు భద్రతా పరంగా మంటలను అదుపులోకి తెచ్చేందుకై బక్కెట్ నీరు ఇసుకను, దగ్గరగా ఉంచుకోవాల న్నారు పటాసులు లేదా దీపాల దగ్గర కాటన్ వస్త్రాలు మాత్రమే ధరించాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు పటాసుల వాసనకు దూరంగా ఉండాలనీ పటాసులు, దీపాల పొగ వల్ల ఊపిరితిత్తులు, కళ్ళు, చర్మం ప్రభావితమవుతాయన్నారు. ఫస్ట్ ఏయిడ్ కిట్, ఎమర్జెన్సీ నంబర్లు, హాస్పిటల్ కాంటాక్ట్‌లో ఉంచుకోవాలన్నారు చిన్న పిల్లలు, వృద్ధులకు దీపావళి బాణాసంచా కాల్చడంలో జాగ్రత్తలు తెలియజేయా లని ముందుగా భద్రతా మార్గదర్శకాలు చెప్పాలన్నారు. సామాజిక భద్రతా పరంగా రోడ్డు మీద, జన సముదాయం, ఆస్పత్రి, పాఠశాలలు దగ్గర పటా సులు వెలిగించరాదన్నారు సూచనలు పాటించడం ద్వారా మీ ఇంటి, పరిస రాలు, కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకొని, హర్షాతిరేకంతో దీపావళి పండుగను నిర్వహించు కోవచ్చునన్నారుపర్యావరణహిత దీపావళి అన్ని విధాల శ్రేయస్కరమని ఆయన తెలిపారు హాని కర టపాసులు కాకుండా, దీపాల కాంతులతో పర్యా వరణహిత దీపావళి పండగ మార్గదర్శకాలను పాటిస్తూ సురక్షితంగానిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే ఆనందరావు

పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తు న్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మంలో భాగంగా (నేడు) మూడో శనివారం స్వచ్ఛ మైన గాలి ఇతివృత్త కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించి విజయవంతం గావించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కొంకాపల్లి జవహర్లాల్ నెహ్రూ పురపాలక సంఘ ఉన్నత పాఠశాల నందు స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కొంకాపల్లి హైస్కూల్ నుండి ఎస్‌కేబిఆర్ డిగ్రీ కళాశాల వరకు వాహనాల కాలుష్యం నివారించాలనే నినాదంతో సైకిల్ ర్యాలీని స్థానిక శాసన సభ్యులు జిల్లా కలెక్టర్ మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్, అముడా చైర్మన్‌లు నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీని అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు హై స్కూల్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛమైన గాలి ఇతివృత్తంతో చేపట్టి విజయ వంతం చేశారన్నారు. అధికారులు, సిబ్బంది ఇదే బాటలో నడిచి భావి తరాలకు భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి రూపంలో వెలకట్టలేని సంపదను బహుమతిగా అందించ డంలో భాగస్వా ములు కావాలని కోరారు. క్లీన్ ఎయిర్ స్వచ్ఛమైన గాలి ఇతివృత్తంతో గాలి కాలుష్య కారకాలకు అడ్డుకట్ట వేస్తూ. హరిత విస్తీర్ణం పెంచడం ద్వారా స్వచ్ఛ మైన గాలిని ఐశ్వ ర్యంగా పొందవచ్చని సూచించారు. వివిధ పరిశ్రమల ఆక్వా చెరువు నుంచి కాలుష్యం వెదజ ల్లకుండా నియంత్రిస్తూ గ్రీన్ ఎనర్జీ చర్యలు బలోపేతం చేయాలని, సౌర విద్యు త్తు వినియోగం వంటి వాటిని ప్రోత్సహించాల న్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర,మణి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఫుడ్ ఫెస్టివల్‌లో హస్త నైపుణ్యం చూపిన విజ్ఞాన్ విద్యార్థులు

వీసీ ప్రొఫెసర్ ఎస్.ప్రసన్న శ్రీని ఆదర్శంగా తీసుకోవాలి : విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మల్లిడి శేషవేణి




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంచే విద్యతోపాటు, వారిలో దాగి ఉన్న విభిన్న ప్రతిభలను సైతం వెలికితీసేందుకు, నిత్యం ప్రయత్నిస్తూ, ప్రోత్సహిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ సేవలు ఆదర్శనీయమని. చైర్మన్ డాక్టర్ మల్లిడి శేషవేణి పేర్కొన్నారు. ఇటీవల ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ లో రాయవరం విజ్ఞాన్ విద్యాసంస్థల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మల్లిడి శేషవేణి మాట్లాడుతూ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో తమ విద్యార్థులు విజయం సాధించడం తమ సంస్థ కు ఎంతో గర్వకారణం అని అన్నారు. నారిశక్తి అవార్డుతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు పొందిన వీసీ ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ తమ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిచడం ఒక మధురానుభూతి అని ఆమె తెలిపారు. అటువంటి ఉన్నత వ్యక్తుల జీవితాలు ఆదర్శంగా తీసుకుంటూ, విద్యార్థులంతా జీవితంలో రాణించాలని చైర్మన్ శేషవేణి సూచించారు. కాగా ఈ పోటీలలో విజ్ఞాన్ విద్యాసంస్థల నుండి హర్షిత నాగసిరి (మాచవరం), మేఘన (పెడపర్తి), హర్ష సత్యప్రియ(వెదురుపాక సావరం), నీలిమ (కొమరిపాలెం), దివ్య (మహేంద్రవాడ), భాషిని (మాచవరం), జోష్ణవి (వెదురుపాక సావరం)లు తమ ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ అచ్చిరెడ్డి తెలియజేశారు. చదువులోనే కాకుండా, విద్యార్థులలో ఉన్నటువంటి పలు రకాల ప్రతిభ ను వెలికితీసే కార్యక్రమాలు చేపట్టిన వీసీ ప్రసన్న శ్రీ కి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి, వివిఎస్ఆర్ రూరల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్ రెడ్డి, విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. త్రివేణి, టిఎస్ఆర్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ తేతల సుబ్బిరెడ్డి, కెవిఎస్ శర్మ , అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## కాకినాడలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై

# మేధోమధన సదస్సు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జై భీమ్ రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ తలపెట్టిన మేధోమధన సదస్సు కాకినాడ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ నందు ఘనంగా నిర్వహించారు. ముందుగా కాకినాడ ఇంద్రపాలెం సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలో వేసి అక్కడినుండి కలెక్టరేట్ మీదుగా ర్యాలీగా బయలుదేరి డా బిఆర్ అంబేద్కర్ భవన్ వద్దకు చేరుకొని ప్రభుత్వం మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ పై మేధోమాధన సదస్సు నిర్వహించారు. మొదటిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాన్సీరామ్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది జగ్గారపు మల్లికార్జున అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా జై భీమ్ రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రావణ్ కుమార్ హాజరు కాగా, విశిష్ట అతిథులుగా మాజీ మంత్రి కురసాల కనబాబు మాజీ ఎంపీ వంగ గీత విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఒక హాస్పటల్ నిర్మాణం చేయాలంటే 5 నుండి 60 కోట్ల రూపాయలు అవసరం అవుతుందని, బహుజనులను చదువుకు దూరం చేయాలనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పి పి విధానం అంటే కూటమి ప్రభుత్వానికి ఇప్పటికీ కూడా పూర్తి అవగాహన రాలేదని, కేవలం బినామీలకు దూచిపెట్టడానికే పిపిపి విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఆరాటపడుతున్నారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణ కనుక చేస్తే పేద మధ్య దొరికితే విద్యార్థులు డాక్టర్లు చదివే అవకాశం పూర్తిగా లేకుండా పోతుందన్నారు. కోట్లు ఖర్చుపెట్టి డాక్టర్లు చదివే అవసరం ఎవరికి ఉంటుందని, ఇదంతా కోటమే ప్రభుత్వం పేదవారిని పేదవారిలా ఉంచడమే వారి ప్రధాన లక్ష్యమన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి 5వేల 600కోట్ల రూపాయలు బడ్జెట్లో వెచిస్తే మిగిలిన 3వేల కోట్ల రూపాయలు కూటమి ప్రభుత్వం కేటాయించలేక ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. సంవత్సరానికి 1000 కోట్ల రూపాయలు చొప్పున బడ్జెట్లో కేటాయించిన మూడు సంవత్సరాల 17 మెడికల్ కాలేజీలు పూర్తవుతాయని ఈ మాత్రం అవగాహన లేకుండా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారంటే సిగ్గుచేటన్నారు. నిరుపేదల విద్యార్థుల డాక్టర్ అనే డ్రీమ్ ను కూటమి ప్రభుత్వం బద్దలు చేస్తుందని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మాత్రమే తమకు ప్రామాణికమన్నారు. 33 సంవత్సరాల లీజుకు ఇచ్చిన పిపిపి విధానం వల్ల వేల కోట్ల రూపాయల ధనార్జన చేయడం జరుగుతుందన్నారు. పిపిపి విధానంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లోకేష్ బినామీలు మాత్రమే ఉన్నారని తెలియజేశారు. ఈ విధానంతో క్వాలిటీ లేని డాక్టర్లు రేపు సమాజంలోకి రాబోతారన్నారు. 11 వేల కోట్ల రూపాయల భూమిని కారు చౌకగా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని దీనిని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని తీరుతామన్నారు. దీనిపై కేవలం 10వేల రూపాయలు ఖర్చు చేసి 11 వేల రూపాయల భూమిని కాపాడమని శ్రావణ్ కుమార్ తెలియజేశారు. పిఠాపురం ప్రజలు బాధపడుతున్నారని దేశం మొత్తం పిఠాపురం వైపు చూస్తుందన్న పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు వెనక ఇప్పుడు పిఠాపురం ప్రజలు దేశం వైపు చూస్తున్నారని ఏద్దైనా చేశారు. రియల్ స్టార్ కి రియల్ స్టార్ కి చాలా తేడా ఉందని పవన్ కళ్యాణ్ అది గుర్తించాలన్నారు. నాలుగు లక్షల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని నకిలీ మద్యంతో చాలా జాగ్రత్తగా కోటమీ ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఫోటో ఎందుకు ఉండాలో తెలియజేయాలని దీనిపై రాజు లేని పోరాటం న్యాయస్థానంలో చేయడం జరుగుతుందన్నారు. వైకాపా ప్రభుత్వం చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా జై భీమ్ రావ్ భారత పార్టీ నుండి ఎనిమిది లక్షల సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ మేధావులలో 10 పేర్లు రాయాలంటే మొదటి పేరు జడ శ్రావణ్ కుమార్ పేరు రాస్తానని, చాలాసార్లు జడ శ్రావణ్ కుమార్‌ను కలవాలనుకున్నాను కానీ మొదటిసారిగా కాకినాడలో కలుస్తానని అనుకోలేదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్లో మేధోమధన సదస్సు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రజల పట్ల బాధ్యత లేకుండా కోటమే ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల్లోకి వచ్చిన మొదటి వ్యక్తి జడ శ్రావణ్ కుమార్ అని, దిగువ మధ్యతరగతి వాళ్లు బాగుండాలని జగన్ కోరుకునే వారిని ఎనిమిది వేల కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీలు నిర్మాణం చేయాలని జగన్ భావిస్తే దానిని ప్రైవేటీకరణ చేయాలని స్వతంత్ర ఆలోచనలతో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. మూడు వేల కోట్ల రూపాయలు వెచ్చించి మిగిలిన మెడికల్ కాలేజీ ల నిర్మాణాలు చేపట్టలేక పోవటం కోటప్ప ప్రభుత్వం అపవిజియమన్నారు. ఒకరోజు హాస్పిటల్ లో ఉండాలంటే 20 నుండి 25 వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నేడు ఉందని, గత 15 రోజులుగా డాక్టర్లు సమ్మె చేస్తుంటే కనీసం వారిని పిలిచి మాట్లాడలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఆగిపోతున్న గుండెలను తిరిగి కొట్టుకునే విధంగా చేసిన వైయస్సార్ సేవలు గత ప్రభుత్వంలో కరోనా సమయంలో చేసిన జగన్మోహన్ రెడ్డి సేవలో ఆంధ్ర ప్రజలు ఎప్పుడు గుర్తుపెట్టుకుంటారన్నారు. పీహెచ్సీ, సిహెచ్సీ లలో 72 రకాల మందులను ఇంకా ప్రభుత్వం అందించే 14 రకాల ఉచిత టెస్టులను చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని విమర్శించారు. పార్వతీపురం కేంద్రంలో 230 మంది చిన్నారులు అస్వస్థకు గురై కామెర్లు వస్తే 120 మంది చిన్నారులను కేజీహెచ్ లో చేర్పించే స్థాయికి కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తాగే నీళ్లలో మలమూత్రాలు వచ్చాయని రిపోర్టు వచ్చిందన్న విషయాన్ని కోటను ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్కడ కూడా బయట పెట్టకుండా ఉంచడం సిగ్గుచేట్టన్నారు. మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ మాట్లాడుతూ రైతుల వ్యతిరేక చట్టాల కోసం పోరాటం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని, ప్రైవేట్ కాలేజీ ఇలా జీవోపై రాష్ట్ర ప్రజలందరూ పోరాటం చేయాలన్నారు. వ్యక్తిత్వ వికాసానికి సమాజ వికాసానికి విద్య నిజమైన ఆయుధం లాంటిదని అటువంటి విద్యను పేద విద్యార్థులకు దూరం చేసే పని కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. సంతకాలు సంతకాల సేకరణలో తమ వంతు బాధ్యతగా సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతుందని దీనికి జడ శ్రావణ్ కుమార్ పూర్తి సహకారాన్ని అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావ్ భారత్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఏనుగుపల్లి కృష్ణ, న్యాయవాదులు దాడిశెట్టి వీరబాబు గుగ్గిలపు హరీష్, కాకినాడ స్మార్ట్ సిటీ నియోజకవర్గం ఇంచార్జ్ గింజల చక్రవర్తి, డాక్టర్ భానుమతి, సీనియర్ న్యాయవాదులు పృద్వి, శ్రీనివాస్, వైకాపా మహిళా నాయకులు రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, కృష్ణప్రియ, రాగిరెడ్డి బన్నీ, విద్యాసాగర్, హసేన్, ఎస్ఎఫ్ఐ సూరిబాబు, సతీష్, జీవివి వెంకటేశ్వరరావు, కాకిలేటి రవీంద్ర, సిద్ధాంతపు కొండబాబు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వాసన్ ఐ కేర్ - ఏఎస్‌జి హాస్పిటల్ ఆధ్వర్యంలో

# ప్రత్యేక దీపావళి

**15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో బాణసంచా సంబంధిత కంటి గాయాలకు ఉచిత సంప్రదింపులు మరియు శస్త్రచికిత్స**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ :** దీపావళి సమీపిస్తున్న కొద్దీ, ఆనందం, శ్రేయస్సు మరియు మంచి ఆరోగ్యంతో నిండిన పండుగ కోసం అందరికీ మా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. లైట్లు మరియు బాణసంచా అందంలో మనం ఆనందిస్తున్నప్పటికీ, బాణసంచా సంబంధిత కంటి గాయాలు తీవ్రమైనవి మరియు జీవితాన్ని మారుస్తాయని గుర్తుంచుకోవడం ముఖ్యం, ముఖ్యంగా పిల్లలకు.

వాసన్ ఐ కేర్ - ప్రముఖ నేత్ర సంరక్షణ సంస్థ అయిన ఏ ఎస్ జి హాస్పిటల్, దీపావళి సందర్భంగా తన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించడానికి సంతోషంగా ఉంది. పండుగ కాలంలో బాణసంచా సంబంధిత ప్రమాదాల ప్రమాదం పెరుగుతున్నందున, ఆసుపత్రి 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో కంటి గాయాలకు ఉచిత సంప్రదింపులు మరియు అవసరమైన శస్త్రచికిత్సలను అందిస్తోంది. ఈ సేవ 2025 అక్టోబర్ 15 నుండి 24 వరకు అన్ని వాసన్ ఐ కేర్ కేంద్రాలలో అందుబాటులో ఉంటుంది. ప్రతి బిడ్డకు సత్వర మరియు నిపుణుల సంరక్షణ లభించేలా చూడటం, దీర్ఘకాలిక దృష్టి నష్టాన్ని నివారించడం దీని లక్ష్యం. దీపావళి సందర్భంగా పటాకుల వల్ల కలిగే కంటి గాయాలు ప్రజారోగ్యానికి ప్రధాన సమస్యగా మిగిలిపోయాయి, ఇవి తరచుగా తీవ్రమైన మరియు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయి. 2023 నాటి జాతీయ డేటా ప్రకారం, భారతదేశం అంతటా 2,000 కంటే ఎక్కువ పటాకుల వల్ల కలిగే కంటి గాయాలు నమోదయ్యాయి, వీటిలో దాదాపు 60% 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ప్రభావితం చేస్తాయి మరియు దాదాపు 10% శాశ్వత దృష్టి కోల్పోతాయి. ఈ గణాంకాలు దుర్బల వర్గాలను రక్షించడానికి మరియు సురక్షితమైన వేడుకలను నిర్ధారించడానికి నివారణ చర్యల యొక్క అత్యవసర అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. పండుగ కాలంలో అత్యవసర కంటి గాయాలు సంభవించే కేసుల్లో 20% వరకు బాణసంచా వల్ల సంభవిస్తాయని, 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు 30% మంది మరియు బాలురు 85% మంది ప్రభావితమవుతారని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందుబాటులో ఉండేలా, అధిక-నాణ్యత సంరక్షణను నిర్ధారించడానికి, రోగులకు ఫార్మసీ, అనస్థీషియా మరియు ఆప్టికల్ సేవలకు మాత్రమే ఛార్జీ విధించబడుతుంది. ఈ చొరవ సమాజ సంక్షేమం, సురక్షితమైన దీపావళి వేడుకలను ప్రోత్సహించడం మరియు దేశంలోని చిన్న పిల్లలలో దృష్టి నష్టాన్ని నివారించడం పట్ల వాసన్ ఐ కేర్ యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుంది.

**దీపావళి సమయంలో కంటి గాయాలను నివారించడానికి చిట్కాలు**

వాసన్ ఐ కేర్ -పటాకుల సంబంధిత కంటి గాయాలను నివారించడానికి ఎఎస్‌జి హాస్పిటల్ నిపుణులు ఈ క్రింది భద్రతా చర్యలను సిఫార్సు చేస్తున్నారు:

❑ బాణసంచా తయారీలో ఉన్నప్పుడు లేదా వాటి దగ్గర ఉన్నప్పుడు, స్పార్క్‌లు, శిధిలాలు మరియు హానికరమైన రసాయనాల నుండి కళ్ళను రక్షించుకోవడానికి ఎల్లప్పుడూ సేఫ్టీ గ్లాసెస్ లేదా గాగుల్స్ వంటి రక్షిత కళ్లజోడు ధరించండి.

❑ బాణసంచా వెలిగించేటప్పుడు కనీసం 5%-%6 మీటర్ల సురక్షితమైన దూరాన్ని నిర్వహించండి మరియు మండే పదార్థాలు లేదా జనసమూహాలకు దూరంగా బహిరంగ, విశాలమైన ప్రదేశాలను ఉపయోగించండి.

❑ బాణసంచా వెలిగిస్తున్నప్పుడు పిల్లలను ఎల్లప్పుడూ పర్యవేక్షించండిబీ పర్యవేక్షణ లేకుండా బాణసంచా నిర్వహించడానికి లేదా మండించడానికి వారిని ఎప్పుడూ అనుమతించవద్దు. ఆదర్శవంతంగా, వారు సురక్షితమైన దూరంలో ప్రేక్షకులుగా ఉండనివ్వండి, ఎందుకంటే వారు ముఖ్యంగా హాని కలిగి ఉంటారు.

❑ ఇంట్లో తయారు చేసిన లేదా చట్టవిరుద్ధమైన బాణసంచా తయారీని నివారించండి, ఇది అస్థిరంగా మరియు మరింత ప్రమాదకరంగా ఉంటుంది.

❑ భద్రత మరియు తక్కువ పొగ కోసం రూపొందించిన ధృవీకరించబడిన, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఎంచుకోండి.

❑ బాణసంచా వెలిగించేటప్పుడు వాటిని మీ చేతిలో పట్టుకోకండి మరియు వెలిగించిన బాణసంచా మండించిందో లేదో తనిఖీ చేయడానికి ఎప్పుడూ వంగి లేదా దగ్గరకు వెళ్లవద్దు.

❑ బాణసంచా సురక్షితంగా వెలిగించడానికి పొడవైన ధూపం కర్రను ఉపయోగించండి.

❑ కళ్లతో ప్రమాదవశాత్తు రసాయన సంబంధాన్ని నివారించడానికి బాణసంచాను నిర్వహించిన తర్వాత మీ చేతులను బాగా కడగాలి.

❑ ఎప్పుడూ మళ్లీ వెలిగించడానికి లేదా చెత్త (పేలని) బాణసంచా తీయడానికి ప్రయత్నించవద్దు.

❑ అనుకోని మంటలు సంభవించినప్పుడు లేదా అత్యవసరంగా కళ్ళు శుభ్రం చేసుకోవడానికి బకెట్ నీరు, ఇసుక లేదా అగ్నిమాపక యంత్రాన్ని సమీపంలో ఉంచండి.

❑ కంటికి గాయం అయినప్పుడు, కంటిని రుద్దవద్దు, కడగవద్దు లేదా ఒత్తిడి చేయవద్దు.

❑ ఏదైనా ఎంబెడెడ్ వస్తువును తొలగించడానికి ప్రయత్నించవద్దు, లేపనాలు వేయవద్దు లేదా ఆస్పిరిన్ వంటి రక్తాన్ని పలుచన చేసే నొప్పి నివారణ మందులను తీసుకోవద్దు.

❑ శాశ్వత నష్టాన్ని తగ్గించడానికి తక్షణ వృత్తిపరమైన వైద్య సహాయం తీసుకోండి.

తక్షణ సహాయం లేదా మరిన్ని వివరాల కోసం, దయచేసి మా టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్‌ను సంప్రదించండి: 1800 571 2222.

**గమనిక: దీపావళి రోజున కూడా మా శాఖలు మా బహుళ విభాగ నిపుణుల బృందం ద్వారా అత్యవసర సంరక్షణను అందిస్తాయి.**

వాసన్ ఐ కేర్ - ఒక ఏ ఎస్ జి హాస్పిటల్ గురించి భారతదేశంలోని ప్రముఖ కంటి ఆసుపత్రి గొలుసు అయినవాసన్ ఐ కేర్, అత్యాధునిక సాంకేతికత మరియు నిపుణులైన నేత్ర వైద్యుల బృందంతో నడిచే అధునాతన కంటి సంరక్షణ సేవలను అందిస్తుంది. అసాధారణమైన రోగి ఫలితాలను మరియు సమాజ-కేంద్రీకృత ఆరోగ్య చొరవలను అందించడానికి మేము అంకితభావంతో ఉన్నాము. గాయాలు లేదా ప్రమాదాల కోసం కాదు. అని తెలిపారు.

# సాయిప్రియ సేవా సమితి 168వ వారం అన్నదానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయిప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కేంద్రం పిఠాపురం పశువుల సంతలో అన్నదాతలైన రైతులకుగా నిరవధికంగా వారానికి ఒక రోజు చొప్పున శనివారం మధ్యాహ్నం పూట ఆంధ్రా అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గుర్తుగా డొక్కా సీతమ్మ అన్నపానీయ సదుపాయ కేంద్రం పేరుతో నిర్వహిస్తున్న అన్నదానం ఈ శనివారంతో 168 వ వారానికి చేరుకుంది. అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అన్న లోకోక్తి అనుసారం దేశానికి వెన్నెముకైన అన్నదాతకు పెట్టెడు అన్నం పెట్టి వారిని ఆదుకుంటే అదే మహా భాగ్యమని భావించిన కాకినాడ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తలంచారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా 2010లో సాయిప్రియ సేవా సమితిని స్థాపించి, దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగుతూ శంఖవరం మండలం కత్తిపూడి కేంద్రంగా సాయిప్రియ సేవా సమితి ద్వారా వివిధ ప్రజాభివృద్ధి, సంక్షేమ, అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను 16 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం పేరుతో పిఠాపురం పట్టణంలో పశువుల సంత కేంద్రంగా రైతులు, పశువుల బేరగాళ్ళు, మధ్యవర్తులు, స్థానిక వివిధ ఆస్పత్రులకు వచ్చే దూర ప్రాంతాల రోగులకూ ప్రతీ శనివారం మధ్యాహ్నం అన్నదానాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. ఈ అన్నదానం ఈ శనివారంతో 168 వ వారానికి చేరుకుంది. దీనిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో నిర్వహిస్తు న్నారు. నేటి మధ్యాహ్నం రైతులకు, పశువుల బేరాల మధ్యవర్తులకు, వివిధ ఆస్పత్రులకు వచ్చిన ఔట్ పేషెంట్లకు కలిపి 750 మందికి అన్నదానం చేశారు. ఆహార పదార్థాలు వడ్డనలో స్వచ్ఛందంగా సేవలను అందించిన కోలా నాని, సఖినాల లచ్చబాబు, జ్యోతుల నాని, విప్పర్తి శ్రీనులను సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు అభినందించారు. తమ ఈ సేవలను పిఠాపురం పశువుల సంతకు వచ్చే రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని శంఖవరం మండలం కత్తిపూడిలోని సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

# చెల్లూరులో రైతులకు పొలంబడి కార్యక్రమం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** వరిలో కంకినల్లి పురుగు చిరుపొట్ట దశ నుంచి గింజలు గట్టిపడే దశ వరకు ఆశిస్తుందని, దీని ద్వారా ధాన్యం గింజలపై నల్లని మచ్చలు ఏర్పడి, గింజలలో రసాన్ని పీల్చి, తాలు గింజలుగా మారుస్తాయని మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కెవిన్ రమేష్ కుమార్ వరిలో నీటి యాజమాన్యం, కాండం తొలిచే పురుగు, కంకి నల్లి గురించి రైతులకు వివరించారు. వరి పంట చిరుపొట్ట దశ నుండి గింజ గట్టిపడే దశలో ఉన్నదని, ఈ దశలో పొలంలో నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలని, కనీసం రెండు అంగుళాలు లోతు నీరు ఉండాలని సూచించారు. ఈ దశలో నీటి ఎద్దడికి గురైతే వెన్ను సరిగా బయటికి రాక, తాలు గింజలు ఏర్పడతాయని అన్నారు. వరిలో కంకినల్లి పురుగు చిరుపొట్ట దశ నుంచి గింజలు గట్టిపడే దశ వరకు ఆశిస్తుందని, ధాన్యం గింజలపై నల్లని మచ్చలు ఏర్పడి, గింజలలో రసాన్ని పీల్చి తాలు గింజలుగా మారుస్తాయని, కంకి నల్లి ఆశించడం వల్ల పంట దిగుబడి తో పాటు గింజల నాణ్యత కూడా తగ్గిపోతుందని తెలిపారు. పొలం గట్ల మీద సువాసన ఇచ్చే మొక్కలు పెంచడం ద్వారా లేదా సువాసన కలిగిన సబ్బు నీటిని పిచికారి చేయడం వలన ఈ పురుగులను సేంద్రీయ పద్ధతిలో నియంత్రించవచ్చని సూచించారు. పంట నమోదు కార్యక్రమం అక్టోబర్ 25వ తేదీతో ముగుస్తుంది, పంట నమోదులో రైతుల నుంచి అభ్యంతరాలు పరిశీలించిన తర్వాత తుది జాబితా అక్టోబర్ 30వ తేదీకి రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలంబడి రైతులు, వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పునరుత్పాదక రంగానికి జీఎస్టీ తగ్గింపుతో సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ప్రభుత్వం : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జీఎస్టీ 2.0లో భాగంగా పునరుత్పాదక రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని కొత్తపేట ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిర్ణయంతో సోలార్ ఎనర్జీని వినియోగించే రైతులు, గృహ వినియోగదారులు భారీగా లాభపడనున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో 5 హెచ్‌పి సోలార్ పంపు ధర రూ.2.50 లక్షలుగా ఉండగా, జీఎస్టీ తగ్గింపు తర్వాత రూ.2.21 లక్షలకు లభిస్తోందని, దీని ద్వారా రైతులు రూ.29,000 వరకు లాభం పొందుతున్నారని వివరించారు.అలాగే, సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్‌పై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించడం ద్వారా గృహ వినియోగదారులు తక్కువ ధరకే సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లభించిందని తెలిపారు.ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి పైకప్పుపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని, అలాగే పర్యావరణహిత విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సూచించారు.పునరుత్పాదక రంగంలో జీఎస్టీ తగ్గింపుతో లభించే లాభాలను ప్రజలకు తెలియజేసేలా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్వహించిన బైక్ ర్యాలీని వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.చిట్టిరాజు, కొత్తపేట అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, రావులపాలెం అసిస్టెంట్ ఇంజనీర్ పి.నరేష్, ఆత్రేయపురం అసిస్టెంట్ ఇంజనీర్ టి.అశోక్ మరియు ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలో 'గూగుల్ డేటా సెంటర్'

# ఆర్థిక రంగంలో కొత్త ఊపిరిని ఇచ్చింది..

**రాష్ట్రానికి రావడం గర్వకారణం - ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన దీపావళి కానుక**
**చంద్రబాబు, లోకేష్‌ల కృషి అభినందనీయం - కీర్తిస్తున్న జాతీయ, అంతర్జాతీయ మీడియా**
**ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఏర్పడనున్న ఆంధ్రప్రదేశ్ - గూగుల్ సెంటర్ విషయంలో వైసిపి నేతల సన్నాయి నొక్కులు**
**రాజమండ్రిలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రెస్ మీట్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలో 'గూగుల్ డేటా సెంటర్' ఏర్పాటు కానుండడం రాష్ట్రానికి గర్వకారణంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన దీపావళి కానుకగా ఆయన అభివర్ణించారు. ఈవిషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , ఐటి మంత్రి లోకేష్ ల కృషి అభినందనీయమన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాదాపు ఒక లక్ష 30వేల కోట్లతో ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ విశాఖలో ప్రారంభం కావడం భారత్ సాధించిన అతి గొప్ప విజయంగా పేర్కొన్నారు. దీని వలన దాదాపు లక్షన్నర మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. భారతదేశాన్ని ఇబ్బందులకు గురిచేయాలని అగ్రరాజ్యాలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో గూగుల్ ఏ ఐ టెక్నాలజి తో డేటా సెంటర్ ఏర్పాటుకి ముందుకు రావడం సంతోషకరమన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు విషయంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ మీడియా సంస్థలు అన్ని ఆంధ్రప్రదేశ్ ను మెచ్చుకుంటూ, కీర్తిస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోదాహరణంగా ప్రస్తావించారు. ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టినప్పుడు 1998లో మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చారని, ఇప్పుడు గూగుల్ తెచ్చారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ తోపాటు విశాఖపట్నం కీర్తి పెరుగుతుందన్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్ వస్తే పర్యావరణా నికి హానికరమని వైసిపి నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆయన విమర్శించారు. మరి జగన్మోహన్ రెడ్డి పర్యటనల కోసం వృక్షాలను కొట్టి వేసినప్పుడు పర్యావరణానికి నష్టం కలగలేదా అని ఆయన ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డికి గూగుల్ అంటే భయం అని ఆయన పేర్కొంటూ, ఎందుకంటే వారి చరిత్ర అంతా గూగుల్లో దొరుకుతుందని వ్యాఖ్యానించారు. మరోపక్క గూగుల్ తమ హయాంలో తెచ్చామని వైసిపి వాళ్ళు చెప్పడం శోచనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెడుతున్నట్లు స్వయంగా సుందర్ పిచాయ్ చెప్పారని, అలాగే తమిళనాడుకి చెందిన సుందర్ పిచాయ్ ఆంధ్రాలో గూగుల్ సెంటర్ ఏర్పాటు చేస్తుంటే,ప్రభుత్వం ఏం చేస్తోందని, తమిళనాడు ప్రభుత్వాన్ని అసెంబ్లీలో విపక్షాలు నిలదీశాయని దీన్ని బట్టి ఎవరి హయాంలో వచ్చిందో అర్థం చేసుకోవచ్చని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ను ఐటీ విప్లవ కారుడిగా గుర్తించాలని, అలాగే తండ్రికి తనయుడిగా లోకేష్ పనిచేస్తున్నారని ఆయన అన్నారు.

**ఆరోపణలు కాదు చర్చకు రావాలి..**

నా మీద ఆరోపణలు చేసేవారు బహిరంగంగా చర్చకు రావాలని, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డా సూర్య నారాయణ రెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పలు ప్రశ్నలకు సమాధానం గా చెప్పారు. ఎన్నిసార్లు సవాల్ చేసినా రాకుండా కేవలం వీడియోలు కట్ పేస్ట్ లు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మట్టి,మద్యం, ఇసుక కాంట్రాక్టుల్లో నాకు ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టంచేసారు. నా అవినీతిని రుజువు చేయగలిగితే నా పదవికి రాజీనామా చేస్తానని ఆయన ప్రకటించారు. కాగా రాయవరం బాణాసంచా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఖచ్చితంగా ఆదుకుంటుందన్నారు. రెండు మూడు రోజుల్లో వారి నష్టపరిహారం ప్రకటిస్తారని ఆయన సూచించారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే సూర్యనా రాయణ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఈ ఘటనలో జడ్జి చేసే విచారణను కూడా తప్పు పట్టడం సరికాదని, ఒకవిధంగా ఇది కంటెమ్ట్ కిందకు వస్తుందేమోనని ఆయన అన్నారు. గతంలో సూర్యనారాయణ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన ఊరేగింపు సందర్భంగా బాణాసంచా మీద పడి చనిపోయిన వారి కుటుంబాలకు ఎంత నష్టపరిహారం ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. గోదావరి జిల్లాల్లో భూములు కొరత కారణంగా భారీ పరిశ్రమలను తీసుకురాలేకపోతున్నామని, అయినా ఆగ్రో బేస్డ్ పరిశ్రమలను పెద్దఎత్తున తీసుకు రావడానికి తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర,తూర్పుగోదావరి జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, గోదావరి జిల్లాల జనసేన సమన్వయ కర్త రావాడ నాగు, ఏఎంసి చైర్మన్ సూర్యకుమారి, తూర్పుగోదావరి జిల్లా బిజెపి మీడియా ఇంచార్జ్ వీర వీరాంజనేయులు పాల్గొన్నారు.

# మజ్జి రాంబాబు ఫోన్ కాల్ డేటా బయట పెట్టాలి

**లిక్కర్ సిండికేట్‌లో అడ్డంగా దొరికి కులాన్ని అడ్డుపెట్టుకుంటున్న టిడిపి - తూర్పుకాపులకు ప్రాధాన్యత ఇచ్చింది వైసిపి మాత్రమే**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** లిక్కర్ సిండికేట్ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు ఫోన్ కాల్స్ డేటా ను బయట పెట్టాలిని వైసిపి రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ మజ్జి అప్పారావు విమర్శించారు. శనివారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుకాపులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తూర్పు కాపులకు స్థలం కేటాయించారని గుర్తు చేశారు. గతంలో రాజమండ్రిలో తూర్పు కాపు నాయకులైన ఇయ్యపు కూర్మారావు, రుంకాని వెంకటేశ్వరరావు తదితరులను టిడిపి పార్టీ వాడుకొని వారికి ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తూర్పు కాపులను గుర్తించి 2004, 2009లలో పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించారని అన్నారు. ఆ సమయంలో మీరు రాజకీయాల్లోనే లేరని పేర్కొన్నారు. 2014లో తూర్పు కాపులకు సీటు కేటాయిస్తే వారిని ఓడించేందుకు టిడిపి నాయకులు కృషి చేశారని అన్నారు. అయితే రుడా చైర్మన్ మార్గాని భరత్ రామ్ తూర్పు కాపు సామాజికవర్గానికి చెందిన రౌతు సూర్యప్రకాష్ రావుకు కేటాయించినట్లు వివరించారు. ఈ మధ్యకాలంలో టిడిపి వారు తూర్పు కాపు కులానికి ద్రోహం చేశారని అన్నారు. ఆర్యపురం కో- పరేటివ్ అర్బన్ బ్యాంకు పదవిలో ఉన్న పోలాకి పరమేష్ ను 15 నెలల్లోనే రాజీనామా చేసి వెళ్లిపోయేలా కుట్ర చేశారని అన్నారు. ఆయనను తిరిగి ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అధిష్టానం మెప్పు కోసం ఆయనను తప్పించడం నిజం కాదా అని ప్రశ్నించారు. తూర్పు కాపులకు వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలోని న్యాయం జరిగిందని అన్నారు. లిక్కర్ సిండికేట్ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయి తప్పించుకునేందుకు కులాన్ని అడ్డుపెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఆ వ్యవహారంలో సంబంధం లేకపోతే ట్రూత్ టెస్ట్ కు మీరు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. అక్టోబర్ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు కాల్ డేటాను బయటపెట్టాలని సవాల్ చేశారు. విలేకర్ల సమావేశంలో వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు సాప్ప నారాయణ, వైఎస్ఆర్సిపి తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి రూకం త్రినాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామ్, సిటీ సెక్రెటరీ అజ్జవరపు శ్రీను, చంద్ర మోహన్,నంద స్వామి,శివ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బోడెం రాంబాబుకు మదర్ థెరిసా సేవా సమితి సత్కారం

**రంగంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండల పరిధిలో వెంకటాపురం గ్రామం బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రముఖ సామాజిక వాది, మంచి మనిషి బోడెం రాంబాబు (బిజెపి రాంబాబు) రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) డైరెక్టర్‌గా నియమితులైన శుభ సందర్భం గా మదర్ థెరిసా సేవాసమితి తరపున చిరు సత్కారం అందజేయడం జరిగింది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు వెంకటాపురం గ్రామంలో బోడెం రాంబాబు నివాసంలో మదర్ తెరిసా సేవాసమితి వ్యవస్థాపకుడు ఉందుర్తి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ బోడెం



రాంబాబు వెంకటాపురం గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారని మదర్ తెరిసా సేవాసమితి నిర్వహించే సేవా కార్యక్రమాలు కూడా తన వంతు సహకారం అందిస్తుంటారని రాంబాబు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు మంగిన వెంకన్నబాబు, ముంగి తాతారావు మాట్లాడుతూ రాంబాబు భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి విశేషమైన కృషి చేసినందుకుగాను అనపర్తి నియోజకవర్గం శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరిల సూచన మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ బోడెం రామచంద్రరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎం.చిన్నప్పారావు పి.రాజేశ్వరరావు, సిహెచ్. సత్యనారాయణ దొర, ఎస్ గంగాధర్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వివాహ కౌన్సెలింగ్ కేంద్రాలు నిర్ణయం భేష్..

**మంత్రి సీతక్క దూరదృష్టికి ధన్యవాదాలు - డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని యువతలో అవగాహన పెంచి, కుటుంబాల్లో స్థిరత్వం తీసుకురావాలనే ఉన్నత దృష్టితో వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా,లయన్స్ క్లబ్ 320ఎ ఆధ్వర్యంలో డా. హిప్నో కమలాకర్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో ముఖ్యమైన సమావేశం శనివారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సాగర్ల రఘు, సెక్రటరీ డా.పి.రమేష్ కుమార్, డా.వి.జే.ఇ. క్యార్లిన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు షాహినా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ నిర్ణయం సమాజానికి ఎంతో అవసరమైనదన్నారు. ఈ కేంద్రాల ద్వారా పెళ్లికి ముందే యువతకు మానసిక, భావోద్వేగ, సామాజిక అవగాహన కలగడం వల్ల అనవసర విభేదాలు తగ్గి, సుస్థిరమైన, సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం విడాకులు, వివాహ విభేదాలు పెరుగుతున్న ఈ కాలంలో, ప్రభుత్వం తీసుకున్న ఈ అడుగు మంచి మాట, మంచి మార్గం, మంచి మనసు కలయికగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించబోయే ఈ కేంద్రాలు ప్రేమ, పరస్పర గౌరవం, సహనం అనే విలువలను పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. సైకాలజిస్ట్ లను ఎక్కువ సంఖ్యలో నియమించాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఈ సేవలు ఉచితంగా లభించటం మరో గొప్ప విషయమన్నారు. ఈ దిశగా ముందడుగు వేసిన మంత్రి సీతక్క సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారత, కుటుంబ బలపాటుకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.ఆమె నాయకత్వం దూరదృష్టికి మా తరపున హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు.

# భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందిద్దాం : అశోక్ కుమార్

**మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** భావితరాలకు వాహన కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలిని అందిందామని కోరుకొండ ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా కోరుకొండ గ్రామపంచాయతీ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ గణేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, కాలుష్యాన్ని అందిద్దాం అంటూ నినాదాలు చేస్తూ, స్వచ్ఛమైన గాలి కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బత్తిన మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వం ప్రజాఆరోగ్య పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలను ప్రవేశ పెడుతుందన్నారు. మనం ప్రకృతి ఇచ్చిన వనరులు పొదుపుగా ఉపయోగించి, భావితరాలకు పరిశుద్ధమైన గాలి అందించాలని అది చెట్లు నాటడం ద్వారా సాధ్యపడు తుందన్నారు.వాతావరణం కాలుష్య నివారణలో భాగంగా వాహనాలను విచ్చలవిడిగా ఉపయోగించకుండా సైకిళ్ళు వాడుకోవడం, నడవడం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించి ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న సోలార్ ఎనర్జీని ప్రోత్సహించడం ద్వారా స్వచ్ఛమైన ప్రకృతి గాలి అందుతుందన్నారు. విరివిగా మొక్కలు నాటడం ప్రజలకు ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పేపర్ బ్యాగ్‌లు, క్లాత్ బ్యాగ్‌లు వాడాలని సూచించారు. కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం పై ఏర్పాటు చేసిన 5కెవి సోలార్ ప్యానెల్బోర్డుని విద్యార్థిని విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వర ప్రతాప్, సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ గణేష్, సెక్రటరీ రమేష్ బాబు, ఆశ, అంగన్వాడి సిబ్బంది,ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గరగ శ్రీధర్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో**

# అందరూ భాగస్వాములు కావాలి

**కార్యదర్శి అరుణ్ కుమార్**




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రాపాక గ్రామ పంచాయితీ కార్యదర్శి కె.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై రాపాక గ్రామ పంచాయతీని స్వచ్ఛత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తోడ్పాటును అందించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ,దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రతినెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని రాపాక గ్రామ పంచాయతీలో పటిష్టంగా అమలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎంపీపీ స్కూల్ సమీపంలో కార్యదర్శి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పై ప్రజలకు అవగాహన కల్పించారు. విష జ్వరాలు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా ప్రజలు సహకరించాలని కోరుతున్నామని అన్నారు. ప్రతి షాపు యజమాని ప్లాస్టిక్ అమ్మకాలను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ప్లాస్టిక్ వలన ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. విద్యార్థులతో గ్రామ పెద్దలతో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్రపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించామని కార్యదర్శి అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటరావు,ఎంపీటీసీ సుంకవల్లి సత్యనారాయణ, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు,విఓవోఏ పిట్టా చంద్ర,,విద్యార్థులు,గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### లొల్లలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో

# పాల్గొన్న ఎమ్మెల్యే బండారు




కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : సైకిల్ వాడకంతో మనతో పాటు పర్యావరణానికి ఆరోగ్యమంటూ సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సత్యానందరావు వ్యాఖ్యానించారు. శనివారం లొల్ల గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోజువారి జీవనంలో సైకిల్ వాడకం వల్ల శారీరక ఆరోగ్యం బాగుండడంతో పాటు, పర్యావరణానికి సైతం మనం మేలు చేసిన వాళ్ళమవుతామన్నారు. సర్పంచ్ కాయల జగన్నాథంతో కల్సి గ్రామంలో సైకిల్ తొక్కుతూ కొద్ది దూరం ప్రయాణించి అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందుతున్న భోజనం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. వారు ఎమ్మెల్యే వద్ద భోజనం బాగుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఆరు పంచాయతీలు మాత్రమే ఎంపికయితే అందులో లొల్ల కూడా ఉండడం గర్వకారణమన్నారు. ఇదే రీతిలో లొల్ల పంచాయతీ జాతీయస్థాయిలో సైతం స్వచ్ఛ అవార్డును గెలుచుకొని ప్రధాని చేతుల మీదుగా అవార్డు తీసుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. లొల్ల గ్రామాన్ని గ్రామపంచాయతీలన్నీ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పల్లెలు స్వచ్ఛంగా ఉన్నప్పుడు నియోజకవర్గం స్వచ్ఛంగా ఉంటుందని, తద్వారా రాష్ట్రం, దేశం స్వచ్ఛంగా మారతాయన్నారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించి మొక్కలు నాటారు.

# సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ

### జీఎస్టీ తగ్గింపుపై రామచంద్రపురంలో విస్తృత ప్రచారం



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో, వ్యాపారుల్లో అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ,మున్సిపల్ అధికారులు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రామచంద్ర పురంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక రాజగోపాల్ సెంటర్ నుంచి ప్రారంభమై మార్కెట్ సెంటర్ వరకు సాగింది. ఈ ర్యాలీలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ రాజు,విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.రత్నాలు రావు,డిఈ శ్రీకాంత్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ మేడిశెట్టి వెంకటరమణ పలువురు సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీని ఉద్దేశించి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు చేకూరే ప్రయోజనాలు పై వ్యాపారులకు ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కోసం ఇంటింటా ప్రచార అవగాహన, ర్యాలీలు, అవగాహన సదస్సులు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయ న్నారు. జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు, వ్యాపారులు వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కరపత్రాలు అందచేసి, జీఎస్టీ నూతన సంస్కరణల ద్వారా చేకూరె ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నా మన్నారు. జిఎస్టి స్లాబులు తగ్గింపుతో నిత్యవసరాల వస్తువుల ధరలతో పాటు, సామాన్య ప్రజలకు సైతం ప్రయోజనం చేకూరేలా జీఎస్టీ రేట్లు తగ్గించారన్నారు. జిఎస్టి సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యయమని మంత్రి పేర్కొన్నారు.సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో కూటమి పార్టీ నాయకులు చురుకుగా పాల్గొవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, స్టేట్ జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ పి సత్యనారాయణ, డిఈ శ్రీకాంత్,మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది, కూటమి పార్టీ నాయకులు, కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రేపటి భవిష్యత్తుని శాశించే శక్తి నేటి బాలికలకే ఉంది

### విద్యతోనే బాలికలకి అగ్రస్థానం : సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం


బాలికా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం


గర్భిణీ స్త్రీలు, బాలింతలకు సీమంతాలు నిర్వహిస్తున్న వాసంశెట్టి సత్యం తదితరులు

కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ : భవిష్యత్తుని శాసించే శక్తి నేటి బాలికలకే ఉందని, బాలికల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశంలో ప్రతీ కుటుంభం సంతోషంగా మారుతుందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కాజులూరు జడ్పీ హై స్కూల్లో తాళ్లరేవు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వై శ్రీదేవి అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ బాలిక దినోత్సవం ముగింపు, 8 వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ స్త్రీ లేనిదే జననం లేదని కుటుంబాన్ని చక్కదిద్దడంలో మహిళలు పోషించే పాత్ర వర్ణించలేనిదన్నారు. మహిళలు ఓర్పు, సహనం కు మారుపేరని, అట్టి స్త్రీ మూర్తిలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తుండడం శుభపరిణామం అన్నారు. దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము, అంతరిక్ష యానం చేసిన సునీత విలియమ్స్ లను నేటి బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని వాసంశెట్టి సత్యం సూచించారు. తల్లి తండ్రి లేని 125 మంది విద్యార్థులను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా దత్తత తీసుకొని వారికి ఉద్యోగం వచ్చేవరకు చదివిస్తున్నామన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో అనారోగ్యంతో బాధపడే వారికి కార్పొరేట్ ఆసుపత్రిలో సైతం వైద్యం అందేలా కృషి చేస్తున్నమన్నారు. రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ బాలికలు పోషకాహారం తీసుకుని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంతరాయ్, ఎంపీడీవో రాంబాబులు మాట్లాడుతూ మహిళలు నింగి నుంచి నేల వరకు ఎదిగి దేశాన్ని పాలించే స్థాయికి ఎదగడం ఆనందకరమన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, సిడిపిఓ వై శ్రీదేవి ఇతర అతిథులచే ఘనంగా సామూహిక శ్రీమంతం చేశారు. చీరలు, గాజులు,పళ్ళు అందించి సత్యం వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు నిషేధం తదితర అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథి వాసంశెట్టి సత్యం, కమిషనర్ రాజు, ఎంపీడీవో రాంబాబు, ఎ ఏం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,తాళ్ళరేవు ఐసిడిఎస్ సిడిపిఓ వై శ్రీదేవి తదితరుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు చావ్వాకుల నారాయణమూర్తి, క్లస్టర్ కో ఆర్డినేటర్ వనుం వీరబ్రహ్మాం, బీసీ సెల్ నాయకులు వల్లు అర్జునరావు, ప్రచార కార్యదర్శి శేషరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, ఎలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, ఐసిడిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మందేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదాయం రూ.12,55,195/-లు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనివారం శని త్రయోదశి (ప్రదోషం) సందర్భంగా తైలాభిషేకములు ద్వారా రూ.7,85,700/-లు మరియు ఆన్లైన్ పరోక్ష పూజలు ద్వారా రూ.3,94,400/-లు అన్న ప్రసాదం విరాళాలుగా రూ.75,095/-లు వెరసి మొత్తం రూ.12,55,195/-లు ఆదాయం వచ్చినది అని దారపురెడ్డి సురేష్ బాబు,సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.



### సూపర్ హిట్ - సూపర్ సిక్స్ పథకాలను జీర్ణించుకోలేక

# చిర్ల చిల్లర మాటలు మాట్లాడుతున్నారు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై బురద జల డం ఆయనకు పరిపాటిగా మారింది. సూపర్ హిట్ సూపర్ సిక్స్ పథకాలను జీర్ణించుకోలేకపోతు న్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మాటున అక్రమ మద్యం వ్యాపా రాలు జరిగాయి. నాసిరకం మద్యం విక్రయాలతో, మరణాలు సంభవించి, పేదల కుటుంబాలు కుప్పకూలిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక. పారదర్శకంగా మద్యం షాపులు లాటరీ పద్ధతిలో కేటాయింపులు జరిపింది. ఎవరు ఏ పార్టీకి చెందిన వారైనా,పాటదారులుగా షాపులు దక్కించుకుని దుకాణాల నిర్వహిస్తున్నారు కొత్తపేట నియోజక వర్గంలో వైసిపి నాయకులు మద్యం వ్యాపారంలో ఉన్నారు. గుర్రం మార్కు మద్యం, బండారు మద్యం అంటూ చిర్ల మాట్లాడుతున్నారు. వారి మద్దతు దారులు షాపుల్లో ఉంటే వాటిని ఎక్సైజ్ భాగానికి ముందు అందజేయండి వ్యక్తిగతంగా బురద జల్లడం కోసం చిల్లర మాటలు మాట్లాడటం తప్ప,సమస్యల గురించి మాట్లాడటం చిర్ల వారికి చేతకావడం లేదు.కేవలం ఇసుక,మద్యం గురించి మాట్లాడ్డం ఒక్కటే మాజీ ఎమ్మెల్యే నేర్చుకున్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం సంబంధించి రుజువులు బయటపడుతుండటంతో వైసీపీ నేతలు భుజాలు తడుముకుంటున్నారు. వారి అవినీతి డొంక కదులుతుందనే భయంతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆత్రేయపురం మండలంలో ప్రభుత్వ స్థలంలో మద్యం షాపు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణం ఏర్పాటు చేస్తే దాన్ని తొలగించమని కోరేహక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది.ఎదుటివారిపై బురద జల్లడం కోసం గుర్రం మార్కు మద్యం, పేలిపోతున్న కుక్కర్లు అంటూ చిల్లర మాటలు మాట్లాడితే వారి స్థాయి తగ్గుతుంది కానీ పెరగదని గుర్తుంచుకోవాలి అని గుత్తుల పట్టాభి రామారావు, ముత్యాల బాబ్జి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మాసాబత్తుల ఆనందరావు, జిల్లా టిడిపి కార్యదర్శి కొప్పిశెట్టి ప్రసాద్, రావులపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, కొత్తపేట మండల టీడీపీ అధ్యక్షుడు కాసా విజయసాగర్, కొత్తపేట నియోజకవర్గం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు నందం సూరిబాబు, కొత్తపేట నియోజకవర్గం టీడీపీ వాణిజ్య సెల్ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి అచ్చిరెడ్డి, రావులపాలెం టిడిపి అధ్యక్షుడు తెలియజేశారు.



## జ్యోతులకు జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేసిన పెందుర్తి అభిరామ్

సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : జగ్గంపేట శాసన సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూకు ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ (మినిస్టర్)పెందుర్తి వెంకటేష్ తనయుడు యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా ధన్వంతరి జయంతి



మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కమ్యూనిటీ పారామెడిక్ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ పియంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి శనివారం నిర్వహించారు. జిల్లా పీఎంపీ అద్యక్షులు కోన సత్యనారాయణ ధన్వంతరి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ దేశంలో ప్రాచీన కాలం నుంచి అందుబాటులో ఉన్న వైద్యం ఆయుర్వేద వైద్యం అని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యాన్ని ఎందరో మహానుభావులు సాధన చేసి అందులో నిష్ణాతులయ్యారన్నారు. దీనికి మూలపురుషుడుగా భావించే ధన్వంతరి మానవులకు ఆయుర్వేద జ్ఞానాన్ని అందించాడన్నారు. సూర్య భగవాన్ వద్ద ఆయుర్వేదం నేర్చుకున్న ధన్వంతరి 16 మంది శిష్యుల్లో ఒకడని చెప్పారు. దీపావళికి ముందు వచ్చే ఆశీయుజ బహుళ త్రయోదశి రోజు ఆరోగ్యానికి సంపదకు ప్రతీకైన ధన్వంతరిని పూజించడంవల్ల ఆరోగ్యం దీర్ఘాయువు సంపద కలుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎంపీ జిల్లా గౌరవ అధ్యక్షులు బళ్ల వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి ఇరవాడ రవికుమార్, మండల కోశాధికారి వానపల్లి కనకరాజు,మండిపూడి చంద్రశేఖర్, పొన్నాడ శ్రీనివాస్,ఇందన వెంకటేశ్వరరావు,ఇరవాడ ఏడుకొండలు, శ్రీను, నరేష్, గాలింకి నాగేశ్వరరావు,సతీష్, శ్రీను,పియంపిలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత మండపేటగా తీర్చిదిద్దాలి...

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సోలార్ సబ్సిడీని సద్వినియోగించుకోండి.. : ఎమ్మెల్యే వేగుళ్ళ







మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం లో భాగంగా స్వచ్ఛత బైక్ ర్యాలీ నిర్వహించారు. మండపేట పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఈకార్యక్రమం శనివారం జరిగింది. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసారు. స్వచ్ఛత ర్యాలీ బైక్ ర్యాలీ ఆరంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర లో భాగంగా మండపేట నియోజకవర్గాన్ని, మండపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత మండపేటగా తీర్చిద్దిదాలనే ఆలోచనతో ఉన్నామన్నారు. మండపేట కౌన్సిల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల మూడవ శనివారం ప్రజలను జాగృతం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు భాధ్యత తీసుకొని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని కోరారు. తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని పేర్కొన్నారు. అనంతరం మెయిన్ రోడ్డు నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ విద్యుత్ సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ ద్వారా ఈ పథకంను ప్రజలందరికి అందిస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. పర్యావరణరహితంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమీషనర్ టి.వి. రంగారావు విద్యుత్ డి.ఇ, ఎ.డి,ఇ., ఎ.ఈ లు విద్యుత్ ఉద్యోగులు, కమర్షియల్ ట్యాక్స్ శాఖా ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# జన సేన లెక్కలు పక్కాగానేనట..!



పవన్ కళ్యాణ్ కి రాజకీయ అనుభవం లేదని ఆయనకు పెద్దగా వ్యూహాలు తెలియవు అని ఎవరైనా అనుకుంటే పొరపాటు పడినట్లే అంటారు రాజకీయ విశ్లేషకులు. పవన్ 2014 మార్చి లో పార్టీ స్థాపించిన నాటి నుంచి ఈ రోజు వరకూ ఆయన వ్యవహరించిన తీరు పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయాలు చూస్తే కనుక ఆయన రాజకీయ వైఖరి అర్థం అవుతుంది అని అంటున్నారు. 2024 ఎన్నికల్లో పవన్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. బాబు తర్వాత కూటమిలో అంతటి వారుగా ఫోకస్ అవుతున్నారు. ఇదంతా కేవలం ఒకే ఒక్క సారి ఎమ్మెల్యేగా గెలిచిన దానికే జరిగింది అంటే పవన్ రాజకీయం వేరే లెవెల్ అని అంటున్నారు.

**పదిహేనేళ్ళు అంటే :** ఇక చూస్తే పవన్ తెలుగుదేశం బీజేపీతో కలసి కూటమి కట్టారు. ఈ కూటమి ఏర్పాటు కోసం ఒకింత తగ్గారు. తనకు దక్కిన సీట్లను సైతం త్యాగం చేశారు. నిజానికి 2024 ఎన్నికల్లో 24 సీట్లు తీసుకున్నా లేక 21 తీసుకున్నా జనసేనకు సీఎం పదవి అయితే ఇవ్వరు, పైగా పవన్ ఒకసారి కూడా అప్పటికి ఎమ్మెల్యేగా గెలవలేదు, అందుకే అన్నీ ఆలోచించిన మీదటనే బాగా తగ్గారు. అలా తాను సర్దుకునిపోయే నాయకుడిని అని ఎస్టాబ్లిష్ చేసుకోగలిగారు. అదే సమయంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు మంత్రి పదవులు తీసుకున్నారు. అదే విధంగా ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా అందుకున్నారు. జనసేన విషయంలో తీసుకుంటే ఇది బిగ్ అచీవ్ మెంట్ అనే చెప్పాలని అంటారు. ఆ పార్టీకి ఉన్న ఓటు షేర్ ని కూటమి కట్టడం ద్వారానే ఈ విధంగా సాధించగలిగారు అని అంటారు.

**కనీసంగా యాభై :** ఇక వచ్చే ఎన్నికల్లో మాత్రం పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ భారీ ఎత్తున సీట్లను డిమాండ్ చేస్తుంది అని ప్రచారం సాగుతోంది. అప్పటికి పవన్ కళ్యాణ్ కి ఉప ముఖ్యమంత్రిగా అయిదేళ్ల అనుభవం ఉంటుంది. అంతే కాకుండా రాజకీయంగా మరింత రాటు తేలతారు. దానికి తోడు బీజేపీ టీడీపీ పార్టీల రాజకీయ అవసరాలు అనివార్యతలు పవన్ కంటే ఎవరికీ పెద్దగా తెలియవు అని కూడా చెబుతారు. రాజకీయాల్లో ఇవే ఏ పార్టీని అయిన ముందుకు తీసుకుని వెళ్తాయి. కూటమితోనే మళ్ళీ ఎన్నికలకు వెళ్ళాలని టీడీపీ బీజేపీలకు కూడా ఉంది. జనసేన అదే బాహాటంగా చెబుతోంది. దాంతో ఈసారి అధిక సీట్లను డిమాండ్ చేయడం ఖాయమని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్ల పునర్ విభజన జరిగితే ఓకే అదనంగా మరో యాభై సీట్లు పెరుగుతాయి. అలా కాదు అనుకున్నా కూడా ఉన్న 175 సీట్లలోనే కనీసంగా యభై సీట్లను తీసుకుని పోటీ చేయడానికి జనసేన చూస్తుందని అంటున్నారు.

**మరింత కీలకంగా :** ఈసారి ప్రభుత్వం వస్తే మరింత కీలకంగా వ్యవహరించడానికి జనసేన తనదైన వ్యూహాలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటోంది అని అంటున్నారు. ఇక 2029 లో మరోమారు కూటమి అధికారంలోకి వచ్చినా ఈ స్థాయిలో సీట్లు అయితే రావు, కచ్చితంగా టీడీపీ జనసేన ఎమ్మెల్యేల మద్దతు మీద ప్రభుత్వం ఏర్పాటులో ఆధారపడక తప్పదని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. అదే కనుక జరిగితే జనసేన రొట్టె విరిగి నేతిలో పడినట్లే అని అటున్నారు. అపుడు తమకు దక్కిన భారీ సీట్లతో జనసేన రాజకీయం 2029 తర్వాత వేరే లెవెల్ లో సాగుతుంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన లెక్కలు పక్కాగానే ఉన్నాయని చెబుతున్నారు. చూడాలి మరి ఈ రాజకీయ విశ్లేషణలలో రేపటి వాస్తవ దృశ్యాలుగా ఎన్ని ఆవిష్కృతం అవుతాయో.

# 21 నుండి మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళరాదు

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ సూచన



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగ్నేయ బంగాళాఖాతం చుట్టూ అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంపై ఈనెల 21వ తేదీ నుండి చేపల వేటకు వెళ్ళరాదని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించి రాబోయే 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నా రు.చాలా చోట్ల తేలికపాటి నుండి భారీ, అతి భారీ వర్షపాతం నమోదు కాబడే అవకాశం ఉందన్నారు. ఆగ్నేయ మధ్య అరేబియా సముద్రం, లక్షద్వీప్ ప్రాం తం కర్ణాటక, కేరళను ఆనుకుని ఉన్న దక్షిణ తమిళనాడు తీరాల వెంబడి అక్టోబర్ 19 సాయం త్రం వరకు గంటకు 35-45 నుండి 55 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు ఈ అల్ప పీడనం మరింత పెరిగి, అక్టోబర్ 19 సాయం త్రం నుండి అక్టోబర్ 21 వరకు దక్షిణ అరేబియా సముద్రం మధ్య భాగాలలో నైరుతి, పశ్చిమ మధ్య అరేబియా సముద్రంలో అక్టోబర్ 22న గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 19 సాయంత్రం నుండి అక్టోబర్ 21 వరకు దక్షిణ అరేబియా సముద్రం మధ్య భాగంలో అక్టోబర్ 22, న నైరుతి పశ్చిమ- మధ్య అరేబియా సముద్రం అల్లకల్లోలంగా దక్షిణ తమి ళనాడు తీరాల వెంబడి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య అరేబియా సము ద్రంలోకి మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్ల వద్దని సూచించారు ఇది పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించి తదుపరి 48 గంటల్లో దక్షిణ మరియు దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళా ఖాతం మధ్య భాగాలలో వాయుగుండం గా మారే అవకాశం ఉందన్నారు.

# ధ్యానంతోనే పాజిటివ్ థింకింగ్ అభివృద్ధి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ విద్యార్థి దశ నుంచే ధ్యానాన్ని అలవాటు చేయడం వలన విద్యార్థుల్లో పాజిటివ్ థింకింగ్ అభివృద్ధి చెందుతుందని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని ఆదివారపుపేటలో ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విపాసన మెడిటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు ధ్యానంపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన విపాసన మెడిటేషన్ కేంద్రం సభ్యులు ప్రహ్లాద్ తరిగొప్పుల, శివకుమార్, శ్రీకాంత్‌నాయుడులు విద్యార్థులకు ధ్యానంపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ధ్యానం ప్రధాన మార్గంగా తెలిపారు. ప్రహ్లాద్ తరిగొప్పుల మాట్లాడుతూ గత మూడు నెలలుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఏపీ సాంఘిక సంక్షేమ, బీసీ గురుకుల రెసిడెన్షియల్ వసతి గృహ విద్యార్థులకు మెడిటేషన్‌పై ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.విపాసన ధ్యానం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడం,క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవాటు చేయడం, పాజిటివ్ థింకింగ్‌ను పెంచడం ప్రధాన ఉద్దేశ్యంగా తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతా శ్రీనివాసరావు,వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీ శంకర్,సీఆర్ఎంటీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ పదవులపై తుది కసరత్తు.. లోకేశ్ పదవిపై నేడే ప్రకటన?



ముఖ్యమంత్రి షెడ్యూల్ లో ఈ రోజు మూడు గంటల పాటు పార్టీ కార్యక్రమాలకే కేటాయించడంతో పార్టీ కార్యవర్గంపై కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

అధికార తెలుగుదేశం పార్టీలో సంస్థాగత పదవుల పంపకంపై కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. గత ఏప్రిల్ నెలలోనే పూర్తి చేయాల్సిన ఈ ప్రక్రియ అనేక కారణాలతో వాయిదాల మీద వాయిదాలు పడుతోంది. దీంతో ఈ నెలలో ఎట్టి పరిస్థితుల్లోనూ తేల్చేయాలని డిసైడ్ అయిన పార్టీ అధినేత చంద్రబాబు శనివారం మంగళగిరిలో పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్లతో చర్చలకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి షెడ్యూల్ లో ఈ రోజు మూడు గంటల పాటు పార్టీ కార్యక్రమాలకే కేటాయించడంతో పార్టీ కార్యవర్గంపై కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఏటా మే నెలలో నిర్వహించే మహానాడులో తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీల ప్రకటన ఉంటుంది. మే నెలకు ముందుగానే గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను నియమించి మహానాడులో వాటికి ఆమోదిస్తారు. ఇక మహానాడుకు హాజరయ్యే ప్రతినిధులు రాష్ట్ర, జాతీయ కమిటీలను ఎన్నుకుంటారు. గత 30 ఏళ్లుగా పార్టీ అధినేత చంద్రబాబు అధ్యక్షుడిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. గత మే నెలలో జరిగిన మహానాడులో అధినేత చంద్రబాబును మరోమారు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇక రాష్ట్ర కమిటీల ఎంపిక బాధ్యతను అధ్యక్షుడికే అప్పగిస్తూ తీర్మానం చేశారు. అయితే ఈ సారి రాష్ట్ర కమిటీ ఎంపికకు మరో అడ్డంకి కూడా ఉందని అంటున్నారు. జిల్లా కమిటీల ఎంపిక పూర్తికాకపోవడంతో రాష్ట్ర కమిటీ నియామకం సాధ్యమవలేదని అంటున్నారు. పార్టీ అధికారంలో ఉండటం, గతం కన్నా సంస్థాగతంగా బలం పుంజుకోవడం, మరో ఆరు నెలల్లో స్థానిక ఎన్నికలు జరుగుతున్నందున పార్టీ జిల్లా అధ్యక్షుల పదవులకు డిమాండ్ ఏర్పడింది. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్నవారు, జైళ్లకు వెళ్లినవారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని అధిష్టానం సూచించింది. అయితే జిల్లాల్లో పరిస్థితులు వేరుగా కనిపిస్తున్నాయి. గతంలో ఇబ్బందులను అధిగమించి పోరాడిన వారు కన్నా, తమ మాటకు విలువనిచ్చేవారిని జిల్లా అధ్యక్షులుగా నియమించుకునేలా మంత్రులు, ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారని అంటున్నారు. దీంతో మెజార్టీ జిల్లాల్లో సంస్థాగత కమిటీల ఎంపిక కొలిక్కిరాలేదు. జిల్లాల్లో సమన్వయం సాధించడానికి పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు వర్ల రామయ్య ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు షరీఫ్, మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, సవిత, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును నియమించారు. అయితే వీరి మధ్యవర్తిత్వం కూడా పనిచేయకపోవడంతో చాలా జిల్లాల్లో కమిటీల ఎంపిక పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో అధినేత చంద్రబాబు పార్టీపై ఫోకస్ చేయడం ఆసక్తికరంగా మారింది. పార్టీ కమిటీల ఎంపిక కోసమే ఆయన కసరత్తు చేయనున్నారని, అందుకే ప్రభుత్వ పనులు అన్నీ పక్కన పెట్టి పార్టీకి 3 గంటల సమయం కేటాయించారని అంటున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత పార్టీ కోసం ఇంత సమయం కేటాయించలేదని నేతలు గుర్తుచేస్తున్నారు. పార్టీ రాష్ట్ర కమిటీతోపాటు పేచీగా మారిన జిల్లా కమిటీలపైనా ఈ రోజు ఫైనల్ డెసిషన్ తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు పార్టీకి భావి నేతగా పగ్గాలు చేపట్టున్న యువనాయకుడు లోకేశ్ పదవిపైనా ఈ రోజే నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం కూడా తెరపైకి వచ్చింది. మహానాడు సమయంలోనే యువనేత లోకేశ్ ను పార్టీ వర్కింగు ప్రెసిడెంటుగా నియమించాలని డిమాండ్ వినిపించింది. పార్టీ భావి నేతగా లోకేశ్ ను ప్రమోట్ చేయాలంటే ఇప్పుడే ఆయనకు బాధ్యతలు బదిలీ చేయాలని సీనియర్లు సూచిస్తున్నారు. అయితే పార్టీలో ఇంతవరకు వర్కింగు ప్రెసిడెంట్ పదవి లేకపోవడంతో కొత్తగా నియామకంపై ఎలా ముందుకు వెళ్లాలనేది చర్చనీయాంశంగా మారింది. ఈ కారణంగానే మహానాడులో లోకేశ్ పదవిపై ప్రకటన చేయలేదని అంటున్నారు. అయితే మహానాడు తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార విధుల్లో బిజీ అయిపోవడంతో లోకేష్ పదవిపై ప్రకటన కూడా తెరమరుగైంది. ఇక ఈ రోజు పార్టీ కమిటీలపై కసరత్తు మొదలుపెట్టనందున వర్కింగు ప్రెసిడెంటుగా లోకేశ్ నియామకంపైనా తుది నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. దీపావళి సందర్భంగా ఈ ప్రకటన ఉంటుందా? లేక మరో మంచి ముహూర్తం చూసుకుని ప్రకటిస్తారా? అనేదే సస్పెన్స్ గా మారింది.

# దళారులను నమ్మి మోసపోవద్దు : తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి గదుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొందరు దళారులు, మధ్యవర్తులు శ్రీవారి దర్శనం పేరుతో భక్తులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తితిదేలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులమని కొందరు నమ్మించి.. శ్రీవారి బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కల్పిస్తామని ప్రలోభ పెడుతున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి నకిలీ వ్యక్తులు.. భక్తుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇప్పటికే కొందరు దళారులను తితిదే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. https://ttdevasthanams.ap.gov.in, ttdevasthanams మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ ఆధార్ కార్డు ఆధారంగా బుక్ చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. తితిదే సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 155257ను సంప్రదించాలన్నారు. దళారులపై అనుమానం వస్తే తితిదే విజిలెన్స్ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని, 0877-2263828 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తిరుమల పవిత్రత, భద్రతను కాపాడుకుందామని తితిదే ఛైర్మన్ పిలుపునిచ్చారు.

# ఉద్యోగులకు దీపావళి వరమిచ్చిన బాబు



ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులు గత పదహారు నెలలుగా ప్రభుత్వానికి ఎంతో సహకరిస్తున్నారు. వారు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకుని వెళ్తున్నారు. ప్రభుత్వం లక్ష్యాలను అర్థం చేసుకుని దానికి అనుగుణంగా పనిచేస్తున్నారు. అవసరమైతే సెలవు రోజులలో కూడా అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగులకు పాజిటివ్ గా ఉందని సంకేతాలు ఇస్తోంది. వారికి ప్రతీ నెలా ఒకటవ తేదీన జీతాలు ఇస్తోంది. అయితే ప్రభుత్వ ఉద్యోగులకు చాలా డిమాండ్లు ఉన్నాయి. దాని మీద ఉద్యోగ సంఘాల నేతలు అనేక వేదికల మీద ప్రస్తావించారు. తరచూ మీడియా ముందుకు వచ్చి మరీ తమ బాధ చెబుతున్నారు.

**సానుకూలమేనా :** ఇక ప్రభుత్వం అయితే ఉద్యోగుల విషయంలో తాము సానుకూలమే అని చెబుతోంది. మంత్రి వర్గ ఉపసంఘంతో సుదీర్ఘంగా ఉద్యోగ సంఘాల నేతలు శనివారం చర్చించారు. అనంతరం ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వ అధినేత ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు దృష్టిలోకి తీసుకుని వెళ్లారు. ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగులో ఉన్నాయని వాటిని క్లియర్ చేయాలని కోరుతున్నారు. అంతే కాకుండా తమకు కొత్త పీఆర్సీ కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈలోగా ఇంటీరియం రిలీఫ్ ఇవ్వాలని కూడా కోరుతున్నారు. దాని మీద మంత్రుల బృందం సీఎం చంద్రబాబుకు నివేదించింది.

**ఒక డీఏ మంజూరు :** అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల సంఘం నేతల సమస్యలను మంత్రివర్గ ఉప సంఘం తో సమావేశం అయి వారి సావధానంగా విన్నారు అని చెబుతున్నారు. మొత్తానికి సానుకూలంగా ఆయన స్పందించారు అని అంటున్నారు. ఉద్యోగులకు ఒక డీఏను దీపావళి కానుకగా చంద్రబాబు ప్రకటించారు. దీని వల్ల ప్రభుత్వానికి 160 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. అయినా సరే ఉద్యోగుల కోసం ఈ ఖర్చుని భరిస్తూ డీఏ ప్రకటిస్తున్నామని చెప్పారు. రానున్న రోజులలో మరిన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని కూడా ఆయన హామీ ఇచ్చారు.

**వెలుగులు దక్కినట్లేనా :** ఇదిలా ఉంటే నాలుగు డీఏలు పెండింగులో ఉన్నాయని ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు. అందులో ఒకటి ఇవ్వడం మంచిదే కానీ మిగిలినవి కూడా తొందరగా ఇవ్వాలని కోరుతున్నారు. అంతే కాదు ఉద్యోగులకు కొత్త పీఆర్సీని ప్రకటించాలని అంటున్నారు. సాధ్యమైనంత తొందరగా కమిషన్ ని వేయాలని వారు అంటున్నారు. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం దీపావళి కి ఒక తీపి కబురు వినిపించడం పట్ల ఉద్యోగులు అయితే హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పాక్‌లో ప్రతి అంగుళం 'బ్రహ్మోస్' పరిధిలోనే..

**లక్నో**

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌ను గట్టిగా హెచ్చరించారు. పాకిస్తాన్‌లో ప్రతి అంగుళం బ్రహ్మోస్ క్షిపణి పరిధిలోనే ఉందని స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని అన్నారు. భారత్‌పై మరోసారి కయ్యానికి కాలుదువ్వితే అసలు సినిమా చూపించక తప్పదని పరోక్షంగా తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణుల శక్తిసామర్థ్యాలు ఏమిటో ప్రపంచం చూసిందన్నారు. యుద్ధంలో భారత్ విజయం సాధించడం యాదృచ్ఛికం కాదనీ, అదొక అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌లో తయారైన మొదటి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులను రాజ్‌నాథ్ సింగ్ శనివారం సైన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నానాటికీ బలీయమైన స్వదేశీ శక్తిగా ఎదుగుతున్న భారత్‌కు ఈ క్షిపణులు ఒక ప్రతీక అని అభివర్ణించారు. బ్రహ్మోస్ అంటే కేవలం మిస్సైల్ కాదని, భారతదేశ వ్యూహాత్మక విశ్వాసానికి ఆధారమని చెప్పారు. త్రివిధ దళాలకు ఇదొక మూలస్తంభంగా మారిందన్నారు. "ఆపరేషన్ సిందూర్‌లో జరిగినదంతా ట్రైలర్ మాత్రమే. ఒక కొత్త పాకిస్తాన్‌ను భారత్ సృష్టించగలదని పాకిస్తాన్‌కు తెలిసొచ్చింది. కానీ, 'సమయం వచ్చినప్పుడు'.. ఇంతకంటే ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు. మీరంతా తెలివైనవాళ్లని నాకు తెలుసు. చెప్పకుండానే అర్థం చేసుకోగలరు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

**రక్షణ రంగంలో స్వయం సమృద్ధి**

ఆపరేషన్ సిందూర్ భారతీయుల్లో నూతన విశ్వాసాన్ని నింపిందని రక్షణ శాఖ మంత్రి ఉద్ఘాటించారు. ఈ విశ్వాసాన్ని ఇలాగే కొనసాగించడం మనందరి సమ్మిళిత బాధ్యత అని పిలుపునిచ్చారు. మన దేశ శక్తిని ప్రపంచమంతా గుర్తిస్తోందని, కలలను నెరవేర్చుకోగలమన్న విశ్వాసాన్ని బ్రహ్మోస్ క్షిపణులు మరింత బలోపేతం చేశాయని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, మనకు అవసరమైన ఆయుధాలు, రక్షణ పరికరాలను మనమే తయారుచేసుకోవాలని సంకల్పించామని తెలిపారు. రక్షణ తయారీ రంగంలో పెరుగుతున్న మన విశ్వాసానికి, సామర్థ్యానికి బ్రహ్మోస్ మిస్సైల్స్ ఉత్పత్తి కేంద్రం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు.

లక్నో అంటే పార్లమెంట్ నియోజకవర్గం మాత్రమే కాదని, ఈ నగరం తన హృదయంలో ఉందని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలతోపాటు ఆధునిక టెక్నాలజీ, పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా మారిందని



ఆనందం వ్యక్తంచేశారు. లక్నోలో బ్రహ్మోస్ క్షిపణు లు ఉత్పత్తి కావడం చూస్తే ఒకనాటి స్వప్నం నేడు నెరవేరినట్లు తేటతెల్లమవుతోందని ఉద్ఘాటించారు. సహనం, కఠోర శ్రమ, అంకితభావానికి ఈ ప్రాజెక్టును ఒక ప్రతీకగా భావించవచ్చని వివరించారు. ఇక్కడ ప్రతిఏటా దాదాపు 100 క్షిపణులను ఉత్పత్తి చేయొచ్చని, వందలాది మందికి ప్రత్యక్షంగా ఉపా ధి లభిస్తుందని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ యూనిట్ టర్నోవర్ రూ.3,000 కోట్లకు చేరుతుందని, తద్వారా జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి రూ.500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు.

**బ్రహ్మాస్త్రమే**

బ్రహ్మోస్ క్షిపణి సూపర్‌సానిక్ క్రూయిజ్ మిస్సైల్ రకానికి చెందినది.

దాదాపు 300 కిలోల వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు.

పొడవు 8.4 మీటర్లు. వ్యాసం 0.6 మీటర్లు. బరువు 3 టన్నులు

భూ ఉపరితలంపైనుంచి ప్రయోగించే క్షిపణి పరిధి 290 కిలోమీటర్లు. నౌకలపైనుంచి ప్రయోగించి క్షిపణి పరిధి 450 కిలోమీటర్లు. ఈ పరిధిని 800 కిలోమీటర్లకు పెంచడానికి ప్రయోగాలు జరుగుతున్నాయి.

జీపీఎస్ రాడార్ గైడెన్స్ సిస్టమ్ ఆధారంగా దూసుకెళు తుంది.

బ్రహ్మోస్ మిస్సైల్‌లో ఘన ఇంధన బూస్టర్, ద్రవ ఇంధనం క్రూయిజ్ దశ ఉంటాయి.

గంటకు 3,400 నుంచి 3,700 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు.

భూఉపరితలంతోపాటు యుద్ధ విమానాల నుంచి, నౌకల నుంచి, జలాంతర్గాముల నుంచి ప్రయోగించవచ్చు.

2005 నుంచి బ్రహ్మోస్ క్షిపణులు భారత సైన్యంలో సేవలందిస్తున్నాయి. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించాయి. పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలను, శిక్షణ కేంద్రాలను, పాక్ వైమానిక దళం ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశాయి.

**ఆర్థిక రంగానికీ లబ్ధి**

దేశీయంగా బ్రహ్మోస్ క్షిపణుల తయారీతో మన రక్షణ రంగంతోపాటు ఆర్థిక రంగానికి సై తం ఎంతో లబ్ధి చేకూరుతుందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. రెండు దేశాలకు క్షిపణులు ఎగుమ తి చేయడానికి మన బ్రహ్మోస్ టీమ్ ఒప్పందాలు కుదుర్చుకుందని, వీటి విలువ రూ.4,000 కోట్లు అని వెల్లడించారు. శు భప్రదమైన ధన త్రయోదశి రోజే క్షిపణులను సైన్యానికి అప్పగిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. లక్ష్మీదేవి ఆశీస్సులు రక్ష ణ రంగంపై, ఆర్థిక రంగంపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. లక్నోలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్ ఈ ఏడాది మే 11న ప్రారంభమైంది.

# ఎక్కడిదక్కడే ఆపేయండి

**వాషింగ్టన్**

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని రెండు దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పిలుపునిచ్చారు. ఇంతవరకు జరిగిన రక్తపాతం చాలని, ఇకనైనా ఎక్కడిదక్కడే ఆపేసి రెండు దేశాలు వెనక్కు తగ్గాలని సూచించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ శుక్రవారం (స్థానిక కాలమానం) మధ్యాహ్నం ట్రంప్ సమావేశమయ్యారు. ఇద్దరు నేతల మధ్య దాదాపు రెండుగంటలపాటు చర్చలు జరిగాయి. అనంతరం తన సొంత సోషల్‌మీడియా కంపెనీ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఓ పోస్ట్ చేశారు. 'వారు ఎక్కడిదక్కడే ఆపేయాలి. ఇద్దరూ ఎవరికి వారే యుద్ధంలో గెలిచినట్లు ప్రకటించుకోవచ్చు. అసలు విషయాన్ని చరిత్రకు వదిలేద్దాం'అని పేర్కొన్నారు.

**ఇక ఇళ్లకు వెళ్లండి**

యుద్ధాన్ని ఆపేసి ఇరుపక్షాలు చర్చలకు ముందుకు



రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. వారాంతపు సెలవులు గడిపేందుకు ఫ్లోరిడాకు వచ్చిన ఆయన.. అక్కడ మీడియాతో మాట్లాడారు. 'ఎక్కడికైనా యుద్ధక్షేత్రంలోకి వెళ్లి చూడండి. అంతటా తీవ్రమైన పరిస్థితులే. యుద్ధాన్ని ఎక్కడిదక్కడే ఆపేసి ఇరుపక్షాలు ఇళ్లకు వెళ్లిపోండి. కుటుంబాలతో గడపండి. హత్యలు ఆపండి. ఇరుపక్షాలు ఈ పనిచేయటం మంచిది'అని పేర్కొన్నారు. యుద్ధ విరమణపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ గురువారం ఫోన్‌లో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ట్రంప్.. గతంలో జెలెన్‌స్కీని తీవ్రంగా విమర్శించగా, తాజాగా పుతిన్‌పై బెదిరింపులకు దిగుతున్నారు. ఉక్రెయిన్‌లో రష్యా ఆక్రమించిన భూభాగాలను వదిలేసి వెనక్కు వెళ్లాలని హెచ్చరించారు. వెనక్కు తగ్గకుంటే ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి అత్యాధునిక తొమహాక్ క్షిపణులు అందిస్తానని రష్యాను హెచ్చరించిన ఆయన.. తాజాగా మాట మార్చి రష్యాను బెదిరించేందుకే అలా చెప్పానని, ఆ క్షిపణులు ఉక్రెయిన్‌కు అవసం లేదని ఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. యుద్ధం ఆపాలన్న ట్రంప్ ప్రకటనను జెలెన్‌స్కీ స్వాగతించారు. కాల్పుల విరమణ ప్రకటించి, చర్చలు జరిపేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.

# జీఎస్టీ ధమాకాతో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు

ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. అందువల్లే వినియోగదారులు ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలను పొందుతున్నారన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. జీఎస్టీ 2.0పై కేంద్రమంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్ అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో దేశమంతా పండగ వాతావరణం నెలకొందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన దీపావళి కానుక అని పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ డబుల్ ధమాకాతో మోదీ దేశప్రజల ఇంటికి లక్ష్మీదేవిని తీసుకువచ్చారన్నారు. జీఎస్టీ సంస్కరణలు అన్ని రంగాల్లో ఉత్సాహాన్ని తీసుకువచ్చాయని..వీటితో దేశంలోని అన్ని రంగాలు లాభపడతాయని విశ్వాసం



వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణ సమయంలో దేశంలో వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతుందనే దాని గురించి అనేక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలో వినియోగం పెరుగుతోందని.. ఈ ఏడాది దాదాపు రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికాకు స్మార్ట్‌ఫోన్‌లను ఎగుమతి చేయడంలో భారత్ తన పొరుగు దేశాన్ని అధిగమించిందని చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇది దేశం సాధించిన అతిపెద్ద విజయమన్నారు. స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే పలు అతిపెద్ద కంపెనీలు వాటి తయారీలో దాదాపు 20శాతాన్ని భారత్‌లోనే చేపడుతున్నాయని పేర్కొన్నారు.

రైతులకు బ్యాంకులు రుణాలు ఎందుకు ఇవ్వవంటే.. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి, గ్రామీణ అభివృద్ధిని పెంచడానికి వ్యవసాయ రుణాలు చాలా ముఖ్యం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులను వ్యవసాయ రుణాలు పెంచాలని తరచుగా ఆదేశిస్తున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సకాలంలో రుణం అందడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, రైతుల జీవనోపాధికి కీలకం. అయితే ఈ దిశగా కేంద్రం చేస్తున్న కృషికి అనుగుణంగా బ్యాంకులు వీటి పంపిణీని ఆశించినంతగా పెంచడం లేదు. అందుకు కొన్ని సవాళ్లను ఎదురవుతున్నాయనే వాదనలున్నాయి.

నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ భయం

వ్యవసాయ రంగంలో అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వాల రుణమాఫీ పథకాల ప్రకటన కారణంగా రుణాలు తిరిగి చెల్లించడంలో విఫలమయ్యే ప్రమాదం ఉంటుంది. దీని ఫలితంగా బ్యాంకులకు మొండి బకాయిలు పెరిగే అవకాశం ఉంది. పెద్ద పరిశ్రమల మొండి బకాయిలతో పోలిస్తే రైతుల మొండి బకాయిలు తక్కువగా ఉన్నప్పటికీ బ్యాంకులకు ఇది ఆందోళనగా మిగిలిపోతుంది.

రుణాల దుర్వినియోగం

కొందరు రుణగ్రహీతలు వ్యవసాయం పేరుతో బంగారం తాకట్టు రుణాలు తీసుకుని వాటిని రియల్ ఎస్టేట్ లేదా ఇతర వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం (ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో) బ్యాంకు అధికారులు తనిఖీల్లో గుర్తిస్తున్నారు.

## ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను కానుకగా ఇవ్వొచ్చు




**హైదరాబాద్**

రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను ఎవరికైనా బహుమతిగా ఇవ్వొచ్చని ఎన్‌హెచ్ఏఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యాప్‌లో సూచించిన విధంగా వాహన వివరాలు నమోదు చేసి పాస్‌ను పొందవచ్చని పేర్కొన్నది. ఈ వార్షిక పాస్ ద్వారా వినియోగదారులు సజావుగా ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు చేయొచ్చని తెలిపింది. ఈ వార్షిక పాస్ దాదాపు 1,150 టోల్ ప్లాజాలకు వర్తిస్తుందని వెల్లడించింది. వార్షిక పాస్‌కు ఒకేసారి రూ.3000 చెల్లించడం ద్వారా తరచూ రీచార్జ్ చేయాల్సిన పని ఉండదని సూచించింది. వార్షిక పాస్ రీచార్జ్ చేయించిన రెండు గంటల తర్వాత సదరు వాహనానికి ఆ పాస్ అప్‌డేట్ అవుతుందని పేర్కొన్నది. కాగా, ఆగస్టు 15న ప్రారంభించిన ఈ వార్షిక పాస్ ఇప్పటివరకు సుమారు 25 లక్షల వినియోగదారుల మార్క్‌ను దాటగా, రూ. 5.67 కోట్ల ఆదాయం వచ్చినట్టు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది.

## ఆగని కొలువుల కోత..

## ఏఐ, ఆటోమేషన్‌ల ప్రభావంతోనే

**ఈ ఏడాది 90 వేల మంది ఉద్యోగులకు పైగా తొలగింపు**



**న్యూఢిల్లీ**

కార్పొరేట్, టెక్ కంపెనీల్లో ఉద్యోగుల ఊచకోత ఈ ఏడాది కూడా కొనసాగుతున్నది. స్వతంత్ర తొలగింపుల ట్రాకర్ లేఆఫ్. ఎఫ్‌వైఐ ప్రకారం నిరుడు టెక్ కంపెనీలలో 1,50,000 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఇప్పటివరకు ఈ ఏడాది టెక్ పరిశ్రమలో 90 వేల మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపారు. ఒక్క ఫిబ్రవరిలోనే 16,084 మందికి ఉద్వాసన పలికారు. టెక్ ఇండస్ట్రీలో ఏఐ, ఆటోమేషన్ ప్రభావం ఉద్యోగులపై తీవ్రంగా పడుతున్నది. వ్యయ నియంత్రణ, సంస్థల పునర్వ్యవస్థీకరణ పేరుతో సాధ్యమైనంత వరకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించడంపై సంస్థలు దృష్టి సారించాయి. దీనికి టెక్ దిగ్గజం నుంచి స్టార్టప్ వరకు ఏ కంపెనీ మినహాయింపు కాదు. అన్ని రకాల కంపెనీలపై ఆవిష్కరణ ప్రభావం పడింది. ప్రతి పరిశ్రమ ఏఐ, ఆటోమేషన్ జపం చేస్తున్నాయి. దీంతో మానవ వనరులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ట్రాకర్ లేఆఫ్.ఎఫ్‌వైఐ అందించిన వివరాల ప్రకారం ఈ ఏడాది జనవరిలో టెక్ కంపెనీలు జనవరిలో 2,403, ఫిబ్రవరిలో 16,234, మార్చిలో 8,834, ఏప్రిల్‌లో 24,500, మేలో 10,397, జూన్‌లో 1606, జూలైలో 16,142, ఆగస్టులో 6,002, సెప్టెంబర్‌లో 2,205 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి.

**జెప్టోలో 300 మంది తొలగింపు**

క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తాజాగా సుమారు 300 మంది ఉద్యోగులను తొలగించినట్టు ప్రకటించింది. తీవ్ర పోటీ వాతావరణంలో ఖర్చులను తగ్గించాలని సంస్థ భావిస్తోంది. జెప్టో స్థిర వ్యయాలను ఉద్యోగులపై నెలవారీ ప్రాతిపదికన తగ్గిస్తామని కంపెనీ ప్రకటించింది. అయితే కంపెనీ అదే ఉత్పాదకతను కొనసాగించనున్నట్టు తెలిపింది. గత ఏడాది 5 బిలియన్ డాలర్లు ఉన్న సంస్థ విలువను 7బిలియన్ డాలర్లకు పెంచింది. తొలగింపుల ప్రభావం ఆపరేషన్స్, టెక్, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ విభాగాల ఉద్యోగులపై ఎక్కువగా పడినట్టు ఒక అధికారి తెలిపారు. అయితే జెప్టో ఈ ఏడాది ప్రారంభం నుంచి వెయ్యి మంది వరకు ఉద్యోగులను ఇంటికి పంపినట్టు మరో అధికారి చెప్పారు.

## ఒక్క రక్తపరీక్షతో

## 50 రకాల క్యాన్సర్లను గుర్తించొచ్చు

వాషింగ్టన్: ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అనే సామెత వినే ఉంటారు. ఇక్కడ ఒకే ఒక రక్త పరీక్షకు ఒకటికాదు రెండు కాదు ఏకంగా 50 రకాల క్యాన్సర్‌లను గుర్తించవచ్చు. పలు రకాల క్యాన్సర్‌లకు తొలి దశలో ఎలాంటి లక్షణాలు బయటకు కనబడవు. అలాంటి క్యాన్సర్ ముదరబోతోందనే హెచ్చరిక సంకేతాన్ని సైతం ఈ రక్తపరీక్ష అందివ్వగలదు. ఉత్తరఅమెరికాలో ఇటీవల జరిపిన సంబంధిత ప్రయోగం విజయవంతమవడంతో బహుళ వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షకు బాటలుపడ్డాయి. ఈ 50 క్యాన్సర్‌లలో దాదాపు మూడు వంతుల క్యాన్సర్‌లకు ఎలాంటి నిర్ధారణ పరీక్షలు లేవు. కానీ ఈ బ్లడ్‌టెస్ట్‌తో వాటి ఆనవాళ్లను సైతం ముందే కనిపెట్టవచ్చు. సగం క్యాన్సర్‌లను తొలిదశలోనే గుర్తింవచ్చు. దీంతో వాటికి వీలైనంత త్వరగా చికిత్స మొదలెట్టి వాటి బారి నుంచి తప్పించుకోవచ్చు. అమెరికాకు చెందిన 'గ్రెయిల్'ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఈ బ్లడ్ టెస్ట్‌కు 'గ్యాలెరీ'అని పేరుపెట్టింది. క్యాన్సర్ కణితి నుంచి ముక్కలై విడివడి మానవ రక్తప్రవాహంలో చక్కర్లు కొడుతున్న డీఎన్ఏ అవశేషాలను ఈ రక్తపరీక్ష ద్వారా గుర్తించవచ్చు. ఈ డీఎన్ఏ అవశేషాలు ఏ అవయవం నుంచి వస్తుందనేది కూడా ఈ బ్లడ్‌టెస్ట్ ద్వారా తెలుస్తుంది. బ్రిటన్‌లోని నేషనల్ హెల్త్ సర్వీస్(ఎన్‌హెచ్ఎస్) ద్వారా సేకరించిన వేలాది మంది పౌరుల రక్తనమూనాలను పరిశీలించి ఈ బ్లడ్‌టెస్ట్ సామర్థ్యాన్ని గణించారు. అమెరికా, కెనడాల్లో 25,000 మంది యుక్తవయసు వాళ్ల రక్తాన్ని సైతం సేకరించి నూతన తరహాలో రక్త పరీక్ష చేశారు. వీరిలో ప్రతి 100 మందిలో దాదాపు ఒక శాతం మంది క్యాన్సర్‌బారిన పడబోతున్నట్లు తేలింది. వీరిలో తర్వాతి కాలంలో 62 శాతం మందికి క్యాన్సర్ లక్షణాల బయటపడటం విశేషం. "క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల్లో ఇదొక మైలురాయి. ముదరక ముందే క్యాన్సర్‌ను కనిపెట్టడంతో దానికి చికిత్స చేయడం అత్యంత సులభమవుతుంది. చికిత్సలో విజయశాతాలు అద్భుతంగా ఉంటాయి"అని అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని ఒరెగాన్ హెల్త్, సైన్స్ యూనివర్సిటీలో రేడియేషన్ మెడిసిన్ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ నిమా నబాబిజదేహ్ చెప్పారు. "క్యాన్సర్ ఉండకపోవచ్చు అని దాదాపు 99 శాతం మందిలో సాధారణ రక్తపరీక్షల్లో 'నెగెటివ్'అని రాగా, అది తప్పు అని మా రక్తపరీక్ష నిరూపించింది" అని వివరించారు.

బిజినెస్ వాయిస్

## ఫిజికల్ షేర్ల బదిలీ సులువు!

ఇప్పటికీ చాలా మంది దగ్గర ఫిజికల్ షేర్లు ఉండి ఉండొచ్చు. వీటిని డీమ్యాట్‌లోకి మార్చడానికి మదుపర్లు పడే కష్టాలు ఎక్కువే. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి సెబీ ప్రతిపాదనలు చేస్తోంది. 2019 ఏప్రిల్ 1 కన్నా ముందు, వీటి బదిలీకి దరఖాస్తు పెట్టుకున్న వాటిలో అమలు చేయనుంది. ఇందుకు అమలవుతున్న ప్రక్రియలోని అనవసర అంశాలను తొలగించాలని సెబీ నిర్ణయించింది. 'పాత షేర్ల బదిలీకి నిబంధనలను తాత్కాలికంగా సడలించాలని' ప్రతిపాదించింది. ఈ మినహాయింపు నిర్దిష్ట కాలం వరకే ఉంటుంది. కంపెనీ లేదా రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్(ఆర్‌టీఏ) తనిఖీ పూర్తయితే, ఆ షేర్లు నేరుగా మదుపర్లకు చెందిన డీమ్యాట్ ఖాతాలో జమ అవుతాయి. ఈ ప్రతిపాదనతో పాటు ప్రస్తుత ప్రక్రియలో ఉన్న లెటర్ ఆఫ్ కన్ఫర్మేషన్(ఎల్ఓసీ) జారీ చేయడాన్ని తొలగిస్తోంది. 2019 ఏప్రిల్ 1కి ముందు దరఖాస్తు చేసుకున్న వారికి, ఒకవేళ అవి తిరస్కరణకు గురి అయిన పక్షంలో మరోసారి అవకాశం ఇస్తూ 2021 మార్చి 31 వరకు సెబీ గడువు ఇచ్చింది. వేర్వేరు కారణాల వల్ల మదుపర్లు కొందరు ఆ సమయాన్ని వినియోగించుకోలేకపోయారు. మళ్లీ ఈ ఏడాది జులై 7 నుంచి 2026 జనవరి 6 వరకు బదిలీ పత్రాలను తిరిగి సమర్పించడానికి అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే.

## ఇకపై 36 నెలలు ఆగాల్సిందే..
## పీఎఫ్‌లో మారిన ఈ రూల్స్




ఉద్యోగుల కోసం ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పుడు జాబ్ పోయినా, పీఎఫ్ డబ్బులు తీసుకోవడం చాలా ఈజీ అయింది. జాబ్ లేకపోతే పీఎఫ్ డబ్బుల్లో 75శాతం వరకు వెంటనే తీసుకోవచ్చు, మిగిలిన 25శాతం ఒక సంవత్సరం తర్వాత తీసుకోవచ్చు. అయితే పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి మాత్రం 36 నెలలు ఆగాల్సి ఉంటుంది. ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మరో గుడ్ న్యూస్ తెలిపింది. పీఎఫ్ విషయంలో కీలక మార్పులు చేసింది. ఈ రూల్స్ మనీ విత్ డ్రాను మరింత ఈజీగా మార్చనున్నాయి. జాబ్ కోల్పోయిన ఉద్యోగుల కోసం ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. ఒక వ్యక్తికి ఉద్యోగం పోయి, ఖాళీగా ఉంటే, వాళ్ళు తమ పీఎఫ్ డబ్బుల్లో 75శాతం వరకు వెంటనే తీసేసుకోవచ్చు. ఇంకా ఉద్యోగం దొరకకపోతే మిగిలిన 25శాతం డబ్బును ఒక సంవత్సరం తర్వాత తీసుకోవడానికి అవకాశం ఉంది. ఇక్కడ నిరాశ కలిగించే విషయం ఏంటంటే.. జాబ్ పోయిన తర్వాత మీ పెన్షన్ స్కీమ్ డబ్బులు తీసుకోవాలంటే ఇకపై కేవలం 2 నెలలు కాదు.. ఏకంగా 36 నెలలు ఆగాల్సి ఉంటుంది. భవిష్యత్తులో మీకు లేదా మీ కుటుంబానికి పెన్షన్ ప్రయోజనాలు దక్కేలా చూసేందుకే ఈ మార్పు అని ప్రభుత్వం చెబుతోంది. ఆర్థిక భద్రతను ప్రోత్సహించాలనేదే తమ లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది.

# జియోకు 3 నెలల్లో రూ. 2.59 లక్షల కోట్ల ఆదాయం




దేశంలోని దిగ్గజ కంపెనీలు వరుసగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 రెండో త్రైమాసికం క్యూ2 (జులై-సెప్టెంబర్) ఫలితాల్ని ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ఐటీ దిగ్గజ కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తర్వాత టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్ ఇలా అన్నీ వరుసగా ఫలితాల్ని ప్రకటించేశాయి. ఇప్పుడు ఇతర కంపెనీల వంతు వచ్చింది. అక్టోబర్ 17న దేశంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అతిపెద్ద కంపెనీ.. దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండో త్రైమాసికం ఫలితాల్ని వెల్లడించింది. ఇక్కడ మరోసారి రిలయన్స్.. మార్కెట్ అంచనాల్ని మించి రాణించడం విశేషం. సమీక్షా త్రైమాసికంలో రిలయన్స్ నికర లాభం రూ. 18,165 కోట్లుగా వచ్చింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ నికర లాభం రూ. 16,563 కోట్లుగా ఉండగా.. ఇది 10 శాతం పెరిగింది. కంపెనీ కార్యకలాపాల ఆదాయం ఇదే సమయంలో రూ. 2.59 లక్షల కోట్లుగా వచ్చింది. కిందటేడాది ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ. 2.35 లక్షల కోట్లుగా ఉండగా.. ఇక్కడ కూడా 10 శాతం వృద్ధి నమోదు చేసింది.ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ విషయానికి వస్తే మాత్రం మార్కెట్ అంచనాలు తప్పడం గమనార్హం. ఇది రూ. 18,643 కోట్లుగా వచ్చింది. ఇక టాప్ లైన్.. అంచనాల్ని మించి రూ. 2.51 లక్షల కోట్లుగా నమోదైంది. స్థూల ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ. 2.83 లక్షల కోట్లుగా ఉంది. కంపెనీ ఎబిటా విషయానికి వస్తే.. అంటే ఇక్కడ వడ్డీ, పన్ను కలుపుకొని ఆదాయం చూస్తే రూ. 50,367 కోట్లుగానే ఉంది. ఇది వార్షిక ప్రాతిపదికన 15 శాతం ఎగబాకింది. ఎబిటా మార్జిన్ 17.8 శాతంగా ఉంది. ఇది అంతకుముందు ఇదే సమయంతో పోలిస్తే 80 బేసిస్ పాయింట్ల మేర పెరిగింది. సెగ్మెంట్ల వారీగా చూస్తే.. జియో ప్లాట్‌ఫామ్స్ ఆదాయం 14.9 శాతం పెరిగి.. రూ. 7,379 కోట్లుగా నమోదైంది. జియో ఆర్పు (యూజర్ నుంచి నెలకు సగటు ఆదాయం) రూ. 211.4 కు పెరిగింది. అంతకు ముందు ఇదే సమయంలో ఇది రూ. 195.1 గా ఉండేది. రిలయన్స్ రిటైల్ విభాగం రిలయన్స్ రిటైల్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 18 శాతం పెరిగింది. ఆయిల్ టు కెమికల్స్ విభాగం ఆదాయం స్వల్పంగా 3.2 శాతం పెరిగింది. ఆయిల్ అండ్ గ్యాస్ సెగ్మెంట్ ఆదాయం 2.6 శాతం తగ్గింది. ఫలితాల నేపథ్యంలో.. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ ధర పుంజుకుంది. శుక్రవారం రోజు 1.49 శాతం పెరిగి రూ. 1419.10 వద్ద సెషన్ ముగించింది. ఇంట్రాడేలో రూ. 1423.30 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 19.17 లక్షల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 1551 కాగా.. కనిష్ట ధర రూ. 1114.85 గా ఉంది

# ఎంఇఐఎల్‌కు కువైట్ కంపెనీ భారీ ఆర్డర్

కువైట్ ఆయిల్ కంపెనీ (కెఒసి) నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) వెల్లడించింది. కెఒసి నుంచి ఏకంగా 225.5 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1984 కోట్లు) విలువైన ఈ ప్రాజెక్ట్ ఆర్డర్‌తో మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించామని ఆ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కెఒసి బూస్టర్ స్టేషన్ బిఎస్ 171 సమీపంలో ఈ ప్లాంట్ ను 790 రోజుల్లో ఎంఇఐఎల్ నిర్మించి ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహించడానికి ఒప్పందం కుదర్చుకుంది. బిల్డ్ ఓన్ ఆపరేట్ పద్ధతిలో వెస్ట్ కువైట్ ఆయిల్‌ఫీల్డ్స్‌లో కొత్త గ్యాస్ స్వీటెనింగ్, సల్ఫర్ రికవరీ ఫెసిలిటీ (ఎన్‌జిఎస్ఎఫ్ ) రూపకల్పన, నిర్మాణ, నిర్వహణ, సంరక్షణ బాధ్యతలను ఎంఇఐఎల్ చేపట్టనుంది. ఎస్ఆర్‌యు లో నాలుగు శాతం హైడ్రోజన్ సల్ఫైడ్, 10 శాతం వరకు కార్బన్ డైఆక్సైడ్ ఉన్న 120 మిలియన్ స్టాండర్డ్ క్యుబిక్ ఫీట్ల (ఎంఎంఎస్‌సిఎఫ్‌డి) సోర్ గ్యాస్‌ను శుద్ధి చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఇఐఎల్ ఏర్పాటు చేయనుంది. సహజ వాయువులోని తేమను తొలగించి, పర్యావరణాను కూలమైన, శుభ్రమైన, వినియోగానికి సురక్షితమైనదిగా మార్చే గ్యాస్ స్వీటెనింగ్ ప్రక్రియను నిర్మించనుంది. "పశ్చిమ కువైట్‌లోని ఈ వ్యూహాత్మక గ్యాస్ స్వీటెనింగ్ ఫెసిలిటీ నిర్మాణంలో భాగస్వామ్యం అవ్వడం మాకు గర్వకారణం. ఈ ప్రాజెక్ట్ మా సంస్థ పర్యావరణ భద్రత, సాంకేతిక నాణ్యత, ఆపరేషనల్ సామర్థ్యానికి ప్రతిబింబం. ప్రపంచస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలను అందించడంలో మా సమర్ధతను ఇది మరింత బలోపేతం చేస్తుంది" అని ఎంఇఐఎల్ డైరెక్టర్ పి దొరయ్య పేర్కొన్నారు.

# వారిద్దరూ అత్యుత్తమ ఆటగాళ్లు..
# కెప్టెన్సీ వచ్చినా వారితో మునపటిలానే ఉంటున్నా!



టెస్టు కెప్టెన్‌గా స్వదేశంలో మొదటి సిరీస్ గెలుపొందిన శుభ్‌మన్ గిల్ వన్డే సారథిగా తొలి సిరీస్ ఆడబోతున్నాడు. వరల్డ్ కప్ సన్నద్ధతలో ఒకటైన ఆస్ట్రేలియా పర్యటననూ విజయంతో ముగించాలని భావిస్తున్నాడీ యంగ్‌స్టర్. పెర్త్ స్టేడియంలో ఆదివారం తొలి మ్యాచ్‌కు ముందు అతడు మీడియాతో మాట్లాడుతూ సీనియర్లు విరాట్ కోహ్లి రోహిత్ శర్మతో అనుబంధం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్సీ వచ్చినంత మాత్రాన తానేమీ మారలేదని, తమ మధ్య మునపటి సాన్నిహిత్యమే కొనసాగుతోందని గిల్ వెల్లడించాడు. అనుభవజ్ఞులైన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఆస్ట్రేలియా పర్యటనతో కఠిన పరీక్ష ఎదుర్కొంటున్నారు. ఫామ్ చాటుకొని వన్డే వరల్డ్ కప్‌లో చోటే లక్ష్యంగా పెట్టుకున్నారిద్దరూ. మరోవైపు గిల్ పరిస్థితి వేరు. నాయకుడిగా తొలి వన్డే సిరీస్ అది కూడా తాను ఎంతగానో ఆరాధించిన ఆటగాళ్లను నడిపించనున్నాడు అతడు. ఈ నేపథ్యంలో.. కెప్టెన్సీ మార్పుతో కోహ్లి, రోహిత్‌తో గిల్ మధ్య అనుబంధం చెడిందనే వార్తలు వస్తున్నాయి. అయితే.. అవన్నీ కట్టుకథలని అంటున్నాడు గిల్. 'బయట ఏవేవో మాట్లాడుతున్నారు. కానీ, మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ఇంతకుముందు మేము ఎలా ఉన్నామో ఇప్పుడూ అలానే ఉన్నాం. రోహిత్, విరాట్‌కు చాలా అనుభవవం ఉంది. వైట్ బాల్ క్రికెట్‌లో ఇద్దరూ అత్యుత్తమ ఆటగాళ్లు. వీళ్లకు ఆస్ట్రేలియాలోనిపిచ్ గురించి.. పరిస్థితుల గురించి వాళ్లకు బాగా తెలుసు. అందుకే నాకు ఏ సందేహం వచ్చినా వాళ్లను సంప్రదిస్తా. ఏ మొహమాటం లేకుండా ఇద్దరూ నాకు అన్ని విషయాలు చెబుతారు. మనుషుల ఆలోచనలు తెలుసుకొని.. ఆటపై నా సొంత అవగాహన పెంచుకోవాలనుకుంటా. మ్యాచ్ సమయంలో పరిస్థితులకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటా' అని గిల్ వెల్లడించాడు.

**వారసత్వాన్ని కొనసాగించడంపై**

యాభై ఓవర్ల ఫార్మాట్‌లో వెటరన్స్ ధోనీ, కోహ్లి, రోహిత్ వారసత్వాన్ని కొనసాగించడంపై కూడా గిల్ స్పందించాడు. వన్డే కెప్టెన్ అయ్యాక కోహ్లి, రోహిత్‌తో మాట్లాడాను. జట్టును ఎలా నడిపించాలి? డ్రెస్సింగ్ రూమ్‌లో ఎలాంటి కల్చర్ ఉండాలి? వంటి విషయాలను వాళ్లతో ప్రస్తావించాను. ఈ దిగ్గజ ఆటగాళ్లు నాతో చెప్పిన అంశాలు, సూచనలు అన్నీ నాకెంతగానో ఉపయోగపడనున్నాయి. వన్డేల్లో ధోనీ, కోహ్లి, రోహిత్ వారసడిగా ఎంపికవ్వడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది. ఈ ముగ్గురి నుంచి నేను చాలా విషయాలు నేర్చుకున్నా. ఇదివరకూ చెప్పినట్టే ధోనీ, రోహిత్‌లా ప్రశాంతంగా కనిపిస్తూనే.. విరాట్‌లా దూకుడు కనబరుస్తా అని గిల్ పేర్కొన్నాడు. సుదీర్ఘ కాలం భారత జట్టుకు ఆటగాడిగా, నాయకుడిగా రోహిత్, విరాట్ విశేష సేవలందించారు. అయితే.. ఒకరితర్వాత ఒకరు టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరు కొనసాగుతున్న ఫార్మాట్ వన్డే మాత్రమే. వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలనుకుంటున్న ఈ వెటరన్ బ్యాటర్లకు.. ఆస్ట్రేలియా సిరీస్ ఎంతో కీలకం కానుంది. మూడు వన్డేల్లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడింతే.. మరో సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. దాంతో, అనుభవజ్ఞులైన ఈ ఇద్దరూ తమ సత్తా చాటితే టీమిండియాకు తిరుగుండదని విశ్లేషకులు అంటున్నారు. ఆస్ట్రేలియాపై రోహిత్, కోహ్లీకు మెరుగైన రికార్డుంది. రోహిత్ 19 మ్యాచుల్లో.. 990 రన్స్ సాధించగా.. రన్ మెషీన్ విరాట్ 18 మ్యాచుల్లో 802 పరుగులు బాదాడు.

## పాక్ బోర్డు సిగ్గు సిగ్గు..!
## మరో జట్టుతో ట్రై సిరీస్‌ను నిర్వహించే ప్రయత్నం..!



పాకిస్తాన్ క్రికెట్ బోర్డు సిగ్గుమాలిన చర్యలకు దిగుతున్నారు. పాకిస్తాన్ దాడుల్లో ముగ్గురు అమాయక క్రికెటర్లు సహా ఎనిమిది ఆఫ్ఘన్ పౌరులు చనిపోయిన విషయం తెలిసిందే. అయితే, ముక్కోణపు సిరీస్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జాతీయ మీడియా నివేదికలు తెలిపాయి. టీ20 ట్రై సిరీస్ నవంబర్ 17 నుంచి 29 వరకు లాహోర్‌లో షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని పీసీబీ తెలిపింది. పాక్ దాడుల నేపథ్యంలో ఆఫ్ఘనిస్తాన్ టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించినా.. సిరీస్‌ను రద్దు చేయడం లేదని పీసీబీ పేర్కొంది. షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుందని.. ప్రత్యామ్నాయంగా మరో జట్టుతో చర్చలు జరుపుతున్నామని.. చర్చల తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని పేర్కొంది. పాకిస్తాన్‌లో జరగనున్న ముక్కోణపు సిరీస్‌కు తమ జట్టును పంపబోమని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. పాకిస్తాన్ వైమానిక దాడిలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన దేశీయ క్రికెటర్లు కబీర్, సిబ్ఘతుల్లా, హరూన్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దాంతో ఏసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. పాక్ దాడిని ఆఫ్ఘన్ ప్లేయర్లు, పౌరులపై దాడిగా అభివర్ణించింది. ఇలాంటి పరిస్థితుల్లో క్రికెట్ ఆడడం అసాధ్యమని స్పష్టం చేసింది.

క్రీడా వాయిస్

## కెప్టెన్సీ నుంచి తొలగిస్తారని భయపడ్డా సూర్యకుమార్ యాదవ్



భారత క్రికెట్ జట్టు యువ రక్తంతో నిండిపోతోంది. ఇప్పటికే టెస్టు, వన్డే ఫార్మాట్లలో కెప్టెన్సీ మార్పు కూడా జరిగింది. టెస్టులకు రోహిత్ శర్మ స్వచ్ఛందంగా రిటైర్మెంట్ ప్రకటించగా.. వన్డే కెప్టెన్సీ నుంచి భారత క్రికెట్ నియంత్రణ మండలి అతడిని తప్పించింది. ఇక ఈ రెండు ఫార్మాట్లలోనూ రోహిత్ శర్మ స్థానాన్ని యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ భర్తీ చేశాడు. ఇప్పటికే టెస్టు సారథిగా ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్‌ను 2-2తో సమం చేసిన గిల్.. ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్‌ను 2-0తో వైట్‌వాష్ చేశాడు.

**త్వరలోనే టీ20 పగ్గాలు కూడా అతడికే**

ఈ క్రమంలో వన్డే సారథిగా తొలి ప్రయత్నంలోనే ఆస్ట్రేలియా పర్యటన రూపంలో గిల్‌కు కఠిన సవాలు ఎదురుకానుంది. ఇదిలా ఉంటే.. మూడు ఫార్మాట్లలో ఒకే కెప్టెన్ ఉండాలని భావిస్తున్నామని.. త్వరలోనే టీ20 పగ్గాలు గిల్‌కు అప్పగిస్తామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఇటీవల సంకేతాలు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇండియా టుడేతో మాట్లాడుతూ.. "గిల్ రెండు ఫార్మాట్లకు కెప్టెన్ కావడం పట్ల సంతోషంగా ఉంది. తను అద్భుతంగా ఆడుతున్నాడు. అయితే, టీ20 కెప్టెన్సీ విషయంలో నేను అబద్ధం చెప్పను.

**కెప్టెన్సీ చేజారుతుందనే భయం**

ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికైనా కెప్టెన్సీ చేజారుతుందనే భయం ఉంటుంది. అయితే, ఆ భయం నుంచే నన్ను నేను మరింత మెరుగుపరచుకోవాలనే ప్రేరణ కూడా వస్తుంది. మైదానం లోపల, వెలుపల గిల్‌తో నా రిలేషన్ అత్యద్భుతంగా ఉంది. సోదర భావంతో మెలుగుతాం. మనిషిగా, ఆటగాడిగా తను ఎలాంటివాడో నాకు పూర్తిగా తెలుసు. తను ఈ స్థాయికి చేరడం పట్ల సంతోషంగా ఉంది. అందరికీ అతడు స్ఫూర్తిగా నిలిచాడు కూడా!" అని సూర్యకుమార్ యాదవ్ తన మనసులోని భావాలు పంచుకున్నాడు. కాగా అక్టోబరు 18- నవంబరు 8 వరకు ఆస్ట్రేలియా- టీమిండియా మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి.

**ఆసియా కప్ విజేతగా**

ఇందుకోసం గిల్ సారథ్యంలోని వన్డే జట్టు ఇప్పటికే ఆస్ట్రేలియాకు చేరుకోగా.. సూర్య సేన టీ20 సిరీస్‌కు ముందు అక్కడికి చేరుకుంటుంది. కాగా ఆసియా కప్ టీ20- 2025 టోర్నీలో సూర్యకుమార్ కెప్టెన్సీలో టీమిండియా ఇటీవలే చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

## ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చిన యామీ గౌతమ్



బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హక్'. 1985లో జరిగిన షాబానో కేసు ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమా.. ఫుల్ కోర్టు డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న దీనికి.. 'రాణా నాయుడు' అండ్ 'ది ట్రయల్' ఫేమ్ డైరెక్టర్ సుపర్ణ్ వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా 'హక్' రిలీజ్ డేట్ ప్రకటించింది యామీ గౌతమ్. 'ఆమె తన హక్కుల కోసం పోరాడుతుంది..అతను తన నమ్మకాలను కాపాడుకుంటాడు.. ఈ నవంబర్ 7న హక్ సినిమా థియేటర్లలో విడుదలవుతోంది' అంటూ ఓ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో యామీ కోర్టు రూమ్‌లో ఉండగా.. తన ఎదురుగా న్యాయమూర్తులు ఉన్నారు. కాగా.. ఈ చిత్రం నుంచి ఇటీవల వచ్చిన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఇందులో 'నేను కేవలం ముస్లిం మహిళను కాదు.. హిందూస్థాన్‌కు చెందిన ముస్లిం మహిళను. నేను ఈ దేశానికి చెందినదానిని.. అందుకే చట్టం ఈ దేశంలోని మిగిలిన వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తుందో అలాగే నన్ను కూడా చూడాలి' వంటి డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి.



## 'డ్యూడ్' ఫస్ట్ డే కలెక్షన్స్.. ప్రదీప్ కెరీర్‌లోనే రికార్డ్

డ్యూడ్ సినిమాతో తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్ రికార్డ్ క్రియేట్ చేశాడు. ఈ మూవీ తొలిరోజు బాక్సాఫీస్ వద్ద కుమ్మేసింది. ఫస్ట్ డే నాడు లవ్ టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమాల కలెక్షన్స్ కంటే డ్యూడ్ ఎక్కువే కొల్లగొట్టాడు. అక్టోబర్ 17న విడుదలైన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు కీర్తిశ్వరన్ తెరకెక్కించాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఇందులో మితా బైజు, శరత్ కుమార్, రోహిణి,హృదు హరూన్,నేహా శెట్టి తదితరులు నటించారు. ప్రదీప్ గత రెండు చిత్రాలు భారీ విజయం అందుకోవడంతో డ్యూడ్ మూవీకి బాగానే కలిసొచ్చింది. తొలిరోజే డ్యూడ్ దుమ్ములేపాడు. ప్రపంచవ్యాప్తంగా రూ. 22 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌తో సత్తా చాటాడు. ప్రదీప్ రంగనాథ్ కెరీర్‌లోనే మొదటిరోజు అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రంగా డ్యూడ్ రికార్డ్ క్రియేట్ చేసింది. ప్రదీప్ గత చిత్రం రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ ఫస్ట్ డే రూ. 14 కోట్లు మాత్రమే రాబట్టింది. అయితే, ఆ సినిమా విజయం ఇప్పుడు ప్రదీప్‌కు బాగా కలిసొచ్చింది. ఆపై ఈ మూవీకి మొదటి రోజు కంటే రెండో రోజు బుకింగ్స్ బాగున్నాయని సమాచారం. దీపావళి సెలవు కూడా ఉండటంతో డ్యూడ్ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ మార్క్‌ను చేరుకోవచ్చని తెలుస్తోంది. సినిమా విడుదల కంటే ముందే సోషల్‌మీడియాలో ఈ మూవీకి బజ్ క్రియేట్ అయింది. ఆపై యూత్‌కు బాగా కనెక్ట్ కావడంతో థియేటర్స్ కూడా హౌస్‌ఫుల్ అవుతున్నాయి. తమిళనాడు కంటే తెలుగు రాష్ట్రాల్లోనే డ్యూడ్ చిత్రానికి ఎక్కువ కలెక్షన్స్ వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, డ్యూడ్ యూనిట్ నేడు అభిమానులను కలవనుంది. హైదరాబాద్‌లోని మల్లిఖార్జున థయేటర్ వద్దకు సాయంత్రం 6:30 షో టైమ్‌లో రానున్నారు. అక్కడి నుంచి మైత్రీ విమల్ థియేటర్‌కు రాత్రి 10:20గంటల షో టైమ్‌లో చేరుకుంటారు.

## పంచాయతీ కార్యదర్శిగా నటుడు శివాజీ..




వెబ్ సిరీస్‌తో రీ ఎంట్రీ ఇచ్చిన ఒకప్పటి హీరో శివాజీ.. ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తున్నాడు. ఇక ఇటీవల కోర్టుతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకోగా..ప్రజెంట్ నిర్మాతగా మారి మరో చిత్రానికి సిద్ధం అయ్యాడు. క్రైమ్ కామెడీ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందబోతున్న ఈ చిత్రంలో.. శివాజీ హీరోగా నటిస్తుండగా.. సీనియర్ బ్యూటీ లయ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇప్పటికే ఈ సినిమాపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. పూజాకార్యక్రమాలు కూడా పూర్తి చేసుకుంది. ఎస్ఎస్ఎస్ ప్రొడక్షన్ నంబర్.2గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఇందులో నుంచి మరో అప్డేట్ వచ్చింది. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్‌తో కలిసి ఈటీవీ విన్ కూడా ఇందులో నిర్మాణంలో భాగం అయినట్లు తెలుపుతూ.. శివాజీ పాత్రను రివీల్ చేశారు. 'నిజాయితీకి ప్రతిరూపం.. నటుడు శివాజీ పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్‌గా రాబోతున్నాడు.. ఈటీవి విన్ అండ్ శివాజీల కాంబోలో మరో అందమైన మ్యాజిక్ కథ రూపొందుతోంది' అని తెలిపారు. అలాగే.. త్వరలో టైటిల్ అనౌన్స్‌మెంట్ ఉండనున్నట్లు పేర్కొన్నారు.

## శంబాల ప్రపంచంలోకి వెళ్లే టైం ఫిక్స్.. రిలీజ్ డేట్ ప్రకటించిన ఆది సాయికుమార్




హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా కొత్తదనంతో కూడిన సినిమాలు చేయడంలో ముందుండే యాక్టర్లలో ఒకరు టాలీవుడ్ యాక్టర్ ఆదిసాయికుమార్ ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న చిత్రం శంబాల ఈ చిత్రానికిఏ యాడ్ ఇన్ఫినిటీ ఫేం యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఆది సాయికుమార్ శంబాల ఫస్ట్ లుక్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మంటల మధ్యలో నుంచి సైకిల్‌పై వస్తున్న ఆది లుక్ సోషల్ మీడియాలో క్యూరియాసిటీ పెంచుతూ.. సినిమాపై హైప్ పెంచేస్తుంది. తాజాగా మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు. మిస్టికల్ వరల్డ్ లోకి క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న తీసుకెళ్లబోతున్నాం. సూపర్ న్యాచురల్ థ్రిల్స్, ఇలాంటి ప్రపంచాన్ని నిర్మించడం తొలిసారి%ి% స్టన్నింగ్ విజువల్స్, ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, వీఎఫ్ఎక్స్ పార్ట్‌తో భారీగా స్థాయిలో రాబోతున్నాం.. అంటూ ట్వీట్ చేశారు మేకర్స్. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్‌లో పొలంలో వింత ఆకారంలో ఉన్న దిష్టిబొమ్మ.. మరోవైపు ఆకాశం నుంచి భూమివైపు వస్తున్న నిప్పు కణం చూడొచ్చు. అనుమానాస్పద ప్రపంచం.. అంటూ ఆది సాయికుమార్ సరికొత్త పాయింట్‌తో శంబాల చేస్తున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. ఈ మూవీలో అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్, అన్నభీమోజు, మహిధర్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ రాబోతున్న ఈ మూవీలో ఆది జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నాడు. ఈ మూవీకి శ్రీమ్ మద్దూరి సంగీతం అందిస్తున్నారు.



## రూ.150 కోట్ల యాడ్‌లో రణ్‌వీర్ సింగ్, శ్రీలీల.. 'ఏజెంట్ చింగ్ అటాక్' ట్రైలర్ విడుదల




బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ మరియు టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల కలిసి నటించిన ఒక భారీ యాడ్ ఫిల్మ్ టీజర్ తాజాగా విడుదలైంది. ఈ యాడ్ దాదాపు రూ.150 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు సమాచారం. ఏజెంట్ చింగ్ అటాక్ అనే పేరుతో ఈ యాడ్ విడుదల కాగా.. చింగ్స్ దేశీ చైనీస్ అనే బ్రాండ్ ఈ యాడ్‌ని నిర్మించింది. ఇందులో రణ్‌వీర్ సింగ్ ఏజెంట్ చింగ్‌గా కనిపించగా.. శ్రీలీల ఏజెంట్ మిర్చిగా.. విలన్‌గా నటించిన బాబీ డియోల్ ప్రొఫెసర్ వైట్ నాయిస్ పాత్రలో కనిపించారు. ఇక ఈ యాడ్‌కి కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహించాడు. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ ట్రైలర్‌ను మీరు కూడా చూసేయండి.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com